అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 310

సంపుటి: 38 సంచిక: 3 జనవరి 2015

పేజీలు: 52 వెల: రు. 15

కామ్రేడ్ ఎన్.కే.కు జోహార్లు



అరణ్యం నుంచి ఓ పిలుపు వినపడేది
అరణ్య కేకకి శిలలు తలలు ఊపేవి
మైదానం అరణ్యం మధ్య అర్ధ చంద్రాకారంలాంటి ఊయల-
ఊయల కిక్కిరిసి ఉండేది
మైదానం రాజీ పరిమళం వేస్తున్నప్పుడు
నోరుండి మాటపెగలని
చేతులుండి కరచాలనం చేయని
దుస్తులు తొడిగిన బొమ్మల్లా కదులుతున్న మనుషుల వెనుక
అరణ్యం నెమలిపురిలా విచ్చుకుంటుంది

విరసం సాహిత్య పాఠశాల 2015 కు సాదర ఆహ్వానం

ఫిబ్రవరి 7-8, బొబ్బిలి, విజయనగరం జిల్లా
థీమ్: సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం

ప్రారంభ సమావేశం :

* ప్రారంభకులు - కాళీపట్నం రామారావు
  సామాజిక ఉద్యమాలు-ప్రజాస్వామిక విప్లవం, కీనోట్ : పాణి, అధ్యక్షత: కె.కె.కె.వర్మ
* వలస కాలంలో బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు-సాహిత్యం, వక్త: రివేరా, అధ్యక్షత: చంద్రయ్య
* అంబేద్కర్ సామాజిక సిద్ధాంతం-సాహిత్య ప్రతిఫలనం, వక్త: కాశిం, అధ్యక్షత: ఉజ్వల్
* కులం, మతం-కమ్యూనిస్టు, విప్లవ పోరాటాలు, వక్త: సియస్ఆర్ ప్రసాద్, అధ్యక్షత: బాసిత్
* హిందుత్వ-సామ్రాజ్యవాదం-ప్రజాప్రత్యామ్నాయం, వక్త: వరలక్ష్మి, అధ్యక్షత: గీతాంజలి
* కెక్యూబ్ వర్మ, వడ్డెబోయిన శ్రీనివాస్‌ల నిర్వహణలో కవిగాయక సభ
* విరసం సాంస్కృతిక బృందం చేత నాటక ప్రదర్శన, ప్రజాకళాకారుల గానాలుంటాయి.

బహిరంగ సభ

వక్తలు: వివి, కళ్యాణరావు, చలసాని ప్రసాద్, పి.వి.రమణ (ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాట కమిటీ)
అధ్యక్షత: రుక్మిణి

సాహిత్యపాఠశాల నాటికి వచ్చే విరసం ప్రచురణలు:

1) కథల పంట-3, 2) షహీదా కథలు 3) షహీదా కవిత్వం 4) నిత్య, మైనా, సుజాత కథలు 5) దండకారణ్య కథలు-2, 6) జైలు కథలు-బి. అనూరాధ, 7) బీజభూమి-వివి కవిత్వం, 8) కాలిబాట-ఉదయమిత్ర కవిత్వం, 9) రివేరా కవిత్వం 10) కాశీం కవిత్వం 11) కాశీం సాహిత్య వ్యాసాలు 12) బాసిత్ కవిత్వం 13) వేక్ ఆఫ్ తెలంగాణ-నాటకం ఫోల్డర్-బాసిత్ 14) దండకారణ్యం ఒక ఆకుపచ్చని కల-కెనరీ దీర్ఘ కవిత 15) చైనా కమ్యూనిస్టు పార్టీ మౌలిక అవగాహన 16) అగ్నిపుత్రుడి కవిత్వం 17) సాదత్ హసన్ మంటో కథలు (తెలుగులో) 18) పాదముద్రలు కవిత్వం - శాఖమూరి రవి, ఇంకా మరిన్ని పుస్తకాలు. **- విప్లవ రచయితల సంఘం**

వెల : రు. 125/-

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

1970లలో తొలినాళ్ళలో వచ్చిన ప్రత్యేక సంచికలతో మొదలుకొని -
2013లో సాహిత్య విమర్శ ప్రత్యేక సంచికగా వచ్చిన 301వ సంచిక వరకు

డివిడి

అమ్మకానికి సిద్ధంగా ఉంది!

ప్రతులకు :
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్. ఫోన్ : 040-24652387
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్. ఫోన్ : 040-27640574

KLVA101M174

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

310

సంపుటి : 38 ◆ సంచిక : 3 ◆ జనవరి, 2015

సంపాదకుడు

చలసాని ప్రసాద్

వర్కింగ్ ఎడిటర్

డి.వి. రామక్రిష్ణారావు

ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,

కార్బైడ్ కంపెనీ ఎదురుగా,

మౌలాలి, హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా రచనలు పై చిరునామాకూ, ఇ-మెయిల్ ద్వారా **arunatara1977@gmail.com** కూ పంపవచ్చు

సంపాదకవర్గం :

ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామ

మేనేజర్

ఎస్. రవికుమార్

5-1307, దొరసానిపల్లె రోడ్,

ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా

పి. వరలక్ష్మి

5-1820, గీతాశ్రమం వీథి,

ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి.టి.పి. అండ్ లే అవుట్

ఆర్. భాగ్యలక్ష్మి

1, 4 కవర్ డిజైన్

పి. వరలక్ష్మి, క్రాంతి

2, 3 కవర్ డిజైన్

ఆర్. భాగ్యలక్ష్మి

3 కవర్ ఫొటోలు

క్రాంతి, భాస్కర్

http://www.facebook.com/arunatara.virasam

Virasam website : ***www.virasam.in***

ఈ సంచిక వెల : రు. 15/-

సంపాదక లేఖ...

సంఘపరివార్ మత మార్పిడీ కార్యక్రమం చేపట్టింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బి.జె.పి. మత మార్పిడీ నిరోధక చట్టం గురించి తెగ గోల చేసేది. ఇప్పుడు అధికారంలో ఉన్నందున కేంద్రంలోని ఆ పార్టీ మంత్రులే ఈ పని చేస్తున్నారు. వాళ్లు మత మార్పిడీని ఘర్ వాపసీ అని ముద్దు పేరుతో పిలుస్తున్నారు. దేశంలోని ముస్లిం, క్రైస్తవ తదితర మతాల వాళ్లు పూర్వ హిందువులేనని, వాళ్లు హిందూ మతంలోకి రావడమంటే సొంత ఇంటికి రావడమేనని ఘర్ వాపసీ తాత్పర్యం.

ఇదంతా బలవంతపు మత మార్పిడీ అని ఇతరులు అంటే బీజేపీ ఒప్పుకోదు. స్వచ్ఛందంగానే వాళ్లంతా హిందూ మతంలోకి వస్తున్నారని బుకాయిస్తోంది. భారత రాజ్యాంగం ప్రకారం ఏ మతంలోకైనా ఇష్టపూర్వకంగా మారొచ్చు. ఇంతకూ హిందూ మతంలోకి రావడం అంటే కులవ్యవస్థలోకి రావడమే. మిగతా మతాల్లో కూడా అంతరాలు ఉన్నాయి కానీ కుల వ్యవస్థ లేకుండా ఊహించుకోవడానికి కూడా వీల్లేని హిందూ మతంలోకి రావడమంటే ఏదో ఒక కులంలోకి రావడమే. అయితే కులాలు జన్మ సంబంధం లేని ఇతరులను లోనికి రానివ్వవు. అసలు అట్ల రావడమనే ఆలోచనకే తావు లేని వ్యవస్థ అది. సామాజిక న్యాయ సాధనలో భాగంగా ఫలానా కులాల కేటగిరీలో తమ కులాన్ని చేర్చాలని కోరుతున్న వాళ్లు కూడా తమ సొంత కులం గుర్తింపుతోనే ఆ కేటగిరీలో భాగం కాగలరు.

కులం ఇంత సంక్లిష్టమైనప్పుడు హిందూ మతంలోకి వస్తున్నవాళ్లు.. లేదా.. రప్పించబడుతున్న వాళ్లు ఏ కుల గుర్తింపుతో హిందువు అవుతారు? మతాంతీకరణకు భారత సాంఘిక వ్యవస్థ విసిరే పెను సవాల్ ఇది. హిందూ మతంలోంచి ఇతర మతాల్లోకి వెళ్లినంత సులభం కాదు హిందూ మతంలోకి రావడం. దేశస్తులందరూ హిందూ మతస్తులై ఉండాలనే సంఘపరివార్ ఘర్ వాపసీ అనే కూట వాదన ముందున్న కుల వాస్తవికత ఇది. అసలు హిందూ మతం నుంచి వెళ్లిపోయినవాళ్లంతా కుల వ్యవస్థ దుర్మార్గాన్ని భరించలేకే వెళ్లిపోయారనే సంగతి మర్చిపోడానికి లేదు. అంతకుమించి సనాతన అర్థంలో కుల వ్యవస్థలోని అగ్రకులేతరులు హిందువులు ఎలా అవుతారు? అనే పెద్ద ప్రశ్న ఉంది.

సంఘపరివార్ ఎప్పటి నుంచో ఈ దేశాన్ని హిందూ మతావలంబుల దేశంగా మార్చాలనే కల కంటూ ఉంది. ఇతర మతాల్లోకి హిందువులు వెళ్తున్నారని ఇంత కాలం గోల చేస్తూ వచ్చి ఇప్పుడు అధికారం ఉందిగదా అని తానే ఘర్‌వాపసీ చేపట్టింది. సంఘపరివార్ మూలాలున్న శక్తులు రాజకీయాధికారం సంపాదించినంత సులభంగా సాంఘికంగా ఈ దేశాన్ని హిందూమయం చేయడం సాధ్యం కాదని వాళ్లకు తెలుసో లేదో మరి. హిందూ మతంలో కేంద్రం కులం కాబట్టి, అది చాలా లోతైన శ్రమ, శ్రామిక విభజన మీద నిర్మాణమైంది కాబట్టి మతాంతీకరణ ద్వారా దేశస్తులందరినీ హిందువులుగా మార్చడం ఎన్నటికీ అయ్యే పని కాదు. అంత మాత్రాన మతతత్వం ప్రమాదం.. అందునా హిందుత్వ ప్రమాదం గతం కంటే మరింత తీవ్ర స్థాయిలో ఈ దేశాన్ని చుట్టుముట్టిందని మర్చిపోడానికి లేదు. అధికార మార్పిడి తర్వాత ఎన్నడూ లేనంతగా హిందుత్వ ముప్పు పొంచి ఉన్నది. సామాజికంగా తమ కంటే కింద వాళ్ల పట్ల వివక్ష, ఆధిపత్యం చెలాయించే కుల భావజాలాన్ని పెంచే సంఘపరివార్ ఆలోచనలు హిందుత్వను మరింత సంక్లిష్టం చేస్తాయి.

ఇంతకూ మోదీ సంఘపరివార్ మానస పుత్రుడే అయినా ప్రధానిగా తన రాజకీయాధికారంతో ఈ దేశ బూర్జువావర్గ ప్రయోజనాలు కాపాడటమే పరమ ధర్మం. దేశీ, విదేశీ పెట్టుబడులు ఈ దేశాన్ని తీర్చిదిద్దుతున్న తీరుకూ, సాంఘిక సాంస్కృతిక రంగాల్లో సంఘపరివార్ అఖండ హిందుత్వకూ మధ్య పొందిక ఉన్నట్లే తేడా కూడా ఉండొచ్చు. రాబోయే రోజుల్లో ఇదెలా ఉండబోతోందో విశ్లేషించాల్సిందే. ఒకనాటి మత సాంఘిక, భావజాల వ్యవస్థలు మోదీ ఉరుకుల పరుగుల మీద నిర్మిస్తున్న రాజకీయార్థిక వ్యవస్థ మీద ఆధారపడి ఎలా బతికి బట్టకడుతున్నాయో, ఎలా పునరుత్పత్తి అవుతున్నాయో ఇంకా వివరించుకోవలసే ఉంది.

అ

సంచిక - 310

సంపాదకీయం (5-6)
ఎక్కడైనా పిల్లలే కదా - **పి. వరలక్ష్మి**

సంస్మరణ (6)
కామ్రేడ్ ఎస్.కె.కు జోహార్లు - **విరసం**

పాటలు/కవిత్వం (7-12)
రాయలసీమ రాగాలు - **సాదుం శ్రీకాంత్**
కాగితం - **మచ్చ ప్రభాకర్**
మనిషంటే నమ్మకం - **పాణి**
ఉదయభాను కవితలు మూడు - దూరాభారం; కల - నిజం; మా... కవిత్వం
దారి చూపిన స్వప్నం - **పొన్నాయిల కృష్ణవేణి**
నయాభారత్ - **ఫమీదా రియాజ్**
మంచుతెరల నిశ్శబ్దం- **అరసవిల్లి కృష్ణ**
తువ్వాల - **చంద్రయ్య**
ఆర్ట్ ఆఫ్ లివింగ్ - **వడ్డెబోయిన శ్రీనివాస్**
లదాయి తుంగ్‌నా - **పొన్నాల బాలయ్య**

కథలు (13-23)
కట్ట - **వినోదిని**
పెంట - **బమ్మిడి జగదీశ్వరరావు**
తీత్వాల్ కుక్క- **సాదత్ హసన్ మంటో**; అనువాదం : **బాసిత్**

గల్పిక (20)
సింగిల్ విండో - **బజరా**

సాహిత్య వ్యక్తిత్వం (23-28)
అగ్నిపద్యం - అలిశెట్టి ప్రభాకర్ - **వి.వి.**

పుస్తక సమీక్ష (28-36)
గాంధీ నెహ్రూల సెక్యులర్ ముసుగు పూర్తిగా తొలగించే 'ఇండియాలో దాగిన హిందుస్థాన్' - **వి. రాజశేఖర్**
'పల్లెను మింగిన పెట్టుబడి'పై సమీక్ష - **ఎన్. రవి** (మావోయిస్టు రాజకీయ ఖైదీ)

కథ పరిచయం (37-39)
'పాప పుణ్యాల'ను పరిహసించిన సల్తికోవ్‌శ్చెద్రీన్ - **ఎన్.వి.ఎస్. నాగభూషణ్**

అనువాద వ్యాసం (39-41)
పశ్చిమ కనుమల్లోకి ఆపరేషన్ గ్రీన్‌హంట్ - **ఫోరం అగెయినిస్ట్ వార్, జెఎన్‌యూ, ఢిల్లీ**; అనువాదం : **అరుణ్**

సంస్మరణ (41)
ఆర్.ఎస్. చౌహాన్ సంస్మరణ - **సంపాదకవర్గం**

సాహిత్య వ్యాసం (42-45)
దళితవాద కవిత్వం - మిథోపోయి - **బిరుసు సురేష్‌బాబు**

సీరియల్ (46-48)
సూర్యుడు (12) - **కె.వి. కూర్మనాథ్**

లేఖ (49-50)
వి.వి.

(గమనిక : డిసెంబర్, 2014 సంచికలోని సాదత్‌హసన్ మంటో సిరాజ్ కథను అనువాదం చేసిన వారు ఆర్. శశికళగా సరిచూసుకోగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం. - సం.)

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : **arunatara1977@gmail.com**
http://www.facebook.com/arunatara.virasam

ఎక్కడైనా పిల్లలే కదా

- పి.వరలక్ష్మి

పెషావర్ పిల్లల రక్తసిక్త దేహాలను టీవీల్లో చూసి చలించని మనసుండదు. 132 మంది బడి పిల్లలను, తొమ్మిది మంది పాఠశాల సిబ్బందిని కాల్చివేసి, తమను తాము పేల్చుకుని పాకిస్తానీ తాలిబన్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. జరిగిన ఘోరం వెనక ఏ కారణాలైనా ఉండనీ గాక ఇది అత్యంత అమానుషమని ప్రపంచమంతా ఖండించింది. భారతదేశంలో తల్లుల గర్భాలు చీల్చి పిండాల్ని మంటల్లో విసిరేసిన మతోన్మాదాన్ని చర్యకు ప్రతిచర్య అన్న వారు పాకిస్తాన్‌లో అమాయక ప్రాణాల కోసం రెండు నిమిషాలు మౌనం దాల్చారు. బి.జె.పి. ఎం.పి యోగి ఆదిత్యానాథ్ వంటి వాళ్ళు చంపిందీ ముస్లింలే, చనిపోయిందీ ముస్లింలే అయినప్పుడు ఇక మనం ఎవరి కోసం ఏడవాలి అని మాట్లాడి ఉండవచ్చు గాక, మతం మానవతను మంటగలపకూడాదనే చాలా మంది మతవాదులు మాట్లాడారు. పాఠశాలల మీద, ఆసుపత్రుల మీద బాంబులు కురిపించే నాగరిక ప్రజాస్వామ్య దేశాలు ఈ మతిలేని హింసను తీవ్రంగా ఖండించాయి. ఈ చర్యకు బాధ్యత వహించిన తెహ్రీక్ ఎ తాలిబన్ ...(?)

పాకిస్తాన్ చెప్పినట్లు వజీరిస్తాన్ ఆదివాసీ ప్రాంతాల్లో సైన్యం డ్రోన్ దాడులు జరిపి వందలాది పిల్లల్ని, మహిళల్ని చంపిన మాట వాస్తవమే కావచ్చు. అయినా పిల్లలేం చేశారని? దీనిని సామ్రాజ్య వాదంపై, దాని కీలుబొమ్మ ప్రభుత్వంపై ప్రతిఘటనా పోరాటం అని ఎవరైనా అనగలరా? ఎవరో కాదు అఫ్ఘానిస్తాన్‌కు చెందిన తాలిబన్ సంస్థ కూడా పెషావర్ స్కూలు దాడిని ఖండిరచింది. ఏదో సైనిక చర్య జరిగితే దానికీ పిల్లలకు ఏం సంబంధం ఉందని, ఇది ఇస్లాం మౌలిక భావనకు విరుద్ధం అని ప్రకటించింది.

ఇప్పుడిక తాలిబన్ల మీదికి మరింత సైన్యం, మరిన్ని డ్రోన్‌లు వెళతాయి. వజీరిసాన్, స్వాత్ లోయ మరిన్ని బాంబు విస్ఫోటనాలతో కంపిస్తుంది. నల్లటి ధూళి మధ్య మనుషులు ప్రాణాలరచేత పట్టుకుని తరలిపోతారు. ఉత్తర వజీరిస్తాన్‌లో ఆరు నెలల క్రితం మెదలైన మిలిటరీ ఆపరేషన్ 'జర్బ్ ఎ అజ్బ్'లో నిర్వాసితులై దుర్భర జీవనం గడుపుతున్న పది లక్షల మంది లాగా, దక్షిణ వజీరిస్తాన్, స్వాత్ లోయ పరిసర ప్రాంతాల నుండి తరలిపోయిన ఇరవై లక్షల మంది లాగా మిగిలినవారూ చావూ బతుకు మధ్య ఏదో ఒకటి తేల్చుకుంటారు. వీళ్ళంతా తాలిబన్లు అయినా కాకపోయినా, తాలిబన్ల కుటుంబాలు అయినా కాకపోయినా, తాలిబన్ల మద్దతుదార్లు అయినా కాకపోయినా తీవ్రవాదానికి మూల్యం చెల్లించుకుంటారు. వజీరిస్తాన్ ఆదివాసీ ప్రాంతాల పిల్లలు వందలాది మంది అమెరికా, పాకిస్తాన్ ప్రభుత్వాల డ్రోన్ దాడులకు చనిపోతే అప్పుడు వారికై కొవ్వొత్తులు వెలిగించడానికి, వారికై రెండు నిమిషాలు కేటాయించడానికి ఎవరూ ఉండనట్లే ఇప్పుడు వీరికీ ఉండరు. వాళ్ళూ పిల్లలే, కాని మీడియా కన్ను ఇటువైపు మూసుకుపోతుంది. తద్వారా ప్రపంచం కన్నూ మూసుకుపోతుంది. 'మా కుటుంబాల్ని, పిల్లల్ని కోల్పోయిన బాధ ఎటువంటిదో వాళ్ళకూ తెలియజేయాలనుకున్నాం' అని ఆర్మీ స్కూలుపై దాడి చేసిన తాలిబన్లది నిస్సందేహంగా మూర్ఖత్వమే. ఆ పిల్లల తండ్రులే వజీరిస్తాన్‌పై బాంబులు వేసి ఉండవచ్చుగాక. ఆ స్కూళ్లలో చదువుకుంటున్న పిల్లలు కాబోయే సైనికులూ కావచ్చుగాక. ఇది ప్రతీకారం అయితే కావచ్చునేమో గాని పోరాటం మాత్రం కాదు. అమెరికాపై కోపంతో పాశ్చాత్య విద్యను బోధించే వెయ్యికి పైగా స్కూళ్లను నాశనం చేయడం, తమ ప్రాబల్య ప్రాంతాల్లో మదరసాలు నెలకొల్పి మత విద్య బోధించడం, ఫ్యూడల్, పితృస్వామిక మత ధర్మాన్ని బలవంతంగా అమలు చేయడం వంటి చర్యల ద్వారా సామ్రాజ్యవాదంపై సాంస్కృతిక పోరాటం తగనిది, సాధ్యం కానిది కూడా. కాని నేడు సామ్రాజ్యవాదంతో గట్టిగా తలపడుతున్న ప్రాంతాల్లో ఈ తరహా ప్రతిఘటనా పద్ధతులు ఆ సమాజాల్ని గడ్డకట్టిస్తున్నాయి. ఉనికిని నిలబెట్టుకోడానికి సనాతన ధర్మాల్ని ఆధునిక యుగంలో చొప్పించడం వల్ల ముందుకూ పోలేక, వెనక్కూ పోలేక విలవిల్లాడుతున్నాయి. ఇది వాళ్ళకై వాళ్ళు చేసుకున్నది కాదు. సామ్రాజ్యవాదం ఆడిన ప్రమాదకర ఆట ఫలితంగా నెలకొన్న స్థితి ఇది. చరిత్రలో మార్కెట్ రంగ ప్రవేశం వల్ల సమాజాలు ఆధునికీకరించబడి ఉండొచ్చు. ఇక్కడ సామ్రాజ్యవాద మార్కెట్ జోక్యం వల్ల మత మౌఢ్యం పెచ్చరిల్లిపోయింది. ఇటువంటిదే మరో పద్ధతిలో భారతదేశంలోనూ రావచ్చు. రాజకీయాల్లో మత దురహంకారుల జోక్యం పెరిగిపోతే సమాజం ఏమవుతుందో చరిత్ర నిండా ఉదాహరణలున్నాయి.

పెషావర్ విషాదం తర్వాత మీడియాతో ఒక ట్యాక్సీ డ్రైవరు అన్నాడు '2002కు ముందు మాకు మిలిటరీ ఎలా ఉంటుందో కూడా తెలీదు. ఇప్పుడు ఎక్కడ చూసినా సెక్యూరిటీ తనిఖీలే.' నిజానికి 2001 సెప్టెంబరు 11 తర్వాత పరిస్థితులు వేగంగా మార్పు చెందాయి కాని 1980ల్లోనే అఫ్ఘానిస్తాన్ సరిహద్దున ఉన్న పాకిస్తాన్ ఆదివాసీ ప్రాంతాలు అమెరికన్ స్టేట్ టెర్రరిజానికి వ్యూహాత్మక స్థావరాలైనాయి. అఫ్ఘానిస్తాన్‌ను సోవియట్ సైన్యం ఆక్రమించినప్పుడు తాలిబన్లు పాకిస్తాన్ వాయువ్య సరిహద్దులో శిక్షణ తీసుకున్నారు. పాకిస్తాన్, సౌదీ అరేబియా ప్రభుత్వాల సహాయంతో అమెరికా పెంచి పోషించిన తాలిబన్ సోవియట్ సైన్యంపై యుద్ధం చేసింది. సోవియట్ సైన్యం వెనుదిరిగాక అఫ్ఘానిస్తాన్‌లో స్వతంత్ర్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకున్న తాలిబన్లకు, అఫ్ఘానిస్తాన్‌ను గుప్పిట పెట్టుకోవాలనుకున్న అమెరికాకు పేచీ వచ్చింది. అప్పటిదాకా తాలిబన్లను దేశభక్తులు, స్వాతంత్ర్య పోరాట యోధులు అని పొగిడిన అమెరికా తనకే ఎదురుతిరిగే సరికి వాళ్ళను తీవ్రవాదులన్నది. తర్వాత

కామ్రేడ్ ఎన్.కె.కు జోహార్లు

విరసం వ్యవస్థాపక సభ్యుడు, కవి, గాయకుడు కామ్రేడ్ ఎన్.కె. డిసెంబర్ 27న హనుమకొండలో అనారోగ్యంతో మరణించారు. ఎన్.కె పూర్తి పేరు ఎన్.కె.రామారావు. సృజన సాహితీ మిత్రుల్లో ఒకరిగా ఆయన తెలుగులో అభ్యుదయ సాహిత్య వ్యాప్తికి కృషి చేసారు. విరసం స్థాపకుల్లో ఒకరుగా, విరసం కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. ఎమర్జెన్సీకాలంలో జైలు నిర్భంధాన్ని అనుభవించారు. శివసాగర్ పాటలు ఆయన గొంతులో విన్న విప్లవాభిమానులు ఎంతో స్ఫూర్తి పొందారు. హిందూ మత ఆధిపత్య రాజకీయాలపై ఆయన రాసిన సుప్రసిద్ధ దీర్ఘ కవిత 'లాల్ బనో గులామీ చోడో బోలో వందేమాతరం' ఆనాడు రాడికల్స్ పై ఎబివిపి దుష్ప్రచారానికి కౌంటర్. 1983లో, 1985లో పుస్తక రూపంలో విడుదలైన ఈ కవిత మొదట సృజనలో అచ్చయింది. 1982లో రాసిన ఈ కవితకు ఈనాడు మరింత ప్రాసంగికత ఉన్నది. ఆయన కవితా సంకలనం 'రిహార్సల్' పేరుతో వెలువడింది. విరసంలో, విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన విలువైన పాత్రను విప్లవ రచయితల సంఘం గుర్తుచేసుకుంటున్నది. కామ్రేడ్ ఎన్.కె.కు జోహార్లర్పిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు సానుభూతి తెలియజేస్తున్నాం.

- *సంపాదక వర్గం*

(కామ్రేడ్ ఎన్.కె. సాహిత్యం, జీవిత విశేషాలు రాబోయే సంచికలో ప్రచురిస్తాం.)

పరిణామాలు, అమెరికా వాణిజ్య కేంద్రంపై దాడితో ఉలిక్కిపడ్డ సామ్రాజ్యవాదం తీవ్రవాదంపై యుద్ధం చేద్దామని ప్రపంచానికి పిలుపిచ్చింది. అప్ఘానిస్తాన్‌ను పూర్తిగా తన చేతుల్లోకి తీసుకుని కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే కాదు, అమెరికా మార్కెట్ దురాశకు తమ భూభాగాన్ని తాకట్టుపెట్ట నిరాకరించిన దేశాలన్నీ తీవ్రవాద దేశాలే అయినాయి. తాలిబన్లు పాకిస్తాన్‌లో ఆశ్రయం తీసుకుంటూ అమెరికా అనుకూల యుద్ధం చేసినన్నాళ్ళూ అక్కడ ఎటువంటి విధ్వంసక దాడులు లేవు. అంటే నేరుగా తాలిబన్లు అమెరికా ప్రచారం చేస్తున్నట్లు తమ మత మౌఢ్యాన్ని చొప్పించడానికో, ఇస్లాం రాజ్యాన్ని స్థాపించడానికో ఏ దాడులూ చేయలేదు. అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తాలిబన్ల యుద్ధం మొదలవగానే అంతకు ముందరి అమెరికా వ్యూహాత్మక స్థావరాలన్నీ తీవ్రవాద స్థావరాలైనాయి. అప్పటి నుండే పరస్పర దాడులు, ప్రతిదాడులు, ఆత్మాహుతి దాడులు మొదలయ్యాయి. అల్‌ఖైదాను అంతమొందిచానని విర్రవీగినా అటువంటి ఎన్నో సంస్థలు అమెరికాను సవాలు చేస్తున్నాయి. అయితే ఈ మొత్తాన్ని హింస ప్రతిహింసల వలయంగా మాత్రమే చూస్తే చిక్కొస్తుంది. 21వ శతాబ్దపు సామ్రాజ్యవాద యుద్ధం సృష్టించిన సంక్లిష్టత ఇందులో ఉంది.

ప్రగతిశీల ఉద్యమాలు బలహీనంగా ఉన్న సమాజాల్లో సామ్రాజ్యవాద జోక్యం మతాన్ని ప్రేరేపించింది. ప్రాచీన సమాజాల్లోలాగా ప్రజలు సంఘటితమవడానికి మతం ఆలంబన కావడం ఇప్పటి సామ్రాజ్యవాద యుగంలో అంతచిక్కని సంక్లిష్టత. వాటికి బలం, బలహీనతా కూడా మతమే. దీనిని వాడుకోవడం సామ్రాజ్యవాదానికి బాగా తెలుసు. అది సెక్యులర్, స్వతంత్ర రాజ్యాలను ఎదగనివ్వదు. ముజాహిదీన్లను బలపరచడమే కాదు, వారికి శిక్షణ ఇచ్చి, మత సిద్ధాంతాన్ని చొప్పించే పాఠశాలలకు నిధులిచ్చి ఫండమెంటలిజాన్ని పోషించింది. అది ఎదురుతిరిగితేనేమి, శత్రువు ఎంత మూర్ఖుడైతే యుద్ధం అంత సులువవుతుందనుకున్నది కాబోలు. నిజానికి పరిస్థితి అలా లేదు. అయితే దానికి కార్మికోద్యమాలు, కమ్యూనిస్టు ఉద్యమాల లేకుంటే ఎంతో ఊరట. ఇప్పుడు తాలిబన్ల ప్రాబల్య ప్రాంతాలన్నిటా ప్రగతిశీల ఉద్యమాలు తుడిచిపెట్టుకు పోయాయి. భూస్వాములు, వ్యాపారస్తులు, డ్రగ్ మాఫియా సామ్రాజ్యాల అధినేతలూ తాలిబన్ గ్రూపులను ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక పునాదిని సమకూర్చారు. తద్వారా వారు ప్రజాఉద్యమాల నుండి సురక్షితంగా ఉన్నారు. పాకిస్తాన్‌లో ఒక పద్ధతి ప్రకారం ఇస్లామీకీకరణ జరుగుతూ వచ్చింది. జియా ఉల్ హక్ హయాంలో నేరుగా ఇస్లామిక్ చట్టాలను తీసుకొచ్చారు. ఇస్లామిక్ పాఠశాలలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి అమెరికా నిఘా సంస్థ సిఐఏ సహకరించింది. అప్ఘానిస్తాన్ యుద్ధానికి ఇది ఎంతగానో ఉపయోగపడింది. పాకిస్తాన్ ప్రభుత్వానికీ సామ్రాజ్యవాదానికీ మతం మరింత బలం చేకూర్చింది. శాస్త్రీయ సిద్ధాంతం పునాదిగా నడిచే ప్రజాఉద్యమాలు, శ్రామికవర్గ తిరుగుబాట్లు సమాజాన్ని ముందుకు నడిపిస్తాయి. అవి ఎంత బలహీనపడితే అంతగా సమాజం పీడనకు గురవుతుంది. అవి లేకపోతే ఏ ఆలంబనా దొరకక సమాజాలు అంతుచిక్కని ఊబిలోకి కూరుకుపోతాయని ఇప్పటి సామ్రాజ్యవాద యుగం అర్థం చేయించింది.

ఇండియాలోనూ సన్యాసులు, పీఠాధిపతులు రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఇప్పుడు వారికి బాగా బలమొచ్చింది. పత్రికలు, టీవీ ఛానెళ్లు అడక్కుండానే వారికి వేదికలిచ్చి ప్రచారం చేసి పెడుతున్నాయి. సంఘపరివారం అధికారంలోకి వచ్చింది కనుక పుస్తకాల్లో పాఠ్యాంశాలను మార్చివేస్తారు. చరిత్ర స్థానంలో పుక్కిటి పురాణాలను తీసుకురావాలంటున్నారు. భగవద్గీత అధికార గ్రంథం కావాలంటున్నారు. శాస్త్రీయ భావాల పీక నులిమేసి వేదాలను, జోతిష్యాలనూ యూనివర్సిటీల్లో అధ్యయనం చేయాలంటున్నారు. ఆర్.ఎస్.ఎస్. పాఠశాలలు ఇబ్బడి ముబ్బడిగా విస్తరిస్తున్నాయి. అక్కడ చదువుకునే పిల్లల దృష్టిలో హిందూ మతం చాలా గొప్పది. శాస్త్రవిజ్ఞానమంతా అందులోనే ఉంది. పరాయి మతం చాలా హీనమైనది. ముస్లింలు హిందువులకు శత్రువులు. ఆడపిల్లలు హద్దుల్లో ఉండాలి.

ప్రతీకార హింసకు బలైన పెషావర్ పిల్లల గురించి మనం బాధపడ్డాం. మరి మన పిల్లల్ని, మన సమాజాన్ని ఎలా ఎదగనిద్దాం? ఏమి జరిగినా మొదట బలయ్యేది సున్నిత దేహాల, లేత మనసుల పిల్లలే కదా.

రాయలసీమ రాగాలు

-సొదుం శ్రీకాంత్

జాలువారే వంకా
పాలు పోసే ముంత
నీళ్ళు కాగె పొంత
నిద్దురబుచ్చే బొంత

కోల్ కోల్ రన్న
కోల్లో అన్న.....

పొట్టుజల్ల అట్టం
పసులూ ఉండే కొట్టం
రెండెద్దుల కాడి
రామలచ్చుమల జోడి

కోల్ కోల్ రన్న
కోల్లో అన్న.....

సెదలూ తిరిగిన బీడూ
పుట్టాగొడుగుల గూడు
వండి పెట్టి సూడు
తినకుండా ఉండేదెవడు?

కోల్ కోల్ రన్న
కోల్లో అన్న.....

దుబ్బా మీద పెట్ట
గాట్లో గుడ్డు పెట్ట
పెనంపై ఏచ్చె అట్టా
పొదుక్కు పెట్టవా ఎట్టా?

కోల్ కోల్ రన్న
కోల్లో అన్న.....

పల్లెకు సెరువు కట్ట
నోట్లో నాలిక అట్టా
ముందే మంది మిట్ట
కరువు వచ్చే ఎట్టా?

కోల్ కోల్ రన్న
కోల్లో అన్న.....

గాటిన కాలి గిట్ట
ఉట్టిపై వెన్న పెట్ట
దొడ్లో ప్యాడ తట్ట
సేండ్లో మండే కట్ట
కల్లంలో రాసుల గుట్ట

కోల్ కోల్ రన్న
కోల్లో అన్న.....

కాగితం

- మచ్చ ప్రభాకర్

ఇప్పుడే
పెనుగాలి తుఫానుకు
ఎగిరిపడి నా ఒడిలో తలదాచుకున్న
తెల్ల కాగితాన్ని
చేతులతో ఎత్తి, వేళ్ళతో ముద్దాడి
గుండెకు బలంగా హత్తుకొని
ఆశ్రయమిచ్చి అభయమిచ్చాను!
ఇంతలో
ఆగ్రహించిన తీర కెరటం ఉప్పొంగి
ఎగిరి గంతేసి ఒక్క తన్నుతో
గూడెం గూడాలనన్ని ఎత్తుకొని
ఆమడ దూరాన విసిరేసి వికటాట్టహాసం చేసింది!
మట్టిలో పుట్టిన బలమైన కాళ్ళే
నేలపై నిలబడలేక ఎగిరిపోతుంటే
వరదొచ్చి కొట్టుకుపోయి ఊతకోసం ఎదురుచూస్తుంటే
ఇతడేమి? దొరికిన కొయ్యను రెండు చేతుల అదిమి పట్టుకోక
ఒక చేత్తో నన్ను మరో చేత దాన్ని అలుముకొని
ప్రాణాలపై తెచ్చుకుంటున్నాడేమని
అనుమానించి
గాలిలో బతికే మాలాంటి వారికోసం
ఇంత త్యాగం ఎందుకయ్యాని ప్రశ్నించింది.
పిచ్చి తల్లీ! నీ బ్రతుకు బరువు ముందు నాదెంత?
ఎన్ని పెనుగాలులు వీచినా తట్టుకొనేదీ నీవు
చూశావుగా! ఒక్క గాలి కెరటానికే మేము
ఎలా తటపట కొట్టుకొని బంతిలా ఎగిరిపడ్డామో?
నీ బలమే నాకు ధైర్యమిచ్చింది
అందుకేనమ్మా! నిన్ను నా గుండెకు హత్తుకొని దాచుకున్నా.

ఉదయభాను కవితలు మూడు

దూరాభారం

కొమ్మమీద పక్షుల గుంపు
బాణం తగలగానే
ఒకటి నెత్తురు కక్కుకుంటూ నేల రాలుతుంది
చెట్టుపక్కని ఇంటి కిటికీ రెక్కలు
దబాల్న మూసుకుంటాయి
చెట్టు చెమ్మగిల్లుతుంది
పక్షి నేలకూలినందుకు కాదు
కిటికీలు మూసుకున్నందుకు.

కల - నిజం

అర్ధరాత్రి గాఢ నిద్ర
అయినవాళ్ళందరూ కళ్ళముందే చంపబడుతూ
వెన్నెల కళ్ళతో కట్టుకున్న ఇళ్ళు కూల్చబడుతూ
ఆకారం లేని మనిషో, జంతువో, మరేదో
వెంటపడి వెంటపడి తరుముతుంటే
తట్టు తాకి ప్రవాహంలో పడి
శక్తినంతా కాళ్ళలో నింపుకుని లేవబోతే
మోకాటి లోతు నీటిలోనూ మునిగి మునిగోపోతూ
ఆ ఆకారం లేనిదాని గుప్పిట చిక్కినప్పుడు
కెవ్వుమని కేక వేస్తే
కేక చెవిని చీల్చి నిద్రాభంగమై లేచి కూర్చుంటే
చుట్టూ అంతా చీకటి
పాడుకల.... పీడకల
కాసింత కలవరపడి నిద్రలోకి జారుకుంటాం
కల అయితే సర్దుకుంటాం గాని
నిజమే అయితే?!

మా... కవిత్వం

బోగి పెంకుల పెదవంచులపై
తారాడుతున్న గతాన్ని
పలవరింతల అస్పష్ట ధ్వనుల్లో
దరువేస్తున్న ధాతువుల్ని
సముద్ర శ్వాసలో
తన్నుకువస్తున్న బడబాగ్నిని
రాత్రి పగలు నడి వీధులలో
తరలిపోతున్న శవాల వాసనల్ని
కాటి కాపరి ఒంటరి గీతాలకు
కోరసిస్తున్న అగ్ని కీలల చిటపటల్ని
గుక్కపట్టి ఏడుస్తున్న
గుండెల్లో రక్త తరంగాల్ని
ఆత్మహత్యలకు ఒడిగట్టిన మనిషి
అప్రకటిత అభిశ్వాస తీర్మానాన్ని
ఒడిసిపట్టుకుని ఒడిసెల విసిరే
రౌతు చేతులే మా... కవిత్వం

మనిషంటే నమ్మకం

- పాణి

మనిషి అంటే మొత్తం
ప్రేమే కాదు కోపమూ
తోడే కాదు ఎడబాటూ
ఆనందమే కాదు విషాదమూ

మనిషంటే
నిరంతరంగా సాగే సంభాషణలో చిన్న విరామం
త్రుటిలో విరిగిపోయే మాటను
తిరిగి అతికించుకోవడం

మనిషంటే
లోలోపల ముట్టుకొనే పలవరింత
గాయమైన చోటే పూచే పువ్వు
ఎండిపోతున్న మొక్కకు చారెడు నీళ్లు పోసే తోటమాలి
బంధాలన్నిటిలోకి పొంగిపొర్లే కన్నీటి వెల్లువ

మనిషంటే
కలలలో మెలకువలో మంది గురించి రింగులు తిరిగే ఆలోచన
ఆదాటున నడుస్తోంటే
కాల్లో ముల్లు విరిగిన సలపరింపు
పడిపోతోంటే భుజాన్ని ఆసరా ఇచ్చే ఆలంబన

మనిషంటే
అడగకుండానే ఏం కావాలో తెలుసుకొని ఇవ్వడం
కావాల్సింది అడిగి తీసేసుకోవడం

మనిషంటే సంబంధం
నిలువెల్లా మెలిబెట్టే నొప్పితో కూడా
ఇతరుల నుదిటిపై వాలే వెచ్చని కరస్పర్శ
లోపల తెగిపోతున్నా
తెలిసినవాళ్లతో.. తెలియని వాళ్లతో
అలవోకగా సాగే అల్లిక

మనిషంటే
దు:ఖమూ కన్నీటి మధ్యే
రుతువులన్నిటిలో చిగురించే నమ్మకం.

దారి చూపిన స్వప్నం

- సొన్నాయిల కృష్ణవేణి

గతరాత్రి నేనొక సత్యాన్ని కలగన్నాను
ఆ కలలో అద్భుతాల్ని చూసాను
మల్లెలు మందారాలవ్వడం చూసాను
పులుల్ని వేటాడి సగర్వంగా నిలిచిన లేడిని చూసాను
నిప్పులా మండుతున్న మంచుని చూసాను
అస్తమిస్తున్న సూర్యుడి ఎర్రటి కాంతిలో
రేపటి ఉదయానికి దారులు వేస్తున్న
ఒక యోధుణ్ణి చూసాను
ఆ యోధుడి నవ్వులో
వెన్నెల కురిపించే సూర్యుని చూసాను
ఆ యోధుడు అమరుడయ్యాడని తెలిసి

నా కళ్ళు కన్నీటి చెలమలయినప్పుడు
అతను నా ఎదుట నిలిచి, నా కన్నీళ్ళు తుడిచి
నా చేతికి మోదుగు పూలిచ్చి ఇలా చెప్పాడు
'సోదరీ. . . నీ దు:ఖమే నా మరణం
నీ సంకల్ప బలమే నా జీవనం
నా ఆశయాలను నీ ఆలోచనల్లో సంఘర్షించనీ
ఆ సంఘర్షణలో నన్ను జీవించనీ'
హఠాత్తుగా మేలుకొని నా చేతుల్ని చూసాను
నా చేతిలో నవ్వుతున్న మోదుగు పూలు

నయాభారత్

- ఫమీదా రియాజ్

అయితే నువ్వూ మాలాంటి వాడివేనని తేలిపోయింది!...
ఇంత కాలం ఎక్కడ దాక్కున్నావు మిత్రమా?

ఆ మూర్ఖత్వం, ఆ అజ్ఞానం
శతాబ్దం పాటు మేము పొర్లాడిన బురదలోనే-
అది నీ తీరానికీ చేరుకుంది
అభినందనలు మిత్రమా నీకు!

మతం బావుటా ఎత్తుకున్నావు
బహుశా నువ్వు హిందూ రాజ్యాన్ని స్థాపిస్తావనుకుంటాను
నువ్వు కూడా అన్నీ కలగాపులగం చేసేస్తావు
నువ్వు కూడా నీ సుందరవనాన్ని ధ్వంసం చేసుకుంటావు

నువ్వు కూడా కూర్చుని విచారిస్తావు-
నేను చెప్పగలను సన్నాహాలు ఇప్పటికే మొదలై ఉంటాయి-
ఎవరు (సిసలైన్ద) హిందువో, ఎవరు కాదో
త్వరలో నువ్వు ఫత్వాలు జారీ చేస్తావు కాబోలు!

ఇక్కడ కూడా జీవించడం కష్టతరమవుతుంది
ఇక్కడ కూడా నువ్వు చెమట, నెత్తురు చిందిస్తావు
ఇంకాస్తలో నువ్వు పయనిస్తావు నిరుత్సాహ తీరానికి
నువ్వు కూడా గాలాడక ఎగ
శ్వాస తీస్తావు మావలెనే

నేనెంత వ్యాకులపడుతూ ఉండేవాడినో
మరిప్పుడు, ఆ తలంపుకు నవ్వుకుంటాను
మీరు సరిగ్గా మాలాగే తయారవటం!
అయినా ఒకప్పుడు మనమిద్దరమూ ఒక్కరమే కదా!

విద్య, విజ్ఞానం గంగలో కలుపుదాం
అజ్ఞానపు కీర్తిని గానం చేద్దాం
నీ గమనంలో అగాధాలను చూడొద్దు

పూర్వకాలాన్ని పునరుద్ధరించు

గట్టిగా సాధన చేసి అలవర్చుకో
నిరంతరం వెనక్కి నడిచే నైపుణ్యాన్ని
వర్తమాన తలంపు ఒక్కటి కూడా దరిచేరనివ్వకు
గతం నుండి నీ ధ్యాసను మళ్లించకు

మళ్ళీ మళ్ళీ సాధన చేసి సాధించు
మళ్ళీ మళ్ళీ ఈ పలుకులే పలుకు
ఎంత దివ్యంగా ఉండేది ప్రాచీన భారతదేశం
ఎంత ఘనమైనది గతించిన కాలం

అప్పుడు, ప్రియ మిత్రులారా, మీరూ వచ్చేస్తారు
ఏమైనాగాని స్వర్గానికి చేరుకుంటారు
మేమక్కడే ఉన్నాం కొద్ది కాలంగా
మీరక్కడే ఉండేవారు ఒకప్పుడు
అదే క్రూర కుహరంలో ఉండేవారు ఒకప్పుడు
నన్ను మర్చిపోవద్దు, నీ క్షేమ సమాచారం తెలుపుతూ ఉండు!

(ఫమీదా రియాజ్ పాకిస్తానీ కవి. ఈ కవితను సంజీవ్ భట్ ఇంగ్లిషులోకి అనువదించారు. తెలుగు అనువాదం: మిసిమి)

మంచుతెరల నిశ్శబ్దం

- అరసవిల్లి కృష్ణ

ధారలుగా కురిసే
నీడల చాటున
మంచు తెరల నిశ్శబ్దం
నడుస్తున్న కాలం జ్వరపీడిత
మూలుగులాంటి స్వరం
మనుషులు గడ్డ కట్టినట్లు
ప్రవాహం ఆగినట్లు
శిల్పి చెక్కిన కనుల నిశ్శబ్దం
దేశం మట్టిముద్ద
తడిమట్టిపై చిగురించని సంభాషణ

దొంగ అని దేహంపై ముద్ర పడితే
తూటా దేహాన్ని గాయం చేస్తుంది
ప్రజల ప్రేమికులు, నిర్జన
ప్రాంతంలో హతం చేసి
ముద్దు ముద్దు మాటలతో
ఎదురు చూపులన్నారు
గాలి సడి లేదు
చెట్టు ఆకు ఊగలేదు

రక్త బిందువులలో వేలిని ముంచి
ఒక్క నినాదం రాయలేదు

ఎండిన ఆకులా రైతు విరిగిపోతున్నాడు
రైతు దంపతులు చావు బొమ్మలయినారు
పంటపొలంలో మృత్యు దృశ్యం
కిక్కిరిసిన రైలులో
చీకటిని తడుముతూ ఉపాధి కూలి
రోడ్లపై కాళ్ళను అనించి నడుస్తున్నాం
అన్నపు రాశిపై
మనిషి సంతకం చేస్తూనే ఉన్నాడు
రాతి శిలలను
ఈనుకొని నిద్రిస్తున్నాం
నేలకొరిగిన నక్షత్రాల కాంతిని
తడిగుడ్డతో దాచేశాం

మతం ఓ ఉదయపు తెర
తెల్లారితే
మంచినీటి కుండల నిండా మతం వాసన
అంతా ఒకే దేవుని సంతానం
దేవుని గుమ్మం దగ్గర
ఓ అడ్డుగోడ
దళిత పురాణం వినని ఆశల పక్షి
ఎవర్ని కదిపినా
ఆకులు రాల్చే చెట్లలా
వర్షించే మేఘ నయనంలా
అంతర్థాన మృత్యు తారాజువ్వలా
మనుషులంతా గంగి గోవులయినారా!!
బతుకు రాట్నంలో
దారిని వెతుకుతున్నారా!!

అరణ్యం నుండి ఓ పిలుపు వినబడేది
అరణ్య కేకకి శిలలు తలలు ఊపేవి
మృత్యువును కాలితో తన్ని
పగలబడి నవ్వేది అరణ్యం
గోవులను పులులుగా మార్చింది
మైదానం - అరణ్యం మధ్య
అర్ధ చంద్రాకారం లాంటి ఊయల
ఊయల కిక్కిరిసి ఉండేది
మైదాన ప్రాంతం రాజీపరిమళం వేస్తున్నప్పుడు
అరణ్యం పొరలు - పొరలుగా
నోరుండి మాట పెగలని
చేతులుండి, కరచాలనం చేయని
దుస్తులు తొడిగిన బొమ్మల్లా కదులుతున్న
శరీరం లోపల ప్రతిమలని దాచుకున్న
మనుషుల వెనుక
అరణ్యం నెమలి పురిలా విచ్చుకుంటుంది.

మధ్యాహ్నం ఎండ వేళలో
ఊరిచివరి బావి నుండి
బిందె నీళ్ళు మోస్తున్న
ఆ ముసలి అవ్వ చిర్నవ్వులో
నాగ్‌పూర్ అరణ్యం కనబడుతున్నది

తువ్వాల

- చంద్రయ్య

నాలుగు నిలువు దారాల
మరో నాలుగు పొడవు దారాల
పెనవేతలో పుట్టిన తువ్వాల
నాకు ఎంతగానో ఆత్మీయమైంది
అసలు తువ్వాల ఎవ్వరికి మాత్రం
ఆత్మీయం కాదు
మట్టికాళ్ళు లేకుంటే తప్ప

మట్టినుంచి పుష్పించిన తువ్వాల
మా అయ్య నెత్తిపైకి చేరుతానని
ఒక్కటే పోరు పెట్టేది
అప్పుడు కానీ తెలియలేదు నాకు
అది ఎండాకాలమని

వాన చినుకులు తన శరీరాన్ని
తూట్లు పొడుస్తాయని తెలిసినా
వర్షంతో పోరాడేది
తను నమ్ముకున్న వాడ్ని రక్షించటానికి

వెట్టి చాకిరితో ఎముకల గూడై
చనిపోయిన మా తాత కాలం నుంచి
నాదాక తువ్వాలను
కడుపుకు బిగ్గరగా చుట్టుకొని
బోర్లా పడుకుంటే ఆ పూట
ఆకలి భారం తేరేది

పెండ్లి పనుల్లో
మా అయ్యను తలపాగాలా అల్లుకొని
గౌరవాన్ని తెచ్చిపెట్టేది

మందు మాకులు కరువైన
నా పల్లె మనుషులకు
తలనొప్పిని పోగిట్టే డాక్టరమ్మే

జీవితాన్ని మట్టిగంపలుగా కొలిచే
కూలీలకు మెత్తని పరుపయ్యేది

పెళ్ళికాని ఆడపిల్లల
ఎదపొంగులను దాచే పైటలా మారేది

అలసి సొలసిన మంది
మందుగలిపిన కల్లు తాగుతుంటే
వారి నోటికాడ వడపోత బట్టయ్యేది

శవాన్ని ముట్టుకోడానికే
ఇష్టపడని మనుషుల మధ్య
శవాన్ని తలపాగాలాగా ఆత్మీయంగా అల్లుకునేది

మనిషితనం క్షీణించిన
మర మనుషులకు అందనంత ఎత్తులో
మానవత్వపు జెండాగా రెపరెపలాడుతోంది

ఆర్ట్ ఆఫ్ లివింగ్

- వడ్డెబోయిన శ్రీనివాస్

ఊడ్చి ఊడ్చి మేమే
చీపిర్ల మైపోయినాం
చెత్త కుప్పేసి కుప్పేసి
చెత్త కుండీల మీద
వాసనలమైపోయినాం
బాట శుద్ధి చేసి శుద్ధి చేసి
అశుద్ధ బాటలమైపోయినం
మురుగు కాల్వలు గీరి గీరి
మురికి నీరై కారిపోయినాం
మా ఒంటి మీది బట్టలు
బాట మీద గాలికి దొర్లే గుడ్డలైనాయి

నల్లింటికలు తెల్లబడ్డ గాని
దొరా! మమ్ములెవ్వలు పోట్వలు దీయలె!
మా కూల్లె రాయి దియ్యలే!
కుళ్ళిన చెత్త కుండీల మైపోతున్నా
కుక్కలెక్కన్నా ముర్క సూల్లే!

చెమటంటని పన్జేసి పన్జేసి
మీకు దమ్ముకొచ్చినట్టుంది
అయ్యా! శీలవంతులారా!
మీరు రామసక్కదనంగ ఉన్నాంద్రు

చెంచాలు బట్టే ప్రతిభావంతులు
చీపిర్లు బడ్తే
బాటమీది చేత్త
భలేమంచి భాగ్యమని ఎగరింది
రోడ్డు మీది దుబ్బ
రోల్స్ రాయిస్ కారెంబడి ఉరికినట్టు
సంబుర పడ్డది
చీపిర్లు
షవరుబాతు చేసినట్టు ఫీలైనై

మీ ఒంటి వాసనల్తో
మురికి కాల్వ ముర్సిపోతోంది
పిచ్చి మొక్కలు పీకే పోటీలో
పోట్వలే పిచ్చెక్కిపోతానై
మీ తళతళలాడే బట్టల మెరుపుకు
మురికి బాటలు నోళ్ళు దెర్సినై
ఇస్త్రీ నలుగని ఇర్గదీసుదుకు
ఇనుప ఇసిరెలు ఇక ఇకలు పకపకలైనై

ఊడ్సుట్లనే
మా ఒయిస్సు ఒళ్ళిపోయినా
మీరూడ్తేనే దేశం తెల్లబట్టైయ్యింది
అబ్బ! ఎంత మంచిగుంటయో
ఎన్నికల పోస్టర్లు ఇగ
ఊడ్చి ఊడ్చి మల్లెపూలు
మట్టి గుడ్డలైతలేవు
మల్ల మల్ల మల్లెపూలే అయితానై

పిల్లొచ్చి గుడ్డనెక్కిరిచ్చినట్టు
ఈ పోట్వ ఊడ్చుడుగాళ్ళు
నాకే పాఠం జెప్పుదేందని
రోజు అయిదు గుంటల ఇల్లు వాకిలూడ్చే
నెక్కొండ ఉప్పలవ్వ
ఒక్కటే రంధి వద్దాంది గని
మా మన్సెంతిరిగింది బిడ్డ!

మరుకలు మరుకలైనోళ్ళు
మట్టి ఊడ్వంగనే
మనుషులైతరా!
దేశాన్ని చెత్త చెత్త చేసినోళ్ళు
చెత్తూడ్వంగనే
ఛెమక్కున మెర్తరా!
సొక్కం మన్సు లేనోళ్ళే
సొక్కం భారతమంటాంద్రు

మేమే ఊడ్సి సత్తానమంటే
మల్ల బల్లె మా పిల్లలకు
చీపిరిత్తాండ్రు

సుక్క చెప్పుగారని
సొక్కం సొక్కమంటే
గ అనుమానపు ఎంకటి
అంగడి యాదికొత్తాంది
సొక్కం నారవుతం గాదని
కండ్లు దెర్వని బిడ్డను బండగొడ్తే
కొండకు నెర్సింది

జ్ఞానవంతులారా! తెల్ల బట్టల
చెత్త సిగ్గుపడే సొక్కం భారతానికి
ఎదురవక
సద్దిముల్లె లెక్క దగ్గరై సలీముద్దీన్
సందులబడి పోయిండు
దొరా! మీరు బతకడానికి
మా బతుకు ఊడ్వాలా!
అట్లైతే ఇగ మేం జేసే పని మీర్జేస్కొని
మీర్జేసే పని మాకియ్యండ్రి

లడాయి తుంగ్‌నా

- పొన్నాల బాలయ్య

కష్టా పానాదులల్ల పోట్రాయిదాకి కౌశిన రగుతం
రదామండలం మంట రగులుతుంది దుక్కం
ఛల్ రే దాదా! ఛల్ ఛల్!
గతమొక గాయాల సుడిగుండం
తాతిపరంగా నన్ను ఒక తంతెక్కుదాం పా!
ఎందుకురా తమ్మీ! మన యీ శెత్త!
ఇయ్యాల్ల యింట్లె రేపు మంట్లె
నవిసె యిప్ప పువ్వోలెనే వాడిపోబోతుందిరా పానం
కట్టాలు మనుషులకే కాదు యియ్యాల్ల
సెట్లు గుట్టలు కూడా కుములుతున్నయ్!
ప్రకృతంతా తన అస్తిత్వానికి ఔగోలిత్తంది
ఈ భూమ్మీది అడివి అడివంతా ఆగమ్మ పచ్చయింది

అన్నే శ్రీరామా!... గాన్నే
గుహుడు ఘనమైన గంగానదని దాటిచ్చిన కాన్నే!
అన్నే! అసొంతనే! ఆదివాసీ అవ్వ శబరి
ఎంగిలి పండ్ల రుచి చూపించి అన్నే రామా! అన్నే!
రాళ్ళు తాకిన కాళ్ళ వేళ్ళల్ల రక్తం కారిన కాడ
పవిత్రమైన గోదావరి నదిలో మీ పాదములు కడిగింది అన్నే!
రాతిని నాతిగా మార్చిన మీ పాద ధూళిని కడిగిన కాడ
అడవి బిడ్డల కన్నీటి ఉసురు దలిగి
పాపికొండలు నిండా మునుగుతున్నయ్ చూడు!
'ఏ తీరుగ మము దయజూసెదవో ఇనవంశోత్తమ రామా!'
గోల్కొండ కోటలో బంది రామదాసు కీర్తనాలాపన
నేడు జలసమాధి అవుతున్న ఆదివాసీల ఆర్తనాదాలు
మీకే కాదు ఎర్రకోట కచ్చీర్ల గూసున్న ఎవ్వనికి యినబడయి
ధర్మ రక్షణార్థం చెప్పులకు పట్టాభిషేకం జేసి
చెవుల సీసం బోసిన మీ రామరాజ్యంల చెవులట్లినబడుతయ్!
అంతా మా భ్రమ గానీ!
ఆనాడు మీరు అయోధ్య వదిలి అడివి బాట పట్టిన్నాడే
ఆపరేషన్ గ్రీన్ హంట్ షురువయింది
ఇయ్యాళ్ళ అడవులల్ల మేం కొత్తగ చచ్చుడేంది?
పోలవరం డ్యాంల మునుగుడేంది?
జ్ఞాన పిపాసి శంబుకుని తల నరికినపుడు
శూర్పణఖ ముక్కు చెవులు కోసినపుడు
వానర రాజు వాలిని అధర్మంగా చంపినపుడే
మీ విజయ గర్వం దశదిశల కెక్కింది
అన్నదమ్ముల బాపి అయంల గుచ్చిన గాయం
రావణ కాష్టం రగులుతుందిప్పటికీ
పరమ పతివ్రత సీతామాతను అగ్గి గుండంల కాల్చినపుడే
మీ ధీరత్వం మీ పరాక్రమత్వం ప్రజ్వరిల్లింది
ఐనా! మీరు కాపాడుతారనేది మా భ్రమేనా దేవా!
గోద్రాలో గోదలోలె మనుషుల గొంతుల గోసిన కరవాలమే
ఆదివాసీల కుత్తుకలు ఆర్డినెన్స్‌తో అమాంతం గోసింది చూడు!
శ్రీరామా! యిగ ఢిల్లీ హస్తినాపుర రాతి సింహాసనాల మీది
మీ దూతల మా రక్తంతో నిత్యంతానం జెయ్యుమని ఆశీర్వదించు
తండ్రీ!
ఎప్పటికైనా అద్దం మొకం ఒక్క దగ్గరికొత్తెనే
ఉన్నది ఉన్నట్టూ లేంది లేనట్టు తెలిసేది!

అరే! ఛల్...రే దాదా ఛల్...
తరతరాల ఓటముల వీర మరణాలు శాశ్వతమేం కాదు!
ఓడి గెలవడం గెలిసి ఓడడం పరాజితులదే మన చరిత్రంతా!
సమ్మక్క సారక్క రాంజీగోండు కొమురం భీం
పౌరుషంతో పోరిన కాడనే
ఫలదీకరణ చెంది కొత్త విత్తనమై మొలకెత్తుదాం!
సందెన వడ్డ కలలను బొక్కనేసి తోడుకుందాం!

మరట్ భూమి గెల్వానా - మనమే భూమి గెలువాలే
గోండు రాజ్యం తరానా - గోండు రాజ్యం తేవాలే
కేడా మావయి బీడు మావయి - అడవి మనది బీడు మనది
కెండర్ మావయి గుంటూంగ్ మావయి - వాగు మనది గుట్టలు
మనయి
మరట్ నడింగ్ దోహా మడోయి - మనమే నడు కట్టాలోయ్
బడగపెసి లడాయ్ తుంగ్ నా - కట్టెపట్టి యుద్ధం చెయ్
రూసి సట్టేడ్ దేయిసానా - కత్తి కొడవలి ఎగరాలె
మరట్ లడాయి తుంగ్‌నా - మనమే యుద్ధం చెయ్యాలె!

కట్ట

- వినోదిని

రేపట్నుంచి మా జూనియర్ కాలేజీకి పన్నెండు రోజు సెలవలని వినగానే నా గుండెల్లో రాయి పడింది. మా ఆస్టల్ అన్నంలో దొరికేంత చిన్నసైజు కాదు. రైలు కట్ట మీదుంటదే, చేతిలో సరిపోయేంతది, అంతది!

అందరూ బట్టలు సర్దేసుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉన్నారు. ఈ సెలవల్లో యేయేం పనులు చేస్తారో, యేయేం తింటారో, యెక్కడికెక్కడికి వెళతారో చాలా ఉత్సాహంగా చెబుతున్నారు. యివేమీ నన్ను ఆకర్షించలేకపోయాయి. వొక్క వాళ్లెంత లేటుగా లేస్తారో అని చెబుతున్నారే... అది మాత్రం రేపది 'తెల్లగ తెల్లవారడం' గురించి నన్ను ఆలోచనలో పడేసింది. అసూయలో కూడా!

ఆస్టల్ నుంచి బ్యాగు తీసుకొని బయటికొచ్చి బస్సెక్కి యింటికొచ్చే సరికే రాత్రి ఎనిమిదయింది. యూరియా సంచులు కలిపి కుట్టి నాలుగు మూలలా పాతిన బొంగుల ఆసరాతో మూడు గోడల్లా చుట్టి, తలుపు బదులు మా అమ్మ పాత చీర అడ్డంగా కట్టిన బాత్రూం. లోపల పరిచిన రెండు ఇరిగిపోయిన నాపరాళ్లు, వొకపక్కన బురదలోకి కూరకపోతంటే, వేడినీళ్లతో మొకం కాళ్లు చేతులు కడుక్కొని లోపలికెళ్లా. మా అమ్మా, నాన, శాం అన్నయ్య అన్నానికి కూర్చుంటన్నారు. వుడుకుడుకు అన్నం, వేడి వేడి కరుగులు. గోంగుర పచ్చిమిరగాయలు వుడకబెట్టి నూరిన పచ్చడి. పెద్దుల్లిపాయ చిన్నుల్లిపాయ యేసి మా అమ్మ రోట్లో యేసి నూరిందంటే... యింగతే సంగతి. మా అన్నయ్యేమో బొట్నేలు కాడ్నుంచి చిటికినేలు దాకా నాక్కుంటా - 'హేమా పచ్చడి సూపరుహిట్టే, వందాడిందనుకో...' అంటాడు. ఆస్టల్లో వుప్పూ కారం లేని కూరలు తినటం మూలాన నా నాలికంతా చప్పబడిపోయింది. దొరికిందే సందని అన్నంలో యెక్కువ పచ్చడి యేస్కొని బాగా పిసికి ముద్దలు ముద్దలు జేస్కొని తిన్నా 'యింకొద్దిగ పచ్చడెయ్యమ్మా' అని అడిగడిగి యేపిచ్చుకొని తిన్నా. అంత తినబట్టేనేమో! కుటుంబ ప్రార్థన జరుగుతుండగానే కళ్లు మూతలు పడ్డయ్.

నున్నగా అలికిన నేలమీద బొంతేసుకొని మమ్మా నేను పొణుకున్నాం. బయట జల్లుపడతావుంది. బంగాళాకాతంలో వాయుగుండమంట. ఇంట్లో పురుగూ పుట్రా చేరుద్దని మమ్మ బుడ్డి ఆర్పకుండా వత్తి తగ్గిచ్చి పెట్టింది. మా తాటాకు కప్పులోంచి నా కాళ్ల కాడ బొట్టు బొట్టు పడి బిగదీసి కప్పుకున్న దుప్పటి తడుస్తా ఉంది. లేచి కూరగిన్నె తెచ్చిపెట్టి, దండెం మీద యాలాడబడుతున్న మా అన్న బన్నీ దీసి అందులో పడేశా. యింగప్పుడు నిద్రపట్టింది.

కడుపులో యేందో అవుతావుంది. నెప్పి కాబోలు, గుడా బెడా... కళ్లు తెర్సి చూశా. అంతా చీకటిగా ఉంది. పక్కన మమ్మ. యింటో వున్నానని అప్పుడు గుర్తొచ్చింది. ఈ యేదు ఆస్టల్లో జేరిన కాడ్నుంచి ఆస్టల్నుంచి యింటికొచ్చిన మొదట్రోజు, ఇంటినుండి ఆస్టల్కెళ్లిన మొదట్రోజు రాత్రి పొణుకున్నాక మెలకువొస్తే వొక్క నిమిషం అది ఆస్టలో, ఇల్లో అర్థం కాదు. కొంసేపు పోయాక తెలుస్తది. 'మా... మా... లే... లెట్రినొస్తందే' అన్నా మమ్మకేవీ అర్థమయినట్లు లేదు. ఇదివరికి నేను 'దొడ్డిక'నే అనేదాన్ని. ఈ మజ్జ కాలేజీలో చేరి ఆస్టల్లో వుంటన్నప్పడి నుంచి లెట్రినంటన్నా. మాకు 'లెట్రిన్' లేకపోయినా!

నేను గబగబా బయటికొచ్చి పొట్ట రుద్దుకుంటా తారింగలాడతంటే మమ్మ గాబులో ముంచి రబ్బరు చెంబుతో నీళ్లు తెచ్చింది. నేను ముందు, మమ్మయెనక యిద్దరం అంతలెక్కున్న రైలు కట్ట కాడికి పోయాం. 'కట్టమీదకి యెక్కబాకమ్మా, పీతుర్లుంటయ్, యెవుర్లేరులే, ఆడ్నే కూ...' అంది. పెద్ద యిరోచనం! యెంత పెద్దదంటే నా రెండు మడాలూ తడిసినయ్! మమ్మ నేను కూర్చున్న కాడికి చెంబు తెచ్చిచ్చింది.

'తెల్లారకముందే బయటికి పోయారేంది?' మమ్మనడిగాడు మా నాన్న, నేను గాబుకాడ కాళ్లు కడుక్కుంటంటే!

'పిల్లకి దొడ్డి నెప్పొచ్చిందిలే'.

వాన కాస్త తెరిపిచ్చింది. పోయి మా అమ్మ పక్కన బొంతమీద పొణుకున్నా. మా గన్నుగా నిద్రపట్టింది. సడెన్గా మెలకువొచ్చింది.

చిన్నప్పుడు కరుణామయుడు సినిమాలో యేసయ్య సిలువ మీద చచ్చిపోయ్నపుడు - కొండరాళ్లు దొర్లుతాయ్, సముద్రాలు వుప్పొంగుతయ్, అగ్నిపర్వతాలు కుండ మీద మూత పేలిపోయి, మంట యెక్కువైతే పప్పు చారు పొంగినట్టు లావా పొంగిపోద్ది. అట్టావుంది నా కడుపులో! లేచి చూస్తే మా అమ్మ లేదు పక్కన. వాకిలూడుస్తా వుంది. ఇస్లాంపేట మసీదులోంచి అజా యినపడతా వుంది. చెంబుతో నీళ్లు ముంచుకొని గబగబా నడుచుకుంటా పోతన్నా.

'జనం తిరుగుతున్నార్లే, పోమ్మా' యనక నుంచి మమ్మ అంటా వుంది.

ఈసారి రైలు కట్ట యెక్కాల్సిందే.

అప్పటికే ఆడోళ్లు అక్కడొకళ్లు అక్కడొకళ్లు కూర్చోనున్నారు. రెండు పట్టాల మీద యెదురెదురుగా మాటలినపడతన్నయ్.

నేను యివతల పట్టా మీద కూర్చున్న. యిట్లా కూర్చోవాలంటే అలవాటుండాలి. లేకపోతే బ్యాలెన్స్ కుదరక ముందుకో, యెనక్కో పడిపోతాం. ముందుకైతే పర్వాలా, చెంబు మీదనో, రాళ్ల మీదనో చేతులు బెట్టి బోర్లా పడకుండా యెట్నో ఆపుకోవచ్చు. వెనక్కయితే యింగంతే సంగతి - నిప్పుల్లో పడ్డట్టే! చూడ్డానికి యిరగబూసిన బంతిపూల్లాగా, చేమంతి పూల చెండుల్లాగా కనపడతయ్గానీ, బోచెద్ద గవులు! కదిలిస్తే కంపు, యింకందులో పడ్డావంటే యేవుంది...?! చిన్నప్పుడు నేనట్నే బడ్డా! నాలుగో తరగతిలో! యెదురుగా యేదో

కదిలితే పామనుకొని! మమ్మ తీసకపొయ్యి చేపని కడిగినట్టు సుబ్బరంగా రుద్ది పెట్టింది నన్ను. కానీ ఆ పీతోసన నాకాడ నాలుగు రోజులు వస్తనే వున్నట్టనిపిచ్చింది నాకు.

పట్టా, బెత్తెడు మీద రెండేళ్లుంటదంతే! పాదమేమో మూడుబెత్తెలుంటది. పట్టాకి అడ్డంగా, పాదంలో యెనక భాగం కొంచెం పట్టాకి యెనకే మిగిల్చి, పాదం ముందు భాగం ఖాళీగా వొదిలేసి, బొటినేలు అపుడపుడు కిందకొంచి రాళ్లమీద ఆనిస్తా బ్యాలెన్స్ చేసుకుంటా ఉండాలి. ఒకసారి కూర్చుంటే అయిపోయేవరకు జరిగి కూర్చోవాల్సిన పనుండదు... పట్టా యెత్తుగా ఉంటది కాబట్టి...!

'యెవురాడ కూసున్న మనిషీ' ఆరాగా అడిగింది శామలక్క, అంత దూరంలో పట్టా మీద నుంచి లేచి నిలబడతా.

'నేనే శామలక్కా'

'యెవురూ, సోరూపానా, యెప్పుడొచ్చావ్ మ్మాయ్?' నా దెగ్గరికి నడుస్తా అడిగింది.

'రాత్రొచ్చానక్కా'

'శెలవులిచ్చారా' కూర్చొనే అడిగింది బుజ్జక్క

'అవునక్కా, దసరా సెలవలు, మళ్లీ ఆదివారం దాకా పన్నెండు రోజులు'

శామలక్క నా ముందుకి సగం నీళ్లున్న చెంబు చాపి 'కాసినీళ్లు పొయ్‌రా' అంది. ఈళ్లిద్దరూ బో సావాసగత్తెలు, పక్కపక్క యిళ్లు. అన్ని పన్లూ కల్సే చేసుకుంటారు. దొడ్డికొచ్చాదా వక్కచెంబులోనే నీళ్లు తీసుకపోతారు.

శామలక్క చెంబు తీసకపోయి బుజ్జక్కకి అందిచ్చింది.

'అయినా మనకెందుకమ్మాయ్ అన్నేసి రోజులు శలవలు? పండగ జేసుకొంటామా? పాడా? రంగురంగుల ముగ్గులేసి పేడతో గొబ్బెమ్మలు పెడతామా యేంది?' బుజ్జక్క అంది.

'నువ్వనేది సంకురాత్రి పండగలేక్కా, యిది దసరా...' అన్నా.

'యేదో వొకట్లే...' బుజ్జక్క.

'అ... మరే! క్రిష్టమస్ పండక్కయితే 'పండగపూట వొక్క రోజే సెలవక్కా' అనుకుంటా ఇరవై నాలుగున చీకటి పడ్డాక యింటికి జేరేవ్, సగం పండగయి పోయిందప్పటికి' శామలక్క దూరం నుంచి రైలుకూత యినపడింది. నా గుండెల్లో రైళ్లు పరిగెత్తినయ్. దాన్ని పెరుగుబండి అంటారు. పైనున్న పల్లెటూర్ల నుండి పాలు పెరుగుతెచ్చి నర్సరావుపేటలో అమ్మే వాళ్లొచ్చే బండది. నాకింకా నెప్పితగ్గలా. కొంచెం సేపు కూర్చోవాలనే ఉంది.

'కూసోమ్మాయ్, సిగ్గులియ్యలేదుగా, అంతదూరంలో ఆపుకుంటాడ్లే' శామలక్క మాటల్లోనే రైలొచ్చి కాస్త దూరంలో ఉన్న గేటు కవతల ఆగిపోయింది. చాలా పెద్ద వెలుతురులో దాని లైటు మాత్రం ఆగలేదు. ఆ ఫోకస్ట్లో నా యెదురుగా నిలబడున్న బుజ్జక్క తొమ్మిదో నెల కడుపు యింతెత్తున కనబడతా వుంది. అంత వెలుగులో నాకింక కూర్చోబుద్దిగాలా! పైగా వొకటే దోమలు. అప్పటికే యెనక పిర్రల్నిండా దోమలు కుట్టి దద్దుర్లు గట్టినయ్!

దార్లో బుజ్జక్క 'మా సత్తెనపల్లిలో అంజమ్మత్తని వుందిలే, చీకటిపడ్డాక చెంబొక చేత్తో, రాయి వొక చేత్తో పట్టుకొని బయలుదేరుద్ది. మేమాడ రోడ్డు పక్కనేగా కూసున్నేది! గురిచూసి, రాయి యిసిర్నాకి కరెంటు స్తంబం మీద లైటు పగల్నాకుద్ది.

మళ్లీ యెప్పటికో వచ్చి, మున్సిపాల్టీవాళ్లు యేసిపోతారు - రాత్రికి ఈమ పగల్నాకుద్ది వాళ్లేసిపోడం - యీమ పగల్నాకడం, వాళ్లేసిపోడం - యీమ పగల్నాకడం... యిదే కత... యెందుకో తెల్సా ఆగి నా మొకంలోకి చూసి 'యెల్తుర్లో కూసోలేక' అని నవ్వింది. నేను కూడా నవ్వా, చేసేదేం లేక!

మమ్మ బొంత యెత్తేసింది. మంచం మీద మానాన్న పక్కన పొణుకున్నా

'చిన్నమ్మాయ్, టీ తాగుతావా?' నేను కళ్లు తెరవడం చూసి మమ్మ అడిగింది. లేచి, గాబుకాడ కళ్లు కడుకొని, నోరు పుక్కిలిచొచ్చి, టీ గ్లాసు తీసుకున్నా టీ మొత్తం తాగి, గ్లాసు కడగటానికి గాబుకాడకి పోతన్నా... నెప్పి మొదలైంది. టైం యెనిమిదయినట్లుంది. 'యేసయ్యా! యిప్పుడెట్లాపోడం? చెంబు తీసుకొని యిళ్ల మజ్జ నడుచుకుంటా బోవాల 'యెప్పుడొచ్చావమ్మాయ్' అని అందరూ పలకరిస్తా వుంటారు. దానికి తోడు కట్టకి పొయ్యేచ్చే మొగోళ్లు యెదురవుతా వుంటారు. అన్నయ్యలూ, అంకుళ్లు. నాతో పాటు మా లూథరన్ హై స్కూల్లో చదువుకున్న సీనియర్లు, జూనియర్లు కూడా వుంటారు. వీటన్నింటికి మించి పగలు ఆడోళ్లు కట్ట మీద కూర్చోడానికి లేదు! కట్ట పక్కన డవున్లో ఉన్న ముళ్ల కంచెల్లోపలికి వొంగొంగి నడుచుకుంటాబోయి కూర్చోవాల. అసలే పెంటల రొచ్చు బో రోతగా వుంటది. దానికి తోడు రాత్రంతా వానబడి ఉంది. కుప్పలన్నీ చింది, చుట్టూ చెల్లా చెదరుగా యెగిరిపడి వుంటయ్. యెంత కష్టమో నడవడం, తావు యెతుక్కోవడం. ఇదిగాక కట్టమీద పరిచిన రాళ్ల పక్కన... ముళ్లకంచెల్లోకి దిగే అంచుమీద సన్నటి కాలిబాట. ఆ అంచుమీద నుంచే మొగోళ్లు చెంబు తీసుకొని మమ్మల్ని దాటి పోతావుంటారు. ఖాళీ చెంబుతో వస్తావుంటారు. కొంతమంది తలకాయొంచుకొని నడుస్తుంటారు. వొక్కొక్కడు తలెత్తి వొకసారి మా మొకంలోకి చూసి తల తిప్పుకొని పోతావుంటాడు. వాడు యెట్టాంటోడయినా అంత దూరంలో మొగ మనిషి కనబడ్డాడంటే లేచి నిలబడాల్సిందే! రైలు కూడా మొగోడే! వస్తే నిలబడాల్సిందే! గూడ్సు బండొస్తే కూడా! ఎన్ని పెట్టెలుండి యెంత పొడుగున్నాసరే, ఇంక కూర్చోగోడదు, చివర్లో గార్డు వుంటాడుగా! టెన్త్‌లో నా క్లాసుమేట్ మోజెస్ యెడం చేతిలో ఖాళీ చెంబుతో యెదురయ్యాడు. నవ్వు మొగం పెట్టుకొని తలకాయొంచుకొని దాటిపొయ్యాడు. 'యెల్లేటప్పుడు యే చేత్తో పట్టుకున్నా ఫర్వాలేదు గానీ, వచ్చేటప్పుడు మాత్రం కుడిచేత్తోనే పట్టుకోవాలి - చెంబు' అంటాడు మా నాన. దారిలో గిన్నెలు తోమేవాళ్లు, బట్టలుతికే వాళ్లు పలకరిస్తానే వున్నారు. కొంతమంది నులకమంచాల మీద కూర్చొని సద్దన్నం తింటన్నారు. కట్టమీద కెక్కగనే పీతిగవులు. చేపల మార్కెట్లో వచ్చే నీసోసన చిక్కగా వస్తావుంది.

పీతిపెంటలన్నీ దాటుకుంటా చిన్నగా ఆ ముళ్లకంచల్లోకి దిగా! ఆడోళ్లెవరూ లేరు. అందరూ చీకటితోనే పోయొస్తుంటారు. రెండు జానల చోటు దొరకడం కనాకష్టమైపోయింది. చెంబు పెట్టడానికి బెత్తెడు చోటు లేదు. కుడిపాదం మీద పెట్టుకున్నా! పొర్లు నెప్పి! నీళ్ల విరోచనం! ఆ తడినేలలో ఇంకలేకపోతంది. నేనెప్పుడైనా యిట్లా

కంపల్లోకొస్తే చుట్టూ చూస్తా వుంటా! వొకటి పాములు, రెండు పందులు. పాములంటే నాకు చిన్నప్పట్నుంచి బోబయ్యం. పందులంటే మామూలుగానైతే బయం లేదు గానీ యిట్లా కంపల్లోకొస్తే... కాసుకొని చూస్తా కూర్చోగానే పరిగెత్తుకొని వస్తయ్! యెనకా ముందూ చూడవ్, గబుక్కున లేచి తప్పుకోవాల్సిందే, లేదంటే ఆ కంగార్లో పీతుర్లలో పడిపోతాం.

బడిలో ఆడపిల్లలు రింగాట ఆడేటపుడు, నెట్‌కి అవతలున్నోళ్లు యిసిరేస్తే, యివతలున్నోళ్లు దాన్ని కిందబడనియ్యకుండా పట్టుకోవాల! కిందపడనిస్తే పాయింటుపోద్ది! అవుటయినట్టే! అట్టా పందులు కూడా, మనిషి రాగానే దగ్గరకొచ్చి నిలబడి కాసుకోనుంటయ్. కూర్చుంటంటే కిందబడనివ్వవ్... తింటంటే రెండుపక్కల సెలాలమ్మట కొంచెం కొంచెం జారతా చిదపలు పడతావుంటయ్. చిన్న గుంటలో రెండు మూడు పెరిగిన పిల్లలు పొడుకోనున్నయ్... దొడ్డికి బురదలో. యెందుకో వొడుపు చెయ్యట్లా, కొద్దిగా మెదులుత్తున్నయ్యంతే!!

అక్కడక్కడా దోసతీగలున్నయ్, కొన్ని నేలమీద పాకి, కొన్ని కంపచెట్ల మొదట్లో అల్లుకొని! తీగలకి పూలూ పిందెలు కనబడతన్నయ్. తిన్నప్పుడు అరక్కుండా దొడ్డికిలో బయటికొచ్చిన యిత్తనాలన్నీ యిట్లా మొలిచి తీగలయ్యి మంచి మంచి కాయలు కాస్తాయంట. పీతుర్ల మజ్జన పెరగడం వలన పెద్ద పెద్ద సైజులో నిగనిగలాడ్తుంటయ్యంట! మొగోళ్లు కూర్చున్నేకెల్లయితే గంపలు గంపలు కాస్తయ్యంట. అందుకే పెద్దబాయి పక్కనున్న వజ్రమ్మమ్మమ్మ తెల్లార్జామే టార్చిలైటు తీసుకొని గంపెకెత్తుకొచ్చి కోటయ్య కొట్టుకేసుద్దంట. ఈ సంగతి మాగేర్లో అందరికి తెల్సు. అందుకే యెవరూ కోటయ్య కొట్లో దోసకాయలు మాత్రం కొనరు. రోడ్డవతలోళ్లు కొనుక్కోని పోతుంటారు.

నా పాదమంతా తడిసిపోయింది. యేందా అని చూస్తే చెంబులో సగమే నీళ్లున్నయ్ యింతలో వొకాయన ఖాళీ చెంబుతో అంచుమీద నడుస్తా కన్పిచ్చాడు. నాకు తెలీకుండానే చేతో చెంబు పట్టుకొని గబుక్కున లేచి నిలబడ్డా. ఆయన మొకం రైలు కట్ట పక్కకి తిప్పుకొని నడుస్తున్నాడు.

మొగోళ్లకయితే ఈ బాధే లేదు. జనం తిరుగుతున్నా పట్టిచ్చుకోరు.

మొన్న క్లాసులో తెలుగు మేడం 'మరో జన్మంటూ వుంటే మీలో యెంతమంది పురుషులుగా పుట్టాలనుకుంటున్నారు' అని అడిగితే చాలా మంది అమ్మాయిలు చెయ్యెత్తేరు.

'యెందుకు' అని మళ్లీ అడిగారు.

అమ్మాయిలు చాలా సమాధానాలు చెప్పేరు. సెకెండ్‌షోకి వొంటరిగా పోవచ్చని, సిగరెట్ తాగొచ్చని, యెండాకాలం చొక్కా విప్పదీసుకోవచ్చని, నెల నెల మెన్సెస్, కడుపు - కాన్పు యేవీ లేకుండా వుండొచ్చని యిట్లా... చాలా.. యీ ఆడవాళ్ల యిబ్బందులన్నీ అనుభవించి నోళ్లకే తెలుస్తయ్యని ముగించారు.

నాకప్పుడు 'యిది' చెప్పాలనిపించింది. 'యిట్లా మజ్జలో లేచి నిలబడే అవసరముండదని' కానీ క్లాసులో చెప్పలా! ధైర్యం చేసి రాత్రికి ఆస్టల్ రూంలో చెప్పా.

'ఛీ పాడు యిలాంటియే చెబుతారా? యింకా నయం క్లాసులో చెప్పలేదు...' యిలాంటియే రెండు మూడు మాటలని, యిదొక పాయింటే కాదని కొట్టిపడేశారు. వాళ్లకేం తెల్సు....? యిది... అనుభవించినోళ్లకే తెలుస్తది!! ఆయనెల్లిపొయ్యాడు. మళ్లీ అట్టా కూచున్నానో లేదో రైలు కూత యినబడింది. చాలా స్పీడుగా వస్తంది. మళ్లీ లేచి నిలబడ్డా. రైలు దగ్గరికి రాగానే ఆ స్పీడుకి రైలు కట్టమీదున్న ఈగలన్నీ గుయ్‌మని వొకేసారి లేచినయ్.

యింతలో కటాక్షం వచ్చింది. యెనిమిది చదూతుంది. ఆ పిల్లనడిగి కొంచెం నీళ్లు పోయించుకున్నా. వక్కతే వుందని తోడు నిలబడ్డా.

'అక్కా.. సింహాసనం కత తెల్సా' అడిగింది.

'తెలీదే... యేందదీ?' అన్నా.

'మరంటా, వేరే రాజ్జం నుండొచ్చిన విద్వాంసుడి చేతిలో రాజుగారి పండితులంతా వోడిపోయారంట. విద్వాంసుడు 'మహారాజా నేను గెలిచా కదా మీరిచ్చిన మాట ప్రకారం నా కోరిక తీర్చాలి' అన్నాడంటా. 'యేంటదీ' అని రాజుగారడిగితే 'మీ సింహాసనం మీద దొడ్డికి కూర్చోవాలనుకుంటున్నాను' అన్నాడంట. రాజుగారి మొహంలో నెత్తురు చుక్కలేదంట. చేసేదం లేక సింహాసనం దిగి కిందకొచ్చాడంట. విద్వాంసుడు సింహాసనం యెక్కబోతావుంటే అపుడు తెనాలి రామలింగడు 'విద్వాంసుడా, ఆగండి! మీ కోరిక ప్రకారం, తమరు సింహాసనం మీద దొడ్డికి మాత్రమే కూర్చోవాలి. పాస్ పొయ్యడానికి వీల్లేదు. వొక్క చుక్క పాస్ పోసినా సరే, మీరు మాట తప్పినందుకు గాను, మీ తల నరికి కోట గుమ్మానికి వేలాడకడతాం' అన్నాడంట. ఆ విద్వాంసుడికి వొణుకు పుట్టిందంట - 'వొక్క చుక్క పాస్ పొయ్యకుండా దొడ్డికెట్లా కూర్చోవడం' అని! తన అహంకారానికి పచ్చాత్తాపడి రాజుగార్కి క్షమాపణడిగి ఆ రాజ్జం వదిలి యెల్లిపొయ్యాడంట'. నేను బాగా నవ్వి -

'యీ కత తామస్ మేస్టర్‌గారు చెప్పారా?' అన్నా

ఆ పిల్ల ఆశ్చర్యపోయి 'నీకెట్టా తెల్సూ' అంది

'యిట్టాంటి కతలు ఆయనేగా చెబుతాడు' అన్నా. యిద్దరం నవ్వుకున్నాం.

కట్ట దాటాక కటాక్షం యింటికెల్లిపోయింది.

నేను యింటివైపు నడుస్తా వుంటే, నా యెనక యెవురో నడుస్తున్నట్టుంది. యనక్కి తిరిగి చూశా, మా అన్నయ్య. యిద్దరం వొకేసారి గాజుకాడికి పొయ్యి చెంబు అడుగు కడిగి, కాళ్లు కడుకున్నాం.

'ఆ చెంబెందుకు తీస్కపొయ్యావ్, అది కారతంటే...' అంది మమ్మ.

'అందుకే, సగం నీళ్లు కారిపొయ్యాయ్, కటాక్షం పోసిందిలే...' మంచం మీద కూర్చుంటా అన్నా.

'శామీ! చిన్నమ్మాయ్‌కి యిరోచనాలవుతున్నయ్‌గనీ, నువ్వు బొయ్యి కోటయ్య కొట్లో అయిదు రూపాయలకి సగ్గుబియ్యం తీస్కరా, గంజి కాస్తా' అంది మా అన్నయ్య డిగ్రీ చదూతున్నాడు. అయినా, రూపాయి, రెండ్రూపాయలిచ్చి చింతపండు తెమ్మన్నా, యెండి మిరగాయలు తెమ్మన్నా తెచ్చి పెడతాడు. సిగ్గు పడడు. గంజి తాగతావుంటే రత్నవొచ్చింది. 'చిన్నమ్మాయ్! కొవ్వుత్తులు చెయ్యడలినికి

వోతన్నా, వస్తావా' అడిగింది.

'యియ్యాల రాదులేవమ్మా, యిరోచనాలవుతన్నయ్, రేపట్నుంచొచ్చుద్ది' అంది మమ్మ.

మొన్న యెండాకాలంలోనే కొవ్వొత్తులు తయారు చేసే ఫ్యాక్టరీపెట్టారిక్కడ. దగ్గర్లో! అంతకు ముందు మాగేర్లో అందరూ రకరకాల పన్లకి పోతావుండేవాళ్లు. యెండలో యెండుకుంటా, వానలో తడుసుకుంటా! నేను కూడా సెలవలకి యెండా వానా పనులే చేసేదాన్ని! యిప్పుడు కాండిల్స్ పని! నా డబ్బులు మమ్మా నాన్న అంటుకోరు. నా పుస్తకాలకి, నా బట్టలకే. అన్నం కూరా వండి మమ్మ కాండిల్ పనికి యెల్లిపోయింది.

మా అన్నయ్య యిడ్లీలో పంచదారయేపిచ్చి కట్టిచ్చుకొచ్చిన పొట్లం యిప్పి పదకొండు గంటలకి తిన్నా. యెందుకొచ్చిన గోలలే అని వొక్కిడ్లీయే తిన్నా. మళ్లీ సన్న చినుకులు. పంచలో యేసున్న మంచం మీద పొణుకొని నిద్రపోయా. రెండు గంటలపుడు మెలుకువొచ్చింది.

మళ్లీ అదే నెప్పి. యేసయ్య చనిపోయినపుడు జరిగిందే! తట్టుకోలేకపోతున్నా! యట్లాలేచానో యేందో, చెప్పులు కూడా యేస్కోకుండా, చెంబుదీస్కొని కట్టవైపు గబగబా నడిచా, పెద్ద పెద్ద అంగలు. యిప్పుడు దాకా కొండ రాళ్లు దొర్లుతున్నట్లున్న నెప్పి, యిప్పుడు... సముద్రాలు అల్లకల్లోలమై, వుప్పొంగిపోతన్నట్టుగా పెరిగిపోతంది. యింక అగ్నిపర్వతం మీద మూతెప్పుడు పేలిపోద్దో...!

కట్ట దగ్గర కొచ్చేశా. అంతకష్టం మీద ఆపుకోడం వల్ల కడుపులోంచి యేదో పైకి తన్నుతోంది. వాంతికొచ్చినట్టుగా ఉంది. తలమీద ముళ్ల కిరీటం బెట్టి లోపలికెవరో గట్టిగా వత్తుతున్నట్లుంది. సిరుశవట్లు పుట్టుకొస్తున్నయ్. కళ్లు బైర్లు గమ్ముతున్నయ్. పడిపోయేటట్లున్నా! యట్లనో కట్టదిగి కంపల్లోకి దూరిపోయా!...

'అన్నిటికంటే మనిషికి యెప్పుడు హాయి' అని తెనాలి రామలింగడ్ని అడిగాడంట రాజుగారు.

'తొందరగా వచ్చినపుడు వెళితే, అదే అన్నింటికంటే హాయి మహారాజు' అన్నాడంట. రాజుగారికి కోపమొచ్చింది, రాజుగారితో ఇలాంటి సమాధానం చెప్పినందుకు, వంద కొరడా దెబ్బలు కొట్టమన్నాడంట. శిక్ష రేపొద్దున అమలు చేయమన్నాడంట. తెల్లవారి, చీకటితోనే రాజుగారు లెట్రిన్‌కెళితే లోపలెవరో వున్నారంట. యెంతసేపు బయట వెయిట్ చేసినా లోపలున్న మనిషి బయటకు రాలేదంట. రాజుగారు ఆ 'తొందర'ని తట్టుకోలేక అల్లాడిపోయాడంట. అప్పుడు బయటకొచ్చాడంట తెనాలి రామలింగడు. రాజుగారు పరుగెత్తుకొని లోపలికెళ్లాడంట... బయటకొచ్చాక పొట్ట తడుంకుంటూ – 'యెంత హాయిగా వుందో' అన్నాడంట. యెదురుగా ఉన్న రామలింగడ్ని చూసి తనకు జ్ఞానోదయం అవ్వడానికి, యిది అతడు వన్నిన పన్నాగమే అని అర్ధమయ్యి, అతడికి పెద్ద పెద్ద బహుమానాలిచ్చి పంపాడంట.

వారానికొకసారైనా రాత్రిపూట, కట్టమీద ఈ కథ విన్పిస్తా వుంటది.

మళ్లీ నీళ్ల విరోచనమే అయింది... పెద్దది. యనకంతా ఈగలు వాల్తావున్నయ్. గుయ్యిమని ముసురుకొంటన్నయ్.

నా యెడం పాదం ముందు నుంచి – నలుపు మీద నాలుగు యర్రమచ్చలున్న పురుగు పోతా వుంది. అది ముందు కాళ్లతో కుంకుడు గింజంత పియ్యి వుండని దొర్లించుకుంటా పోతా వుంది. దొర్లిచ్చుకుంటా పోటం వలనేమో, వుండ బో గుండ్రంగా, చూట్టానికి చిన్నసైజు లడ్డులాగా వుంది.

యెవురో విజిలేసిన సొండు యినపడి తలెత్తి కట్టవైపు చూశా, వకాయన. కట్ట అంచున సన్నదార్లో సైకిల్ మీద! వక్కాలు పెడల్ మీద, వొక్కాలు కిందా ఆనిచ్చి నవ్వుతున్నాడు. గభాల్న లేచా! బొమతలెగరేస్తన్నాడు. చాలా బయ్యమనిపిస్తంది. చుట్టూ చూశా, మనిషి అలికిడే లేదు. కాళ్లు వొణుకుతున్నయ్. గుండె దడ దడా కొట్టుకుంటంది. యేందేందో మాట్లాడతన్నాడు. బోలేకి మాటలు, యింతింత లావు బూతులు. చూపుడు వేలు, బొటనవేలు సున్నాలా చుట్టి యేదో సైగ చేస్తన్నాడు. జేబులోంచి డబ్బులు తీసి చూపిస్తన్నాడు. యేం చెయ్యాలో పాలుబోటం లేదు. వాడు చిన్నగా సైకిల్ మీద నుండి దిగి స్టాండేస్తన్నాడు. యింగంతే.. చెంబు అట్లాగే పట్టుకొని ఆ వజాన దవున్లోకి పరిగెత్తా! లోపలికెళ్లేకొద్దీ ముళ్లకంచెలు – యెట్టంటే అట్ట అడ్డంగా పెరిగిపోయి పెరిగెత్తడానికి వీలులేకుండా వున్నయ్. బట్టలకి తగులుకొంటన్నయ్, వొళ్లంతా చీరుస్తున్నయ్.

వాటిని తప్పించుకొని ముందుకు నడుస్తానే యనక్కి తిరిగి చూశా. వాడు దవున్లోకి నాలుగడుగులేసి ఆడ్నే ఆగిపోయి నన్నే చూస్తన్నాడు. అయినా నేనాగలా! ఆ కంచెల్లోంచి చాలా దూరం నడిచాక చివర్లో అడ్డంగా నాలుగు మూర్ల యడల్పు మురిక్కాలవ పారతా వుంది. ఆడ నిలబడి యనక్కి తిరిగి చూశా. వాడు ఆడ్నే వున్నాడు. కొద్ది కొద్దిగా కనబడుతన్నాడు.

కాళ్లల్లో ముళ్లు దిగబడ్డయ్. వకదాని తర్వాత వకటెత్తి రెండు అరికాళ్లు చూసుకున్నా. పాదాల్నిండా పియ్యి. కజాబిజా తొక్కానేమొ అతుక్కుపోయింది. యేళ్లమజ్జనుంచి పొడుచుకొచ్చి, అంచుల్లో కెల్లకొచ్చి..! చెప్పుల్లేకుండా నల్లమట్టి పొలంలో నడిస్తే మట్టి బూట్లొస్తాయే, అట్లొచ్చినయ్ పియ్యిబూట్లు! మోకాల్లోతున్న ఆ మురిక్కాలవ యట్టానో దాటి మట్టిరోడు మీదకొచ్చా. ఆడాడ నిలబడ వాననీళ్లల్లో కాళ్లు కడుక్కున్నా! కడిగాక అరికాళ్లు చూసుకొంటే చాలా చోట్ల సర్కారు ముళ్లు దిగి నల్లగా నీడలాగా కనబడతన్నయ్. నడుస్తుంటే కలుక్కు కలుక్కుమంటన్నాయ్. అడుగు దీసి అడుగేస్తంటే ప్రాణం మింటబోతంది. చెంబులో నీళ్లన్నీ యెప్పుడు పొయ్యినయ్యో పొయ్యినయ్. రోడ్డు మీద కొంత మంది నాకెల్లి చెంబుకెల్లి మార్చి మార్చి చూస్తన్నారు. చెంబేడన్నా పడేద్దామనుకున్నా, కానీ దొడ్డికి పోవాలంటే యీ వొక్కటే మంచి చెంబు. వొకదానికి గొంతూడిపోయింది. పట్టుకోడం కుదరదు. వొకదానికి బొక్కపడిందాయె!

ఆ మట్టిరోడ్డు మీద చానా దూరం నడిచి, రైలు గేటు యెక్కి దిగి, కట్టకివతల పక్క చాలా దూరం యనక్కి నడిచి యింటికొచ్చా! మజ్జమజ్జలో చూస్తానే వున్నా నా యనకగానీ వస్తన్నాడా...! లేపోతే కట్టమీద నుంచి యివతలకి దిగి నేను నడుస్తున్న రోడ్డు మీదకి జేరి నాకెదురుగానీ వస్తన్నాడా అని... కనబళ్లా!

చెంబు దీస్కొని యిదంతా సుట్టుకొని నడవటం... యేందో...

బో యిదిగా వుంది... సిగ్గుగా! పెళ్లికూతురు బడే సిగ్గు కాదది. యిబ్బంది. యగతాళి. అవమానం. దొడ్లోకి పోయి నడుం దెగ్గిర్నుంచి కిందకి ఆ మొయినంగా సుబ్బరంగా కడిగి పడేశా... రుద్ది రుద్ది... దొడ్లో వున్న చిన్న చిన్న బట్టల సబ్బు ముక్కల్తో. కాకెత్తుకు పోద్దని వొంటిసబ్బు యింట్లో పెట్టుకుంటుంటాం.

నడిమంచంలో కూర్చొని, అరికాలు వొళ్లో పెట్టుకొని పిన్నీసుతో వొక్కొక్క ముల్లూ తీసిపారేశా. కొన్ని చాలా లోపలికి దిగి కుడతంటే రక్తమొచ్చింది. కొన్ని సగానికి యిరిగిపొయ్యి, ఆ ములుకులు లోపలే వుండిపోయినయ్. తీసిన ముళ్లన్నీ లెక్కబెట్టా. యిరవై మూడు. యిరిగి లోపలే వుండిపోయినయ్ యింకో పదన్నా వుంటయ్.

వామ్మో యిన్ని ముళ్లే! యిన్ని ముళ్లని కాళ్లల్లో బెట్టుకొని యెట్టా నడిచొచ్చానో... ఆ యేసయ్యకే తెలియాలి. ఆ ముళ్లన్నీ పొట్లం కట్టి నాలుగ్గంటలకి మమ్మొచ్చాక చూపిచ్చా.

మొత్తం చెప్పా... మమ్మకి చెబుతుంటే యేడుపొచ్చింది. పెద్దగా యేడ్చా...

'అమ్మో నా తల్లీ! యెంత పనయిందే..! నిన్నా యేసయే కాపాడాడమ్మా! గాలినాబట్టలు, మన గేర్లోంచి ఆడపిల్లలు దొడ్డికి పొయ్యారంటే చాలు, బతకనియ్యట్లా... లేకి మాటలు మాట్లాడటం, యెకిలి చేష్టలు చెయ్యడం!... సెడినా బట్ట. వొక్కొక్క నా బట్టని మజ్జకి మడిసి రైలు కింద బెట్టాల... తిడతానే వుంది మా అమ్మ. సగ్గుబియ్యం గంజిలాగా మరుగతా వుంది... ఉప్పు కళ్లు వేడి చేసి, పాత గుడ్డలో చిన్న మూటగట్టినా చేతికిచ్చింది. నేను సగ్గుబియ్యం గంజి తాగుతా ఉప్పుమూటతో అరికాళ్లకి కోపడం పెట్టుకున్నా!

మమ్మ మొకం చాలా బాధగా వుంది. ఆందోళనగా వుంది. తిడతానే చెంబుతో నీళ్లెత్తకొచ్చి మాత్ర నా చేతిలో బెడతా 'యేసుకోమ్మా' అంది. నా అరికాళ్లు చూస్తా – 'నీరు సున్నం బెల్లం చింతపండు కలిపి నూరి అరికాలికి పూసి కట్టుకడితే నెప్పంతా లాగేస్తది... ముళ్లు రేపొద్దున కల్లా బయటకురికకొస్తయ్...' అంది. యెదురింట్లో ప్రేమక్క బ్లెస్సింగ్‌టన్ గాడ్ని సంకల్లో పట్టిలేపి దూరంగా జరిపి, తపా తపా అడుగులేసుకుంటా బయటికి తెచ్చి, వాడి కాళ్లు నేల మీద ఆనిస్తా కూర్చుంది. వీడికింకా నిలబడటం రాదు. కాళ్లెమ్మటి దొడ్డికి కారతా వుంది. అరిచెయ్యంత యడల్పున రెండు చోట్ల కార్చాడు. 'కొడుకు అట్లు పోత్తన్నాడే' అంది పాలు బొయ్యడానికొచ్చిన తెరోజమ్మ పెద్దమ్మ. 'ఆ యిరోశనాలవుతున్నాయ్యాంటీ' అని చెబుతానే 'దాయిజ్జూ... న్చు... న్చు.. న్చు...' అని పిలిచింది. యెప్పుడొచ్చినయ్యో, రెండు నడికారు కుక్కలు తోకూపుకుంటా... సుబ్బరంగా ఆ రెండిట్లనీ నాకి పడేశినయ్. చాలక వాడి కాళ్లు కూడా నాకుతున్నయ్. ప్రేమక్క వాటినేం అనట్లా! వాడు వొకటే మొయినంగా కాళ్లు చేతులూ ఆడిస్తా, మీది మీదికి దూకుతా, పెద్ద పెద్దగా కేకలేస్తా నవ్వుతున్నాడు. 'దొడ్డికూర్చునేటప్పుడు పిల్లలు బోవుషారుగా వుంటారు చిన్నమ్మాయ్...' అని నవ్వుకుంటా అంటంది ప్రేమక్క.

మళ్లీ కడుపులో కొంచెం కొంచెం తేడా మొదలయ్యింది. అయినా యింకిప్పుడు బయ్యం లేదు బడి నుంచొచ్చిన ఆడపిల్లలు, ముసలా ముతక చాలామంది చెంబుదీసుకొని బయలు తేరతారు. ఇప్పుడు నేను నడిచిపోడం చాలా కష్టం. చెప్పులేసుకున్నా – కట్ట మీదున్న రాళ్లమీద నడవాలంటే కష్టం. యెట్లాపోడం? పాదాల మీద చల్లటి నీళ్లు పోసుకుంటే యిరోచనం తొందర్నే కొద్దిగ సేపు వాయిదా వెయ్యొచ్చు.

చిన్నగా గాబుకాడికి నడిచెల్లి చెంబుముంచి, పాదాల మీద గుమ్మిరిచ్చుకున్నా. లక్ష గాజు పెంకులు పాదాలలోకి దిగబడినట్టుంది. నోట్లోంచి శబ్దం కూడా రాలా, గాలంతా గుండెల్లోకే తన్నింది. ఆడ ఆగింది. తీట...

చీకటిపడేదాకా ఆపడం కష్టమనిపిస్తంది. చీకటిపడడానికి చాలా టయముంది. ఈలోపు వొకసారి యెల్లి రావడమే మంచిది.

కష్టమ్మీద చెప్పులేసుకొని గాబుకాడ చెంబు ముంచుతుంటే – 'యేందమ్మా, మాత్తరేసుకున్నా కట్టుకోలేదే...!' అనంటా నా చేతిలో చెంబు తీసుకొని మమ్మ నా పక్కనే నడుస్తా వుంది. అడుగు తీసి అడుగేయడం గగనమవుతోంది. మమ్మ నా పాదాలెంక జూస్తా మళ్లీ 'ఆ సైతాన్ నా బట్ట' అని తిట్లకి లంకిచ్చుకుంది.

మా యనక నుంచి చెంబు దీసుకొని వచ్చిన సెవిటి కరుణమ్మవ్వ 'యెప్పుడొచ్చావ్ సిన్నమ్మాయ్' అని నా బుగ్గల్లాగి ఆ యేళ్లు ముద్దు పెట్టుకుంది. సగం పళ్లు వూడిపోయినయ్, మనిషి బాగా వడిలింది. యెండి తునకలాగా వుంది. కానీ వుషారు తగ్గలా! 'రాత్రొచ్చానవ్వా' అంటే 'యేందీ నిన్నొచ్చావా' అని 'తల్లీకూతుళ్లు పెళ్లి నడక నడుస్తున్నారే, నడవండి, నడవండి... నాకు తొందరగుంది నే బోతున్నా' అని ముసిముసిగా నవ్వుకుంటా మమ్మల్ని దాటెల్లిపోయింది. నాకు కరుణమ్మవ్వంటే బోయిష్టం. నాకే గాదు పిల్లలందరికీ! చిన్నప్పుడు మా పిల్లందర్నీ పోగేసి రకరకాల ఆటలు ఆడిచ్చేది. భలే భలే కతలు చెప్పేది. యిప్పటికీ అంతే...

ఇంక కట్టెక్కుతామనగా రైలు కూత యినబడింది. 'రైలుబోనీయమ్మా' అంది మమ్మ. వక్క రవ్వ ముందొచ్చినట్లయితే ఈ పాటికి కట్టదాటి కంపలో కెళ్లుండేదాన్నే. ఛీ... యీ పొర్లునెప్పి పాడుగాను, యెంత నెప్పంటే, ఈ పాటికి కట్టదాటేదాన్నే... మమ్మ చెప్పినా వినకుండా... కానీ పాదాలు నడవనివ్వవ్! నిలబడలేకున్నా! కడుపు నెప్పి కాళ్ల నెప్పి...

రైలు వొకటే మొయినంగా కూతేస్తావుంది. చెవులు చిల్లులు పడతన్నయ్. దగ్గరకొచ్చే కొద్దీ రైలు స్పీడు తగ్గి స్లో అయింది. స్లో అయ్యి ఆగిపొయ్యింది. కూతేస్తా ఆగింది. 'సిగ్నలిచ్చినా కూడా ఆగిందే' అంటంది మమ్మ. అయిదు నిమిషాల తర్వాత మా గేర్లో వాళ్లు కట్టమీదకి లగెత్తుతున్నారు – 'సెవిటి కరుణమ్మ దొడ్డికెల్లి రైలు కింద పడి సచ్చిపొయ్యిందంట' అనుకుంటా! రైలు పెద్దగా కూతేసి, చిన్నగా కదిలి, మా ముందు నుంచి వెళ్లిపొయ్యింది.

'వామో కరుణమ్మమ్మోవ్' అని అరుసుకుంటా మమ్మ నన్నిడిసి పెట్టి కట్టమీదకి పరిగెత్తింది. నా గుండెల్లో లక్ష రైళ్లు పరిగెత్తినయ్. అడుగు తీసి అడుగెయ్యలేకపోతన్నా.

బట్టల్లోనే యిరోచనం అయింది. నిలబడిన చోటే కూలబడిపోయా గుండెల్లోంచి దుఃఖం పెద్ద రైలు కూతలా తన్నుకొస్తంది.

☆

కథ

పెంట

- బమ్మిడి జగదీశ్వరరావు

అలారం మోగకముందే సెల్‌ఫోన్ మోగింది!

'తెల్లవారింది...' మా ఆవిడ గొణుక్కుంటూ ఫోనందుకొని నేలకేసి కొట్టకుండా నా ముఖాన కొట్టింది.

ఆఫీసు నుండి... 'యేం పెంటో' అనుకుంటూ లిఫ్ట్ చేసానని అనుకున్నాను గాని, లిఫ్ట్ చేసాకే అన్నట్టున్నాను. 'మాణింగ్... ఏదో ఒక పెంట...' అని ఆగి, 'ఏం పెంట పెడదాం?' మా కొలీగ్ నన్నడిగాడు.

నా నుంచి వెంటనే సమాధానం రాకపోవడం వల్లనేమో.... 'పెంట అదిరిపోవాలన్నారు ఎమ్డీగారు... గుభాళించి పోవాలి...' కొలీగ్ మాటలు ఆ నిద్ర మత్తులోనూ అర్థమయ్యాయి. 'గుభాళించడం... అంటే రేటింగ్ బాగా రావాలి..' అని!

'కుక్కలు కొట్లాడుకుంటున్నట్టు ఒకటే గోల... అరిచిందే అరుచుకొని... ఒకరు మాట్లాడాక ఒకరు మాట్లాడకూడదా?' మా ఆవిడ ఆ విమర్శ అప్పటికప్పుడు చేయక పోయినా ఎప్పుడో చేసింది గుర్తుకువచ్చింది.

కొలీగ్ లైన్లోనే వున్నాడు. 'న్యూసేంటి?' నా మాట పూర్తవక ముందే - 'రొటీన్.... మనమే ఏదో రాజెయ్యాలి..' గొణుగుతున్నట్టు అన్నాడు.

'ఆరిపోయిన నిప్పుని రాజేయడం పొగపెట్టడం పొలిటీషియన్ల పనేకాదు, మన పని కూడా!' నిన్న నేను ఆఫీసులో అన్నమాట నాకే వినిపించింది.

'విభజన గొడవ అయిపోయింది కదా?' అని జూనియర్ స్టాఫ్ అంటే 'అవలేదు, ఈ ప్రభుత్వాన్ని ఆ ప్రభుత్వం.. ఆ ప్రభుత్వాన్ని ఈ ప్రభుత్వం అంటూ వుంటే అదో వెయిటేజీ... అంతకు మించిన మయిలేజీ...' కొలీగ్ క్లాసు తీసుకోవడమూ గుర్తుకు వచ్చింది.

'అంత చించకు..' కొలీగ్ ఫోన్ లైన్లోనే వున్నాడు. 'అంత ఆలోచించకు, బుర్రపాడై పోద్ది, రాత్రి వరకూ మండెయ్యడానికి అవదు..' రాత్రిది యింకా దిగకముందే ఎక్కించడం గురించి మాట్లాడుతున్నాడు.

'బాగా బర్నింగ్ పాయింటు కావాలి...' అలవాటుగా అన్నాను.

'ఏదో ఒకటి ముట్టించు.. అదే కాలుతుంది..' కొలీగ్ మాటకు సిగరెట్ ముట్టించబోయా. తళుక్కుమని వెలిగింది. నిప్పు రవ్వ... అగ్గెట్టెయ్యొచ్చు....

'ఇద్దరూ చంద్రులే...' నే చెప్పకముందే 'అందుకే నిండు అమావాస్య' అంటూ వేసేసాడు కొలీగ్.

'రెండూ తెలుగు ప్రాంతాలే...' నాకు చెప్పే అవకాశమీయ కుండా 'అయితే లాభమెవరికి? నష్టమెవరికి?' అవి కొలీగ్... 'భలేపెంట' 'భలే ఔట్‌పుట్' కొలీగ్ స్వరంలో జోష్ పెరిగింది.

'ఇన్ పుట్స్ ఏమున్నాయి?' అడిగానో లేదో హుషారుగా' బాబుగారివి రెడీగా వున్నాయి....' ఆంధ్రాని అనాథని చేసారు, కట్టుబట్టలతో పంపించారు... రాజధాని లేని రాష్ట్రాన్ని ఊహించ లేకుండా వున్నాం.. . నేనే కూలీ నెంబరు వన్....' మాడ్యులేషన్‌తో ఆడియో ఎఫెక్టు ఇచ్చాడు.

'ఓకే' అన్నాను, 'అపరా బాబూ' అన్నట్టు.

'కేసీఆర్.... హరీష్ రావు ఇప్పటికీ ఉద్యమనేతల్లానే మాట్లాడుతూ వున్నారు.... 'ఆంధ్రోళ్ళు' విజివల్స్ చానా వున్నాయ్...' కొలీగ్ దూసుకుపోతున్నాడు.

'టీడీపీ టిఆరెస్ వాళ్ళతో పాటు కాంగ్రెసు వాళ్ళనూ పిలవండి....' ఫోన్ ఇన్' కూడా ముందే మాట్లాడి పెట్టండి... ఎవడెవడో ఏదేదో మాట్లాడితే లేని పోని పెంట. ఉన్న పెంట చాల్లే' అన్నాను.

'ఓకే బాసూ...' ఎవరికి లాభం? ఎవరికి నష్టం 'కాయిన్ చెయ్యనా?' అని 'మనకి లాభం' గొణుకుతున్నట్టు ఆఖరి మాట అన్నాడు కొలీగ్.

'ప్రత్యేక తెలంగాణ రావడం వల్ల ఆంధ్రప్రాంతం లాభపడిందా? నష్టపడిందా? ఎస్సెమ్మెస్ క్వశ్చన్ ఇవ్వు...' అన్నాను. 'ష్యూర్... కాక మీద వున్న వాళ్ళంతా తెగ 'నో' అని పంపిస్తారు, యాడ్స్ కన్నా ఈ సారి ఎస్సెమ్మెస్ రెవెన్యూయే ఎక్కువొస్తుంది.' కొలీగ్‌తోపాటు నేనూ సంబరపడిపోయాను.

కట్ చేస్తే -

కట్ చెయ్యకుండానే 'లైవ్' లైవ్లీ లవ్లీగా వస్తోంది.

విభజనకు ముందు 'కలిసివుంటే కలదు సుఖం' అన్నవాళ్ళంతా 'విడిపోయి కలిసుందాం' అంటున్నారు. 'తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది' అన్నవాళ్ళంతా 'తెలుగు జాతి మనది రెండుగ వెలుగుజాతి మనది' అంటున్నారు.

'ప్రేక్షకులకో ఎస్సెమ్మెస్ క్వశ్చన్ అడిగాం' అని 'ప్రత్యేక తెలంగాణ రావడం వల్ల ఆంధ్రప్రాంతం లాభపడిందా? నష్ట పడిందా?' అని అడిగాం. 'లాభపడింది అని 27 శాతం మంది అంటూ వుంటే నష్టపడింది అని 73 శాతం మంది అంటున్నారు. 'న్యూస్ రీడర్ కమ్ న్యూస్ ఎడిటర్ చెప్పకముందే -

'వాళ్ళవి పదమూడు జిల్లాలు కదండీ' అంది గులాబీ కండువా.

'మీవి పది జిల్లాలు గనుక తక్కువ మంది ఎస్సెమ్మెస్ చేసారంటారా?' అన్నాడు రీడర కమ్ ఎడిటర్. ఏదో ఒకటి మాట్లాడుతూ - అంతకు మించి నవ్వుతూ.

'జిల్లాలు కూడా సమానంగా పంచాలేమో' ఎడిట్ రూమ్‌లో మా కొలీగ్ తన పంచ్‌కు తనే పడిపడి నవ్వాడు. స్క్రీన్ వంక చూసాడు.

'ఒక్క లాభం చెప్పండి చాలు....' అంది పసుపు కండువా.

'స్టేటు డివైడ్ కావడం వల్లే మీ చంద్రబాబు అధికారంలోకి అచ్చిందు...' అంది గులాబీ కండువా.

'పవర్లో వున్నోళ్ళని గెలిపించరు కదండి...' అశోకచక్రం తీసేసి హస్తం గుర్తుగల జాతీయ పతాకమే కండువాగా కప్పుకున్న పెద్ద మనిషి అన్నాడు.

'ఏమి లాభం అండీ... మాకు రాజధాని కూడా లేదు...' పసుపు కండువా.

'ఎక్కడ మీకు.. మీ పార్టీ వాళ్ళకి మీ వర్గం వాళ్ళకి భూములున్నాయో అక్కడే రాజధాని వస్తుందటగా?' పిడకల వేటగా ఓ మాటన్నాడు రీడర్ కమ్ ఎడిటర్.

'రియలెస్టేట్ చేసి మంచిగ డబ్బు సంపాదించుకొనుడు లాభం కాదా?' అంది గులాబీ కండువా.

'అయ్యా... మీ నాయకుల దెబ్బకి హైదరాబాద్‌ల రియలెస్టేటు కుప్పకూలి పోయింది గదా?' పసుపు కండువా.

'మీ ఆంధ్రాకు పోయి చేసుకొండి రియలెస్టేటు' గులాబీ కండువా చెప్పక ముందే 'మా భూములన్నీ గుంజుకుంటున్నారు.... నెత్తిన గుడ్డేసుకోవాలి. ఒక నష్టమా? అన్నీ నష్టాలే...' పసుపు కండువాని నిలువరించడానికి మధ్యలో బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది.

మా కొలీగ్ అడ్డదిడ్డంగా ప్రశ్నలేవో రాసి మా రీడర్‌కమ్ ఎడిటర్‌కు యివ్వబోతూ నాకిచ్చాడు.

'బాగున్నాయ్' అన్నాను. అడ్డదిడ్డంగా ప్రశ్నలు వుంటే ప్రోగ్రామ్ స్ట్రెయిట్‌గా స్ట్రెంగ్తెన్‌గా వుంటుంది.

తిరిగి స్వాగతం పలికి, మళ్ళీ ఓ మారు ఎస్సెమ్మెస్ ప్రశ్న అడిగి, ఆ తర్వాత 'రాష్ట్రం విడిపోవడం వల్లే కదా... విద్యా సంస్థలూ విద్యాలయాలూ పరిశ్రమలకు అవకాశం వచ్చింది...' మా రీడర్ కమ్ ఎడిటర్ అడిగాడు. మా కొలీగ్ తన ప్రశ్నవిని గర్వంగా చూసాడు.

'కరీంనగర్ నుండి ఫోను..... హనుమంతుగారూ చెప్పండి....'

'ఉత్తరాంధ్ర రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీలిచ్చినారు గదా సార్... లాభమన్న మాటే గదాసార్.... మా తెలంగాణకు ఒక్క ప్యాకేజీయివ్వలే. బీజేపీ తెలంగాణకు మద్దతిస్తది. మోడీ చంద్రబాబు చెట్టాపట్టులేస్క తిరుగుతరు. మరి మాకు లాభమా నష్టమా?'

ఫోన్‌ని కట్ చేసేసి... 'సారీ ఫోన్ కట్టయింది' నవ్వుతూ నొచ్చుకున్నాడు మా రీడర్ కమ్ ఎడిటర్.

'సార్ ప్రత్యేక ప్యాకేజీ తెలంగాణకు యిస్తామని శ్రీకృష్ణ కమిటీ కూడా చెప్పింది. అప్పుడు తీసుకోలేదు. ఇప్పుడు మాకిస్తే లాభం అంటున్నారు. ఆ లాభం మీరెందుకు తీసుకోలేదు?' పసుపు కండువా.

'మీ లాభం మీరు చూసుకోండి. మా లాభాలు సంగతి మీకేల?' అంది గులాబీ కండువా.

'లాభం లేకుండా ఎవ్వరూ ఏ పనీ చెయ్యరు...' జాతీయ పతాక హస్తగతమైన కండువా అన్నది.

'పియ్యమ్మ పదవి లాభం కోరేగదా తెలంగాణ యిచ్చారు...' రీడర్ కమ్ ఎడిటర్ నవ్వాడు.

'అది ప్రతి పక్షాల ప్రచారం....' జాతీయ పతాక కండువా.

'అందుకే ప్రతిపక్షం హోదా కూడా దక్కలేదు...' పసుపు కండువా పగలబడి నవ్వింది.

'మన చర్చ అది కాదు, లాభమా? నష్టమా? అన్నంత వరకే. అక్కడికే పరిమితమవుదాం...' రీడర్ కమ్ ఎడిటర్ చర్చను తన దార్లోకి.

అదే సమయంలో కొలీగ్ ఏదోకాల్ ఎత్తి విని, వినలేక లైన్ కట్ చేసాడు. ఏమయిందన్నట్టు చూసాను.

'ఎదవ కాల్స్ అన్నీ రిసీవ్ చేసుకొని యిస్తాడు యెదవ...' తిట్టుకుంటున్న కొలీగ్ వంక చూసాను.

'ఏరా మైండు దొబ్బిందా? రాష్ట్రం విడిపోయి రెండు నెలలు కూడా కాలేదు, రెండు దశాబ్దాలో శతాబ్దాలో గడిచిపోయినట్టు లాభ నష్టాలు బేరీజు ఏంటి?' అని అడుగుతున్నాడు.

నేను నిట్టూర్చాను.

'మనం చాలా అడ్వాన్సుగా ఉన్నాం. రెండు దశాబ్దాల.... రెండు శతాబ్దాల కన్నా ముందున్నాం...' సిగ్గుపడలేదు. సరికదా నవ్వేసుకున్నాడు.

'ఒక్కొక్కడికి బీపీ రెయిజవ్వాలి. అప్పుడే ఛానెల్‌కు కనెక్టవుతారు...' క్వాలిటీసెల్ ఇన్‌ఛార్జీ అన్నమాటలు గుర్తొచ్చాయి.

టీవీ స్క్రీన్ వంక చూసాను.

'మేం యిక్కడ పెట్టుబడులు పెట్టాం. పొమ్మంటే బిచాణ ఎత్తేస్తే వచ్చేది లాభమా నష్టమా?' పసుపు కండువా.

'వ్యాపారం చేసిననాళ్ళు చేసారు. పొమ్మంటే పోవాలి కదా?' కన్వింపుగా వెటకారంగా అడిగాడు రీడర్ కమ్ ఎడిటర్.

'ఎవరండీ పొమ్మంటున్నారు.... మీ వ్యాపారాలు మీరు చక్కగా చేసుకోండి. ఎవరొద్దన్నారు, కేసీఆర్ వద్దన్నాడా?' గులాబీ కండువా.

'లగడపాటి రెడ్‌కార్పెట్ వేస్తామన్నారు కదా?' ముసలి సంపాదకుడు మొహమాట పడలేదు. 'మరి ఉద్యోగస్తుల మాటేమిటి? పిల్లల చదువులూ.... యింకా యిల్లూపొల్లూ కట్టుకొని యిక్కడే స్థిరపడిన వాళ్ళు వెళ్ళిపోవాలంటే.... నష్టం కాదా?' ఆయనే మళ్ళీ అన్నాడు.

'మీ రాష్ట్రానికి మీరు సేవలందించరా?' గులాబీ కండువా తమ నాయకుడి మాట మాట్లాడింది.

'ఉద్యోగులు - ఆప్షన్‌లు - అది వేరే చర్చ.... మనం రెండు స్టేట్స్ లాభనష్టాల గురించి స్టిక్ ఆన్ అవుదాం.... అంతకన్నా ముందో బ్రేకు తీసుకుందాం' అన్నాడు రీడర్ కమ్ ఎడిటర్.

'వెల్ కమ్ బ్యాక్...' చెప్పిన రీడర్ కమ్ ఎడిటరు 'వైయస్సార్ సీపీ నాయకులు లైన్లో వున్నారు, మాట్లాడండి....' అని పేరూ హోదా చెప్పాడు.

'అందరూ లాభపడాలి! రెండు రాష్ట్రాలూ లాభపడాలి! మేం అధికారంలోకి వస్తే...' చెప్పకముందే 'అందరూ ఎలా లాభపడతారు? ఒకరు నష్టపోతే కదా? యింకొకరికి లాభం!' రీడర్ కమ్ ఎడిటర్ ప్రశ్నకు కొలీగ్ వంక చూసాను. ఆ ప్రశ్న తనది కాదన్నట్టు పెదవి విరిచి అడ్డంగా తలూపాడు.

ఇంతలో 'వాళ్ళ నాయకుడు కేసుల్లోంచి బయట పడితే లాభం... లేక పోతే నష్టం...' అని పసుపు కండువా అంటే 'అది నష్టమెలా అవుతుంది? సంపాదించిన దాంట్లో పోయేది ఎంత? అసలు ఎంత? కష్టపడి సంపాదించింది కాదు గదండీ....' ముసలి సంపాదకుడు మొహమాట పడలేదు.

'నన్ను మాట్లాడమని... మీరంతా మాట్లాడితే ఎలా? ఇంక నాకెందుకీ ఫోను....' మైకూ ఇయరు ఫోనూ విసిరికొట్టి లేచిపోయాడు వైయ్యస్సార్‌సీపీ నాయకుడు.

'సారీ అండీ... చర్చా వేదిక అన్నాక భిన్నాభిప్రాయాలుంటాయి. వాటిని మీరు ఖండించొచ్చు... మళ్ళీ మావాళ్ళు ట్రై చేస్తారు... మీరు అర్థం చేసుకు మాట్లాడండి...' రీడర్ కమ్ ఎడిటర్ ఫోన్లో చెప్పేసి - 'ఇంతకీ తెలంగాణకు ఏమిటి లాభం?' అని అడిగాడు.

'ఇంతవరకు జరిగిన నష్టం యిక మీదట జరక్కుండా వుండడమే లాభం!' గులాబీ కండువా.

ఆ మాటతో అందరూ గొల్లున నవ్వారు!

గల్పిక:

సింగిల్ విండో

'క్యూ'లో నిలబడ్డాను. నావంతు వచ్చింది. ఎలా ప్రారంభించాలో తేలీక 'మావాడు యిక్కడే చదువు కొంటున్నాడు' అన్నాను.

'ఏ క్లాసు?' అని విండో లోపలి వ్యక్తి అడిగాడు.

'సైన్స్ క్లాసు....' మా వాడన్నాడు.

'ఫీజు...' కంప్యూటర్ని టకటక లాడిస్తూ విండో వ్యక్తి నా ముఖం చూడకుండా అన్నాడు. అడిగినన్ని వేలూ కట్టాను. ఎనిమిది నెలల కష్టం... 'మీ వాడు యిక్కడే చదువు కొంటున్నాడు కాబట్టి అన్నీ యిక్కడే కొనాలి' విండో వ్యక్తి మాటకు తలాడించాను.

'బుక్స్...' అన్నాడు మవాడు.

టెక్స్ట్ బుక్స్ ప్లస్ నోట్ బుక్స్ లిస్టియిచ్చి పైజేబులోని డబ్బులు లాక్కున్నాడు. రెండు బండిళ్ళ బస్తాలు యిచ్చాడు.

'షూష్' అన్నాడు మా వాడు.

డైలీ యూజ్ ప్లస్ స్పోర్ట్ షూష్ యిచ్చాడు. 'మీ స్కూలుకు గ్రౌండే లేదు, స్పోర్ట్స్ షూష్ దేనికి?' అడగాలని అడగలేక పోయాను. అడగ కుండానే నాలుగు జతల షుష్ ఇచ్చాడు.

'పెన్నులూ పెన్సిళ్ళూ కాంపెస్ బాక్సూ.....' అన్నాడు మావాడు.

'అన్నీ ఉన్నాయి....' అంటూ విండో వ్యక్తి తీసి యిచ్చాడు.

'బ్యాగు' అన్నాడు మావాడు.

'ఇవన్నీ తీసుకెళ్ళడానికా?' అనుకుంటే స్కూలు బ్యాగు తీసియిచ్చాడు.

'స్కూలు డ్రెస్సు' అన్నాడు మావాడు.

'మండే టు ఫ్రైడే ఏజ్ యూజువల్ స్కూలు డ్రెస్‌లు రెండు జతలు... ప్లస్ స్పోర్ట్స్ డ్రస్ ఒకటి తీసుకోండి, తరువాత ఇంకోటి తీసుకుందురు' నా జేబులు ఖాళీ అవడంతో కాస్త కనికరించి జాలి చూపించాడు విండో వ్యక్తి.

'టక్కూ టై...' విండో వ్యక్తి గుర్తు చేసాడు.

'డైరీ?' అప్పుడే గుర్తుకొచ్చినట్టుగా అన్నాడు మావాడు.

'మీ వాడు భలే జీనియస్.... ఏదీ మర్చిపోలేదు... గ్రాస్పింగ్ పవర్ బాగుంది...' విండో వ్యక్తి హైఓల్టేజిగా అన్నాడు. ఫిల్మెంటు రాలిన బల్బు ముఖం వేసుకొని నేను.

'మీ వాడు కూర్చొని చదువుకొనడానికి చైరూ పేడూ.....' అడక్కుండా తీసి యిచ్చాడు విండో వ్యక్తి.

జేబులే కాదు, మాటలు ఖాళీ అయి నేను.

'మీ వాడు ఈ ట్రాఫిక్కులో పడి టైంకు యేం వస్తాడు? పైగా సెక్యూరిటీ? అందుకే మా ట్రాన్స్ పోర్టు వాడుకోండి. నెలకు వెయ్యి. ఒక ఏడాదికి కట్టేయండి చాలు....' విండో వ్యక్తి నన్ను కట్టిపడేసాడు.

రిసీప్ట్ అందుకొని 'మావాడు' థ్యాంక్యూ అంకుల్' అన్నాడు.

'రోజూ స్కూలుకు రావాలి. మీ నాన్నగారు ఎంత కష్టపడి చదివిస్తున్నారో కదా?' అని విండో వ్యక్తి ఆగాడు.

మావాడు అటూ యిటూ ఎటుపడితే అటు తలూపాడు.

'నువ్వు స్కూలుకు రాలేదనుకో... రోజుకు రెండొదలు ఫైన్... ఎన్ని రోజులు రాకపోతే అన్ని రెండొందల్లే....' విండో వ్యక్తి.

'వాడు రాకపోతే నాకా ఫైను?' నా నోట్లోనుంచి మాట రాలేదు.

'డిసిప్లేను' నవ్వుతూ అన్నాడు విండోవ్యక్తి.

జేబులన్నీ కత్తిరించుకున్నాక 'మీ వాడికింత ఇన్వెస్టు చేస్తున్నారంటే రేపు మొత్తం వడ్డీతో లాగెయ్యాలి...' అని నావైపు నుండి మా వాడి వైపు చూసి 'నువ్వు బాగా చదువుకోవాలి' అన్నాడు విండోవ్యక్తి.

'బాగా చదువుకొంటాను' అని తలాడించాడు మావాడు.

'నేను చదువుకొనలేను' అన్నాను నేను.

మావాడు అర్థం కానట్టు చూసాడు.

'నెక్స్ట్....' అన్నాడు విండో వ్యక్తి.

అలా అంతా చదువు కొంటునే వున్నారు!

- బజరా

అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పి - అంతకన్నా ముందు ఎస్సెమ్మెస్ పర్సెంటేజీ చెప్పి - ఆ తరువాత కాలర్లకు ఎస్సెమ్మెస్ చేసిన వాళ్ళందరికీ కృతజ్ఞతలు చెప్పి ముగించాడు రీడర్ కమ్ ఎడిటర్.

'ధన్యవాదాలు బాగా చెప్తాడు...' కొలీగ్ గొణుగుతూ వుండగా లైవ్ కట్టయింది.

అందరం..... అన్ని పార్టీల్లో వాళ్ళూ ముసలి సంపాదకుడూ మా రీడర్ కమ్ ఎడిటరూ నేను మా కొలీగూ అంతా గెస్ట్‌రూమ్‌లో చేరాం.

ఇందాకటి వేడి అంతా యిప్పుడు ఉప్మాలో వుంది. జీడిపప్పు... తింటూ కబుర్లు ఆడుకుంటూ వుండగానే టీ కాఫీలు వచ్చేసాయి. వాటితో పాటే మా ఏమ్మీ వచ్చాడు. మా విషెస్ తీసుకోకుండా తనే పొలిటీషియన్లను విష్ చేసాడు.

'మీరూ పొలిటిక్స్‌లోకి రావాలి....' అన్ని పార్టీల లీడర్లు అభీష్టాన్ని మాతోసిపుచ్చలేదు. 'చేతిలో ఛానెల్ వుంది.... అది చాలు...' ముసలి సంపాదకుడు ముచ్చటపడ్డాడు.

'మనలో మన మాట... ఇంతకీ రాష్ట్రం విడిపోవడం వల్ల లాభమా నష్టమా?' మా రీడర్ కమ్ ఎడిటర్ వడ్డించాడు చనువుగా.

'ఎవరి రాజకీయాలు వారు చేసుకోవచ్చు, ఎవరి వ్యాపారాలు వారు చేసుకోవచ్చు' అభిప్రాయాలు చెప్పకముందే 'రెండూ వేరు వేరుకాదు, ఒక్కటే' మా కొలీగ్ గొణుగుడు.

'ఎవరి లాభాలూ నష్టాలూ వాళ్ళవే! నష్టాల్ని లాభాలుగా మార్చుకోవాలి....' అందరిదీ ఒకటే అభిప్రాయం.

'ఎటువాళ్ళం అటు మాట్లాడకపోతే జనం ఏమైపోతారు? మనం ఏమైపోతాం? మనకి మనకి శత్రుత్వమేమైనా ఉందా?' ఎవరిదే మాటో అర్థం కాకుండా వున్నా - అంతా ఒకే అభిప్రాయంతో కలిసి కట్టుగా అనిపించారు.

ఇంతలో నా సెల్ మోగింది. కట్ చేయబోయి ఆగాను. ఊర్లో ఇంటి దగ్గర నుంచి పక్కకు వెళ్ళి 'హలో' అన్నాను.

'ఒరే... పొద్దుటే మీ ఛానెల్లో... అన్ని ఛానెళ్ళు అంతే అనుకో. పెంట ప్రోగ్రామ్ చూసి మీ మామయ్య బీపీ పెంచుకున్నాడు. బూతులు తిడుతూ కూర్చున్నాడు. అంతలోనే సైలెంటయ్యాడేమిటని చూస్తే కింద పడిపోయి వున్నాడు హార్ట్ ఎటాక్ వచ్చిందేమో అంతా హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళారు. పెంటమీదవి ఇంటి మీదకు తెచ్చుకోవడం మంటే యిదే...' అమ్మ చెప్తూనే వుంది, నా చుట్టూ వున్న నాయకుల నవ్వులతో నాకింకేమీ వినిపించలేదు!

తీత్వాల్ కుక్క

- సాదత్ హసన్ మంటో
అనువాదం: బాసిత్

సైనికులంతా తమ, తమ స్థానాల్లో వారాల తరబడి మోహరించి ఉన్నారు. కొద్దిపాటి ఘర్షణ స్థితి, అది కూడా ఏదో తంతులాగా అటూ ఇటూ రోజూ ఓ డజన్ రౌండ్లు కాల్పులు జరుపుకోవడం తప్ప అంతకు మించి ఏమీ లేదు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. పర్వతశ్రేణుల్లో గుబురు పొదల్లో దాక్కోవటానికి సైనికులేవో తంటాలు పడుతుంటే వాళ్ళతో తనకేం సంబంధం అన్నట్లుగా ప్రకృతి తన పని తను కానిస్తూ ఉంది. వనపుష్పాల గాఢమైన పరిమళాన్ని మోస్తూ గాలి వీస్తోంది. ఎప్పటిలా పక్షులు పాడుతూనే ఉన్నాయి. తేనెటీగలు బద్ధకంగా రాగాలు తీస్తూనే ఉన్నాయి.

తుపాకి పేలినప్పుడు మాత్రం వాయిద్యకారుడు డోలు మీద అదిరిపోయే శబ్దం చేసినప్పుడు ఉలిక్కిపడినట్లుగా పక్షులు హఠాత్తుగా చెదిరి ఆకాశమంతా విచ్చుకున్నాయి. అది సెప్టెంబర్ మాసాంతం కావడంతో గ్రీష్మానికి, హేమంతానికి కుదిరిన శాంతి ఒప్పందంలా వాతావరణం సమశీతోష్ణంగా ఉంది. నీలాకాశంలో దూదిపింజల్లాంటి మేఘాలు, సరస్సులోని నావల్లాగా తేలియాడుతున్నాయి.

ఎటూ తేల్చని యుద్ధం సైనికులకు విసుగు తెప్పిస్తోంది. చెప్పుకోదగ్గ ఘటనలేవీ లేవు. ఇరు వైపులా ఉన్నవీ దుర్గమ స్థావరాలే. వాళ్ళు నిలుచున్న కొండలు ఎదురుబొదురుగా దాదాపు సమాన ఎత్తులో ఉండి ఏ వైపు కూడా ప్రత్యేక ప్రయోజనం చేకూర్చని సమ న్యాయం పాటిస్తున్నాయి. కొండల్ని వేరుచేసే లోయలోకి కిందుగా శిలాతల్పం పై సర్పంలా మెలికలు తిరుగుతూ ఒక వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

యుద్ధంలో వైమానిక దళాల ప్రమేయంగాని, భారీ మర ఫిరంగుల విధ్వంసం గాని లేవు. రాత్రిళ్లు వాళ్లు పెద్ద పెద్ద మంటలు పెట్టుక్కూర్చోని పరస్పరం కొండల నడుమ ప్రతిధ్వనించే మాటల్ని వింటూంటారు.

అప్పుడే, చివరి రౌండ్ చాయ్ తాగేశారు. మంటలు చల్లారిపోయాయి. ఆకాశం నిర్మలంగా ఉంది. గాలి చల్లగా కోస్తున్నట్లు వీస్తోంది. మగ్గిన దేవదారు ఫలాలు నుండి ఏదో వాసన వస్తోంది కాని అదేమంత ఇబ్బందికరంగా లేదు. సైనికుల్లో ఎక్కువ మంది నిద్ర పోయారు, జమేదార్ హర్నాం సింగ్ తప్ప. అతడు రాత్రి కాపలా కోసం సెంట్రీ ఉన్నాడు. తెలవారు ఝామున రెండు గంటలకు అతడు గండా సింగును నిద్ర లేపి తన డ్యూటీ అప్పగించాడు. పడుకున్నా కూడా అతడి కంటికి నిద్ర దరిచేరడం లేదు. ఆకాశంలోని నక్షత్రాల్లా అది అందనంత దూరంలో ఉంది. దాంతో అతను చిన్నగా ఓ పంజాబీ జానపద గీతాన్ని ఎత్తుకున్నాడు.

'నాకో పాదరక్షల జత కొనిపెట్టవా ప్రియతమా
నక్షత్రాలు పొదిగిన పాదరక్షల జత
నీ బర్రెనులు అమ్మైనా సరే
నాకో జత పాదరక్షలు కొనిపెట్టవా?
నక్షత్రాలద్దిన పాదరక్షల జత...'

అతనికా వాతావరణం ఆహ్లాదకరంగా అనిపించింది. కొంచెం భావోద్వేగ ప్రేరితుడు కూడా అయ్యాడు. ఇక ఒక్కొక్కర్నీ నిద్ర లేపడం మొదలుపెట్టాడు. అందర్లోకీ చిన్నవాడైన బంటా సింగ్ తన కమ్మని గొంతుతో పాటెత్తుకున్నాడు. అన్ని కాలాల్లోను ఎవర్ గ్రీన్ ప్రేమ కావ్యం, ప్రేమను, విషాదాన్ని రంగరించిన 'హీర్ రాంఝా' నుండి ప్రేమ రాహిత్య దుఃఖాన్ని ఆలపించడం మొదలుపెట్టాడు. అందరిలోనూ గాఢమైన విషాదం అలుముకొంది. అతని విషాదగ్రస్త గీతానికి బూడిద రంగు కొండలు కూడా ప్రభావితం అయ్యాయి.

అటువంటి మూడ్ ఒక కుక్క మొరగడంతో చెల్లా చెదరయ్యింది. 'ఈ కుక్కముండ ఎక్కడ్నుంచి ఊడి పడ్డది?' జమేదార్ హర్నాం సింగ్ అన్నాడు.

అది మళ్లా మొరిగింది. ఈ సారి దాని అరుపు మరింత దగ్గరగా వినపడింది. పొదల్లోంచి ఆకులు రాసుకుంటున్న శబ్దమైంది. బంటా సింగ్ లేచి పరిసరాలను పరిశీలించడానికి బయలు దేరాడు. వెంట ఒక కుక్కపిల్లను లాక్కుంటూ వచ్చాడు. కుక్క తోక ఊపుతోంది. 'దీన్ని పొదల వెనుక పట్టుకున్నా. దీని పేరు 'ఝున్ ఝున్' అని చెప్పింది' ప్రకటించాడు బంటా సింగ్. అందరూ గొల్లున నవ్వారు.

హర్నాం సింగ్ తన కిట్ లోంచి ఒక బిస్కిట్ తీసి దానికి చూపించి విసిరాడు. అది అతడి వైపుగా పోయింది. ఆతను విసిరేసినదాన్ని మురక చూసి తినబోతూండగా హర్నాం సింగ్ దాన్ని వెనక్కి లాక్కున్నాడు.

...'ఆగు, నువ్వు పాకిస్తానీ కుక్కవు కావచ్చు'

మళ్లీ నవ్వులు. బంటా సింగ్ కుక్క వీపు మీద తడుతూ హర్నాం సింగ్ తో అన్నాడు 'జమేదార్ సాబ్', ఝున్ ఝున్ భారతీయ కుక్కే.

'నీ గుర్తింపును రుజువు చేసుకో', హర్నాం సింగ్, కుక్కను ఆదేశించాడు. అది తన తోకను ఊపడం ప్రారంభించింది.

'ఇది రుజువు కాదు. కుక్కలన్నీ తోకలు ఇలాగే ఊపుతాయి'. హర్నాం అన్నాడు.

'పోనీలే, పాపం కాందిశీకుడిలా ఉన్నాడు', అన్నాడు బంటా సింగ్ దాని తోకతో ఆడుకుంటూ.

హర్నాం సింగ్ మరో బిస్కిట్ విసరగానే దాన్నది గాల్లోనే అందుకొంది.

'ఇప్పుడు కుక్కలు కూడా తాము భారతీయులో, పాకిస్తానీయులో తేల్చుకోవాల్సిందే.' ఒక సైనికుడు వ్యాఖ్యానించాడు.

హర్నాం సింగ్ తన కిట్ లోంచి ఇంకో బిస్కిట్ తీసాడు. 'పాకిస్తానోళ్ళందర్నీ, కుక్కలతో సహా కాల్చిపారేస్తాం'.

'హిందూస్తాన్ జిందాబాద్' ఆవేశంగా అరిచాడో సైనికుడు.

కుక్క బిస్కిట్ ను కొరకబోతున్నదల్లా గతుక్కుమని ఆగిపోయింది. తన రెండు కాళ్ల నడుమ తోకను ఉంచి భయం భయంగా చుట్టూ చూసింది. హర్నాం సింగ్ నవ్వాడు. 'నీ దేశమంటే నీకెందుకు భయం? ఝున్ ఝున్, ఇదుగో ఇంకో బిస్కిట్ తినూ'

చీకటి గదిలో ఎవరో స్విచ్ ఆన్ చేసినట్లు భళ్ళున తెల్లవారింది.

ఆ వెలుగు తీత్వాల్ అనబడే ఆ ప్రాంతపు కొండల్లో, లోయల్లో విస్తరించింది.

నెలల తరబడి యుద్ధం జరుగుతున్నా, ఎవరు గెలువబోతున్నారో ఎవరికీ ఖచ్చితంగా తెలీదు.

జమేదార్ హర్నాం సింగ్ తన బైనాక్యులర్ తో దూర తీరాలని పరిశీలించాడు. ఎదురుగా కొండల వెనుక నుండి పొగలు లేవడాన్ని గమనించాడు. తమ లాగే శత్రువు కూడా ఉదయపు అల్పాహారం తయారు చేసుకోవడంలో తలమునకలై ఉన్నాడన్నమాట.

పాకిస్తానీ సైనిక సుబేదారు హిమ్మత్ ఖాన్ తన గుబురు మీసాల్ని ఒకసారి మెలేసి తీత్వాల్ ప్రాంతపు పటాన్ని అధ్యయనం చేస్తున్నాడు. అతని ప్రక్కన వైర్ లెస్ ఆపరేటర్ కూర్చొని ఉన్నాడు. ప్లటూన్ కమాండర్ నుండి సూచనలు అందుకోవడానికి అతనితో అనుసంధానం కోసం ప్రయత్నిస్తున్నాడతను. కొద్ది అడుగుల దూరంలో బషీర్ అనే సైనికుడు బండరాయికి వీపు ఆనించి రైఫిల్ ముందుంచుకొని నేల మీద కూర్చున్నాడు. అతను కూని రాగం తీస్తున్నాడు.

'రాత్రంతా ఎక్కడ గడిపావు ప్రియతమా?

ఓ నా చంద్రికా!

రాత్రంతా ఎక్కడ గడిపావు?'

తనలో తనే ఆనందిస్తూ, ఒక్కో పదం తాలూకు మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ గొంతు పెంచి పాడడం మొదలు పెట్టాడు. హటాత్తుగా సుబేదార్ హిమ్మత్ ఖాన్ అరుపు వినపడింది. 'నువ్వు రాత్రంతా ఎక్కడ గడిపావు?'

అయితే అది బషీర్ ను ఉద్దేశించి కాదు. అటువైపు వస్తున్న కుక్కను గద్దించాడతను.

ఆ కుక్క కొద్ది రోజుల క్రితం ఎక్కడినుండో వాళ్ళ దగ్గరికి వచ్చింది. వాళ్లతో పాటే శిబిరంలో హాయిగా గడుపుతూ ఉన్నది కాస్తా గత రాత్రి హటాత్తుగా మాయమైంది. ఏమైనా, అదిప్పుడు చెల్లని నాణెంలా తిరిగి వచ్చింది.

చిరునవ్వులు చిందిస్తూ బషీరిప్పుడు కుక్క వైపు తిరిగి పాడసాగాడు.

'రాత్రంతా నువ్వు ఎక్కడ గడిపావు?

రాత్రంతా నువ్వు ఎక్కడ గడిపావు?'

అది తోకను మాత్రం ఊపింది.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ ఓ గులక రాయందుకొని దాని వైపు విసురుతూ, 'ఏమైనా అను, తోక ఊపడమే, వెధవ' అన్నాడు.

'దాని మెడ చుట్టూ ఏందది, ఏదో ఉంది?' బషీర్ అడిగాడు.

సైనికుల్లో ఒకరు దాన్ని దగ్గరకు లాక్కుని దాని మెడతాడును విప్పదీసారు. దానికో అట్టముక్క కట్టబడి ఉంది.

బషీర్ కొన్ని అడుగులు ముందుకు వేసి అక్షరాలు కూడబలుక్కుంటూ 'ఝున్ ఝున్' అని రాసి ఉందని చెప్పాడు.

సుబేదార్ ఘనత వహించిన తన బుర్ర మీసాలను మరోసారి మెలితిప్పుతూ, 'బహుశా, అదో రహస్య భాషనుకుంటాను. అది ఇంకేమైనా చెబుతుందా, బషీరే?'

'అవును సర్. అదేం చెబుతుందంటే, అదో భారతీయ కుక్కని'.

'అంటే ఏమని?' సుబేదార్ హిమ్మత్ ఖాన్ ప్రశ్నించాడు.

'బహుశా, అదేదో రహస్యం అయ్యుంటుంది', బషీర్ గంభీరంగా జవాబిచ్చాడు.

ఒక వేళ అది రహస్యమైతే ఆ రహస్యం 'ఝున్ ఝున్' అనే పదంలోనే ఉందీ మరో సైనికుడు తన తెలివైన ఊహను ప్రకటించే చొరవ చేసాడు.

'అవును, అందులో ఏదో ఉందని నాకూ అన్పిస్తోంది'. హిమ్మత్ ఖాన్ సాలోచనగా అన్నాడు.

ఏదో విద్యుక్త ధర్మం గుర్తుకు వచ్చిన వాడిలా బషీర్ దాన్ని మరో సారి చదివాడు. 'ఝున్ ఝున్. ఇది భారతీయ కుక్క'.

సుబేదార్ హిమ్మత్ ఖాన్, వైర్ లెస్ పరికరాన్నందుకొని, ప్లటూన్ కమాండర్ తో కుక్కను గురించిన సంగతులు వివరంగా చెప్పాడు. ఆది ఆ రోజు ఉదయం హటాత్తుగా ప్రత్యక్షం అవడం, అంతే హటాత్తుగా అంతకు ముందు అదృశ్యం కావడం, మళ్ళీ ఉదయం తిరిగి రావడం అంతా చెప్పాడు. 'దేని గురించి మాట్లాడుతున్నావు నువ్వు?' అర్థం కాక అడిగాడు ప్లటూన్ కమాండర్.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ పటాన్ని మరోసారి అధ్యయనం చేశాడు. తర్వాత ఓ సిగరెట్ ప్యాకెట్ ను విప్పదీసి, దాన్నుండి ఒక చిన్న కాగితం ముక్కను చించి బషీర్ కిచ్చాడు.

'దీనిమీద ఆ సిక్కుల భాషలోనే, ఆ గురుముఖీలోనే రాయి'.

'ఏం రాయమంటారు?'

'ఆ...' హిమ్మత్ ఖాన్ ఆలోచిస్తుండగానే, బషీర్ కు ఏదో తట్టింది.

'ఘున్ ఘున్'. అవును, 'మనం 'ఝున్ ఝున్' ను 'ఘున్ ఘున్' తోనే కొట్టాలి'.

'బాగుంది.' సుబేదార్ హిమ్మత్ ఖాన్ దాన్నిఆమోదిస్తూనే, 'ఇది కూడా రాయి: ఇది పాకిస్తానీ కుక్క'.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ స్వయంగా దాని మెడతాడుకు ఆ కాగితం ముక్కను ఎక్కించాడు. 'ఇంక పో, నీ కుటుంబాన్ని కలుసుకో!'

దానికి తినడానికేదో ఇచ్చి, 'చూడు మిత్రమా! నమ్మకద్రోహం చేయొద్దు. నమ్మకద్రోహానికి శిక్ష చావు'. అని చెప్పాడు.

తోక ఊపుకుంటూ పెట్టింది తినసాగింది కుక్క. తర్వాత సుబేదార్ హిమ్మత్ ఖాన్, దాన్ని ఇండియాకు అభిముఖంగా తిప్పి, 'వెళ్ళు! ఈ సందేశాన్ని శత్రువుకు అందజేయి. కాని తిరిగి రా! ఇవి నీ కమాండర్ ఆదేశాలు' అని చెప్పాడు.

ఆ కుక్క అలవాటుకొద్దీ తోక ఊపుకుంటూ పర్వత శ్రేణుల నుండి రెండు కొండల నడుమ ఉన్న లోయలోకి దారితీసే మెలి తిరిగిన బాటమీద కదిలిపోయింది. సుబేదార్ హిమ్మత్ ఖాన్ తన రైఫిల్ అందుకొని గాలిలోకి కాల్చాడు.

మామూలుగా అయితే అటువంటి శబ్దం వినడానికి ఇంకా సమయం కాలేదు కబట్టి, ఇంత పొద్దున్నే ఏమిటని భారత సైనికులు ఆశ్చర్యపోయారు. ఏమైనా జమేదార్ హర్నాం సింగ్ కు అప్పటికే బాగా బోరు కొడుతోంది కాబట్టి ఇక ఉత్సాహంగా, 'జవాబిద్దాం, వాళ్ళకు'అని అరిచాడు.

రెండు వైపులా అరగంట పాటు కాల్పులు జరిగాయి. అదంతా కాలహరణమే తప్ప మరేమీ కాదని తేలిపోయాక 'ఇక చాలని' జమేదార్ హర్నాం సింగ్ ఆదేశించాడు. తన పొడవాటి జుట్టును దువ్వుకొని, అద్దంలో ముఖాన్ని చూసుకుంటూ 'ఆ కుక్క ఝున్ ఝున్ ఎక్కడికి వెళ్లిందంతకూ' అనడిగాడు బంటా సింగును.

'కుక్కలు వెన్నను అరిగించుకోలేవంటారు', బంటా సింగ్ తాత్విక ధోరణిలో సమాధానమి చ్చాడు.

'అదిగో వస్తోంది', సెంట్రీ చేస్తున్న సైనికుడు అరిచాడు.

అగ్నిపద్యం - అలిశెట్టి ప్రభాకర్

- వి.వి

ఎన్నెన్ని
గాయపడిన ఉదయాల్ని
సంకలనంగా కూర్చినా
ఎవరెవరి
బాధామయ గాథల్ని
ఈ కలంతో జాలువార్చినా
మిత్రుడా
నిరంతరం
సూర్యుడే నా ముఖచిత్రం
(సూర్యుడే నా ముఖచిత్రం - సంక్షోభ గీతం 1990)

అమరుడు అలిశెట్టి ప్రభాకర్ కవితా తత్వానికి ఇంతకన్నా పరిచయం అక్కర్లేదు. కళాకారుడు అనే నిర్వచనానికి నిఖార్సయిన పేరు అలిశెట్టి ప్రభాకర్. కవిత్వమే కవిని పరిచయం చేయాలనీ, ఒకరి కవిత్వం కన్నా వారికి ఏ వ్యాఖ్యా, విశ్లేషణ సరియైన నిర్వచనం కావనే వాదన ఒకటి ఉన్నది. కాళోజీ నుంచి త్రిపురనేని శ్రీనివాస్ వరకు బలంగా ఈ వాదన చేసినవారే. విశ్లేషణంటే మేడ్ డిఫికల్టీ అనే అసహనమేదో కాళోజీ ప్రదర్శించేవారు. అయితే ప్రభాకర్ వ్యక్తిత్వం కవికన్నా విస్తృతమైంది. ఆయన కళాకారుడు. నిరక్షరాస్యులైన కోట్లాదిమంది ప్రజల దగ్గరికి చేరడానికి కవిత్వం ఎంచుకున్న మాధ్యమం పాట తనకు సాధ్యం కానపుడు (లేదా తాను పాడలేననో ఏ కారణం వల్లనో అది తన వల్ల కాదనుకున్నపుడు) ఆయన రెండు దృశ్యమాధ్యమాల్లో కవిత్వం చెప్పాడు. ఆ రెండు దృశ్య మాధ్యమాలకు అక్షరాన్ని జోడించాడు. కనుక ప్రభాకర్ నాలుగు డైమెన్షన్స్ ఉన్న కళాకారుడు. అవి ఆయన జీవితం - చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ - ఈ మూడింటికీ అభిన్నమైన పాట అంతటి బలమైన వ్యక్తీకరణ ఉన్న కవిత్వం. ఆ కవితా ప్రక్రియను మినీ కవిత్వం అనలేము. నూజివీడుకు చెందిన ఎం.వి.ఎల్. నరసింహారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివినపుడు అలిశెట్టి ప్రభాకర్‌తో పరిచయమై తెలుగు నేల అంతటా ఆయన కవిత్వాన్ని విస్తృత ప్రచారం చేసాడు. పాటవలె, అది కూడా గుండెలోతుల్లోకి దూసుకుపోయే శక్తివంతమైన పాటవలె గుర్తు పెట్టుకునే లక్షణం ప్రభాకర్ కవిత్వానికి ఉంది. ఎం.వి.ఎల్. దానిని పట్టుకొని మూడు దశాబ్దాల క్రితమే సాహిత్య లోకానికి దానిని పరిచయం చేసాడు. ఇటీవల ఒక సందర్భంలో ఆర్.నారాయణ మూర్తి గారు, నేను సినీ నటుడు బ్రహ్మానందం గారిని కలిసాము. ఆయనతో కూర్చున్న అరగంట ఆయన సాహిత్యమే మాట్లాడాడు. అందులోనూ కవిత్వమే. జాషువా, విశ్వనాథ, శ్రీశ్రీ కవిత్వాలనట్లా అలవోకగా వినిపించాడు.

'ఎవరూ?' జమేదార్ హర్నాం సింగ్ అడిగాడు.

'అదే, దాని పేరేంది? ఝున్ ఝున్.' బదులిచ్చాడు సైనికుడు.

'ఏం చేస్తోందది?' హర్నాం సింగ్ అడిగాడు.

'ఏం లేదు. మన వైపు వస్తుందంతే'. తన బైనాక్యులర్ లోంచి తేరి చూస్తూ జవాబిచ్చాడు సైనికుడు.

సుబేదార్ హర్నాం సింగ్ బైనాక్యులర్ లాక్కున్నాడు. 'అవునదే. కాని దాని మెడ చుట్టూ ఏదో ఉందే. ఆగాగు. అది పాకిస్తాన్ కొండ మీదినుండి వస్తున్నది. దీనెమ్మ...!'

అతడు తన రైఫిల్ అందుకున్నాడు. గురి పెట్టి కాల్చాడు. బుల్లెట్ కుక్కకు సమీపంలో ఉన్న ఏదో రాయిని తాకింది. అక్కడే ఆగిపోయింది కుక్క.

అటువైపు సుబేదార్ హిమ్మత్ ఖాన్ తన బైనాక్యులర్ లోంచి అంతా చూస్తున్నాడు. కుక్క గుండ్రంగా తిరిగి వెనుకకు పలాయనం చిత్తగించింది. 'ధైర్యస్తుడెపుడూ యుద్ధ రంగం నుండి పారిపోడు. ముందుకు సాగిపో! నీ లక్ష్యాన్ని సాధించు', కుక్కవైపు చూస్తూ అరిచాడు. అదే సమయంలో దాన్నిపరిగెత్తించాలని గురి పెట్టి కాల్చాడు. ఇంచు తేడాతో కుక్క చెవిని రాసుకుంటూ బులెట్ వెళ్ళింది. సుబేదార్ హర్నాం మళ్లీ కాల్చాడు. రాళ్ళను తాకుతూ వెళ్ళాయి బుల్లెట్లు.

చూస్తుండగానే అది ఇద్దరు సైనికుల నడుమ క్రీడలా మారిపోయింది. ప్రాణ భయంతో గుండ్రంగా తిరుగుతూ దిక్కుతోచక పరుగెత్తుతున్న కుక్కను చూసి అటు హిమ్మత్ ఖాన్, ఇటు హర్నాం సింగ్ ఇద్దరూ వికటాట్టహాసం చేస్తున్నారు. కుక్క హర్నాం సింగ్ వైపు పరుగెత్త సాగింది. అతడు దాన్ని బిగ్గరగా తిడుతూ కాల్చాడు. బులెట్ కాలులో దిగింది. కుక్క నోరెళ్ళ బెట్టి నిస్సహాయంగా అరిచింది. గుండ్రంగా తిరిగి ఈ సారి హిమ్మత్ ఖాన్ వైపు పరుగెత్తింది, మరిన్ని బుల్లెట్లకు ఎదురుగా. దాని స్థితి మరింత భయానకం అయ్యింది. 'ముందుకే పో! గాయ పడ్డంత మాత్రాన నీ విధి నిర్వహణను మరవొద్దు'. పాకిస్తానీయుడు అరిచాడు.

కుక్క విధి లేక వెనుతిరిగింది. కాని దాని కాలు అప్పటికే పనికి రానివయ్యింది. అది తనను తాను ఈడ్చుకుంటూ హర్నాం సింగ్ వైపు రాసాగింది. ఈసారతను జాగ్రత్తగా గురి చూసి కాల్చి చంపేశాడు.

సుబేదార్ హిమ్మత్ ఖాన్ నిట్టూర్చాడు. 'గుంటది అమరత్వం పొందింది'.

'జమేదార్ హర్నాం సింగ్ ఇంకా వేడి చల్లారని తుపాకి గొట్టం పైకి చేతిని పోనిస్తూ' అది కుక్క చావు చచ్చింద'ని గొణుక్కున్నాడు.

ఆశ్చర్యమది కాదు. ఆ ముగ్గురి కవిత్వమెంత చదివాడో అంతకన్నా ఎక్కువగా అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం వినిపించాడు. ఆ కవి మహానుభావుడండీ అన్నాడు. ఆ మాటలో ప్రభాకర్ గుండె నెత్తురులో పిండిన జీవితానుభవం ఉంది - అని చెప్పినట్లు నాకనిపించింది.

1974 ఆరంభంలో వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో కళాశాల వార్షికోత్సవాల్లో భాగంగా చివరి రోజు సాంస్కృతికోత్సవాలు జరిగాయి. జన నాట్యమండలి సాంస్కృతిక ప్రదర్శనలు. ముఖ్య అతిథి గద్దర్. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలని పోలీసులు చాలా ఒత్తిడి తెచ్చారు. కాని విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రభావం, ముఖ్యంగా సూరపనేని జనార్ధన్ చొరవ వల్ల అది సాధ్యం కాలేదు. వేలాది మంది జనం ఒక వైపు, వందలాది మందితో పోలీసు వలయం మరొక వైపు. అర్ధరాత్రి గడిచినాక కూడా కార్యక్రమం కొనసాగింది - అది ఒక రోమాంచితమైన అనుభవం. మేం మా కళ్లతో ఆ కార్యక్రమాల్ని చూడలేకపోయినా 'నేను, ప్రిన్సిపల్ కోటేశ్వరరావుగారు జన నాట్యమండలి కార్యక్రమం ఆసాంతం విన్నాం' అన్నాడు ఆ తర్వాత ఎప్పుడో. అప్పుడు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కాకి మాధవరావుగారు. ప్రభాకర్ కవిత్వానికీ అటువంటి ప్రభావం ఉంది అనిపించింది ఎం.వి.ఎల్. నుంచి బ్రహ్మానందం దాకా విన్నాక.

'ఎడతెరిపిలేని దగ్గు, అడుగు కదపనివ్వని ఆయాసం

రక్తం ముద్దలుగా పడుతున్న రోజుల్లో కూడా నేను కవిత్వాని నిర్లక్ష్యం చేయలేదు. నాలోని విలువల్ని భగ్నం చేసుకోలేదు. నా ప్రాపంచిక దృక్పథాన్ని వీడి ఏ ప్రలోభాలకీ లోబడలేదు, ఆఖరికి కాలిధూళితో సమానమైన కలర్ సినిమా గ్లామర్‌ను సైతం నా కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడ్డానే తప్ప ఎటువంటి కుళ్లు మార్గాలకూ తలవొగ్గలేదు'

అని రాస్తూ అందుకే 'మనోహరాకాశంలో ఎగిరే కొంగ మొదలుకొని మదరాసులోని కొంగర జగ్గయ్య వరకూ నా కవిత్వాన్ని అమితంగా ప్రేమిస్తారని తెలుసు' అంటాడు. ఎవరో ప్రేమించడానికి ఆయన కవిత్వాన్ని రాయలేదు. ఆయన జీవితాన్ని, పోరాటాన్ని, జీవన్మరణ పోరాటంలో ఇమిడి ఉన్న కవిత్వాన్ని ప్రేమించాడు కాబట్టి, రక్తం ముద్దలు కక్కుతున్న వేళ కూడా రాయకుండా ఉండలేక పోయాడు. బొమ్మలు గీయకుండా ఉండలేకపోయాడు. మూడో కన్ను అయిన కెమెరాతో చూడకుండా ఉండలేకపోయాడు. ఒకసారి ప్రభాకర్ ఫోటోలోని కళ్లలోకి చూడండి. ఆ కళ్లలోంచి మనసు అతని మూడో కన్ను చూస్తూ ఉంటుంది. ఏకకాలంలో పీడకుల పట్ల ఆగ్రహంతో, పీడితుల పట్ల ఆదరంతో. ఆ పెదవులు దాచిన కాగితాల్లో రాయబడని కావ్యాల్లా ఉంటాయి.

ప్రభాకర్ సరిగ్గా ముప్పై తొమ్మిదేళ్లే బతికాడు. పన్నెండు జనవరి 1954న పుట్టి 1993లో మళ్లీ అదే రోజున అమరుడయ్యాడు. ఆయన పుట్టిన ఊళ్లో ఇరవై నాలుగు సంవత్సరాల తర్వాత జగిత్యాల జైత్రయాత్ర పీడిత పోరాట ప్రజల సంరంభమైంది. అపుడా ఊళ్లో సిపిఐ ఎంఎల్ సిఓసి, సిఓగా అంటే సెంట్రల్ ఆర్గనైజర్‌గా ముప్పాళ లక్ష్మణరావు ఉన్నాడు. ఆ ఊరికి దగ్గర్లోనే ఆయన ఊరు బీర్పూరు. జిల్లా నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావుది పెద్దపెల్లి. ఎదిగి వస్తున్న జిల్లా నాయకత్వం సాయిని ప్రభాకర్, పెద నారాయణ సారు అనీ, చిన నారాయణ సారు అనీ పిలుచుకునే ఇద్దరూ ఆ ఉద్యమంలో ఉన్నారు. అలిశెట్టి ప్రభాకర్‌కు క్షయవ్యాధి అని, రక్తం కక్కుకుంటున్నాడని, ఏ మందులూ ఆయన దారిద్ర్యం అనే రోగానికి చికిత్స కాలేక పోతున్నాయని తెలిసినపుడు అంటే 90ల ఆరంభంలో (సంక్షోభ గీతం వెలువడిన కొత్తలో) పీపుల్స్‌వార్ రాష్ట్ర కార్యదర్శి అయిన ముప్పాళ లక్ష్మణరావు 'ప్రభాకర్‌కు ఆరోగ్యం బాగులేదని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలిసింది. నేనెట్లా ఆయనకు సహాయం చేయగలను, నాకు చాయ్ కోసం పార్టీ ఇచ్చే అలెవెన్స్‌ను చాయ్ మానుకొని పంపగలనేమో కాని అది కూడా ఎట్లా ఇవ్వాలి' అని ఆవేదన చెందాడు. అయితే అప్పటికే బెయిల్‌పై విడుదలయి వచ్చి హైదరాబాదులో ఉంటున్న సూర్యంగారు (చింతల వెంకటస్వామి) ప్రభాకర్‌కు ప్రాణమిత్రుడయ్యాడు. ప్రభాకర్ శిష్యుడనదగిన వీరన్న (వీరారెడ్డి) ఆయన ప్రభావంతోనే తర్వాత కాలంలో పూర్తికాలపు విప్లవకారుడై అజ్ఞాతంలోకి వెళ్లాడు. అయినా ప్రత్యక్ష పరిచయం కన్నా ప్రభాకర్ కవిత్వంతో పరిచయం లేని విప్లవకారులెవరైనా ఉంటారా? ఆ రోజుల్లో సిటీ పార్టీ నాయకత్వంలో ఉన్న అందరి కందరూ ప్రభాకర్ అజ్ఞాత అభిమానులు. ఆయన ఆరోగ్యాన్ని కనిపెట్టుకోవడానికి ఒక మనిషినే నియోగించారు. సూర్యంగారు బెయిలుపై హైదరాబాదులో ఉండి, రైతుకూలీ సంఘం మహాసభల పనుల్లో తలమునకలుగా ఉన్నా హైదరాబాదులో ఉన్నప్పుడు ప్రభాకర్‌ను, భాగ్యను, పిల్లలను కలవకుండా ఉండలేకపోయేవాడు. ప్రభాకర్‌ను రైతుకూలీ సంఘం పనుల్లో నిమగ్నం చేస్తే చేతినిండా పని ఉంటుందని సభల ఫొటోలు తీసే పని అప్పగించాడు. సూర్యంగారు ప్రభాకర్‌లో ఒక కళారవిని పోల్చుకున్నాడు.

'నానించి ఏమీ ఆశించనివాళ్లే నాకెంతగానో సహకరించారు' అని ప్రభాకర్ స్వీయ ప్రకటనలో రాసుకున్నది వీళ్ల గురించే. ప్రభాకర్ మొదట చిత్రకారుడు. జగిత్యాలలో సాహిత్యమిత్ర దీప్తి సంస్థ పరిచయం ద్వారా కవిత్వ రంగంలోకి ప్రవేశించాడు. 1974 నుంచి కవిత్వం రాసి 78లో మొదటి కవితా సంకలనం 'ఎర్ర పావురాలు' ప్రచురించాడు. అప్పటికే జీవిక కోసం జగిత్యాలలో 'స్టూడియో పూర్ణిమ' అని ఫొటోగ్రఫీ స్టూడియో పెట్టుకున్నాడు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత, జగిత్యాల జైత్రయాత్ర ప్రభావంతో (నిజానికి అందులో నాయకులు మొదలు కార్యకర్తల వరకు అందరూ ఆయన రెక్కల్లో బొక్కల్లో మసలుకున్నవాళ్లే) విరసంలో చేరాడు. 1979లో మంటల జెండాలు, చురకలు ప్రచురించాడు.

జగిత్యాల, సిరిసిల్లా పోరాటాలతో బెంబేలెత్తిన ప్రభుత్వం 78 అక్టోబరులోనే రెండు తాలూకాలను 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించింది. ఊరూరా పోలీసు క్యాంపులు, ఊళ్లపై దాడులు, ప్రజలపై చిత్రహింసలు, ఎన్‌కౌంటర్ హత్యలు సర్వసాధారణమై పోయినవి. ఆ ప్రజల్లో భాగం, తలలో నాలుక అలిశెట్టి ప్రభాకర్. జగిత్యాలలో బహిరంగంగా భౌతికంగా ఉండలేని స్థితి ఏర్పడింది. 1979లో కరీంనగర్‌కు మారి అక్కడ 'స్టూడియో శిల్పి' అని ఫొటో స్టూడియో పెట్టుకున్నాడు. అక్కడ విరసం యూనిట్లో పని చేస్తుండగానే ఒక రోజు రాత్రి కరీంనగర్‌లో నడిచి పోతుండగా పోలీసులు దాడి చేసి లాఠీలతో బాది నెత్తుర్లు కక్కేలా కొట్టారు. ఒక వైపు కరీంనగర్

పట్టణంలో జగిత్యాలో వలె జీవిక గడవని స్థితి. మరొక వైపు పెరిగిన నిర్బంధం. ఎందుకంటే ఎంత అణచివేత, కల్లోలిత ప్రాంతాల ప్రకటన అయినా జగిత్యాల పోరాటం కరీంనగర్ ఆదిలాబాదు పోరాటాలుగా విస్తరించడమే కాకుండా 1980లో పీపుల్స్‌వార్ పార్టీ ఏర్పడింది. 1981లో ఇంద్రవెల్లి సంఘటన నాటకే అది గోదావరి దాటి దండకారణ్యంలోకి ప్రవేశించింది. సిరిసిల్లా జగిత్యాలల్లో పోశెట్టి, లక్ష్మీరాజంలను భూస్వామ్య వ్యవస్థ హత్య చేసింది. ఇంక ప్రభాకర్ 1983లో హైదరాబాద్‌కు మారక తప్పలేదు. ఇక్కడ 'చిత్రలేఖ' అనే ఫొటో స్టూడియోను 83లో ఏర్పాటు చేసుకున్నాడు గానీ ఈ నగర వ్యాపార సంస్కృతిలో ఆయన ఇమడలేకపోయాడు.

నగరం...
అర్థం కాని రసాయనశాల
అందమైన శ్మశాన వాటిక
నగరం
చిక్కువిడని పద్మవ్యూహం
చెక్కు చెదరని మయసభ
నగరం...
మేడిపండు - వేడి పుండు
కొందరికిది
అక్షయపాత్ర
మరెందరికో
గుండెలపై పయనించే
కాలం రాక్షసయాత్ర
నగరం
రహస్యం బద్దలు కాని
గర్భ విరోధం

ఇక్కడ హృదయానికి 'క్లోరో ఫాం' ఇచ్చి మెదడును మాత్రమే 'లెటస్ గో' అంటుంటారు అంటాడు.

ఎంత చేసినా
ఎక్కడికీ తీరిక దక్కదు, కోరిక చిక్కదు
మెర్క్యురీ నవ్వులు. పాదరసం నడకలు-
కొందరికి రెండు కాళ్లు
రిక్షావాడికి మూడు కాళ్లు
ఉన్నవాళ్లకు నాలుగు కాళ్లు...
ఎవడిది వట్టిదాబో
ఎవడు దొరబాబో అంతు చిక్కదు.

ఇదంతా ఒక కెమెరా కన్నుతో చూసి చిత్రించే దృశ్యీకరణ కావచ్చు కాని, ఆయన మూడో కన్ను పోల్చుకునే ఎక్స్‌రే చిత్రం ఇది.

ఇక్కడ కొన్ని నెమళ్లుంటాయి
వాటితో చెలిమి చేస్తే
కంటిలో కాదు, సూటిగా
గుండెలోనే పొడుస్తాయి
మరెన్నో తోడేళ్లుంటాయి.
ఇవి మనిషినేం చేయవు
కేవలం శ్రమను మాత్రమే
తోడేస్తాయి.

ఈ వ్యవస్థను భౌతికంగా చిత్రహింసలు పెట్టి ఎన్‌కౌంటర్ చేసే గ్రేహౌండ్స్‌తో పోల్చుకున్న ప్రభాకర్ ఆ స్వార్థ ప్రయోజనమున్న రాజకీయార్థిక వ్యవస్థ శ్రమ దోపిడీకి సంకేతంగా తోడేళ్ల గురించి చెప్తాడు.

హైదరాబాదులో ఆయన పదేళ్లు ఉన్నాడు. 'రక్త రేఖలు' (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990) ఇక్కడి నుంచే వెలువరించాడు.

జగిత్యాల, కరీంనగర్‌లలో పోరాట ప్రజల మధ్యన వారి నుంచి ప్రేరణ పొందుతూ, ఉత్తేజాన్ని వారికి ఇస్తూ బొమ్మలు గీసి, ఫొటోలు తీసి, కవిత్వం రాసిన ప్రభాకర్ హైదరాబాద్ వచ్చాక విద్యార్థుల్లోకి యువకుల్లోకి పోవడానికి ఈ మూడు కళారూపాలు కలిసిన కవిత్వ చిత్రాల ప్రదర్శనకు పూనుకున్నాడు.

ఆయా పోరాటాల కాలంలో - అది భారత నావికా తిరుగుబాటు కావచ్చు, బెంగాల్ కరువు కావచ్చు - తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం కావచ్చు - వేలాది చిత్రకళల ద్వారా ప్రచారం చేసిన దేవవ్రత ముఖర్జీ, చిత్తప్రసాద్ వంటి చిత్రకారులు, సునీల్‌జెనా వంటి ఫొటోగ్రాఫర్లు మనకు వచ్చారు. వీళ్ల చిత్రాలను, ఫొటోలను కవులు, రచయితలు, ఉద్యమాలు ఎంతగా తమ సందర్భాలకు వినియోగించుకున్నారో, వినియోగించుకుంటున్నారో మనకు తెలుసు. ముఖ్యంగా చిత్తప్రసాద్‌ను, సునీల్ జెనాను తెలియని వాళ్లు తెలంగాణ పోరాటం గురించి తెలిసిన వాళ్లలో ఉండరు. నక్సల్బరీతరానికి ముఖ్యంగా జగిత్యాల పోరాట తరానికి ప్రభాకర్ ఈ ఇద్దరి సమ్మిశ్రమంగానే కాకుండా కవిగా కూడా - ఇమ్మడి ముమ్మడి ప్రచారం చేసాడు. ఆయన కవిత్వాన్ని ఆయన బొమ్మలు లేకుండా చూసి ఊహించలేం. ఆయన కవిత్వం హృదయంలోకి ఆయన పలికించిన మాటలు మాత్రమే కాదు, రూపుకట్టిన చిత్రాలతో ప్రవేశించి హత్తుకొని పోతుంది. ఆయన కవిత్వంలోని నలుపు తెలుపులతోనూ, రంగులతోనూ కుంచె ప్రవేశిస్తుంది. కంటి చూపుతోనూ, ఎక్సరే కిరణంతోనూ కెమెరా ప్రవేశిస్తుంది. ఈ మూడు డైమన్షన్‌లకు నాలుగవ డైమన్షన్‌గా ఆయన పోరాట జీవితం ఉంది. అది ఆయన ప్రత్యేక వ్యక్తిత్వమని చెప్పడం కాదు.

ఆయన అటువంటి స్థలకాలాల్లో పుట్టి చేనేత కుటుంబం నుంచి వచ్చిన ఒక సృజనకారుని వలె అతిసహజంగా కబీర్‌వలె దోహాలు చెప్పే ప్రచార కళాకారుడయ్యాడు. ఆ ప్రచారంలోని సౌందర్యం ఆయన వంటి కోట్లాది ప్రజల సహస్ర వృత్తుల శ్రమైక జీవనం నుంచి వచ్చింది. ఆయన ప్రపంచాన్ని బతికినంత కాలం తల్లి గర్భం నుంచి చూసినట్లుగా చూసాడు. స్త్రీ హృదయం నుంచి చూసాడు. ఆయనంతగా మహిళానుభవాన్ని ఒక స్వానుభవంగా పలికిన కవులు చాలా అరుదుగా కనిపిస్తారు.

అడుగంతా తడిసిన కన్నీటి సముద్రం
ఉపరి తలమంతా
వెలిసిన నెత్తుటి ఆకాశం
మధ్యన వెలిగే

మహోజ్వల మానవ నేత్రమే
పోరాట సూత్రం

ప్రభాకర్‌ది పోరాట సూత్రం అంతస్సూత్రంగా ఉన్న మానవ నేత్రం. అది ఆయనకు జగిత్యాల ఇచ్చింది. కరీంనగర్ ఇచ్చింది. హైదరాబాదులో సంక్షోభ జీవితాన్ని గడిపిన ఎనభయ్యవ దశాబ్దం ఇచ్చింది. ఈ దశాబ్దం మొదటి ఐదేళ్లు ఎటువంటి ఉజ్వల కాలమో - తర్వాతి ఐదేళ్లు అటువంటి వల్లకాడు కాలం. టాడా కాలం, 'మిస్సింగులు' కాలం, ఎన్‌కౌంటర్‌ల కాలం, ఆటా మాటా పాట బందయిన కాలం.

నిజానికి పాట బందయిన కాలంలో ఆ లోటు పూడ్చిన కవిత్వం ఆయన ఎక్కువ రాసాడు. చెరబండరాజు 1982లో అమరుడైన దగ్గర్నించీ ఒక దశాబ్దం పాటు ఆయన లేని లోటును పూడ్చిన కవి ఆయన. శ్రీశ్రీ కన్నా, కాళోజీ కన్నా మాత్రాఛందస్సు అక్కర్లేకుండా చెరబండరాజు వలె వచన కవితా పంక్తులే పాటల వలె పెదవులపై నడయాడే పలుకుబడులుగా రాసిన వాడాయన

జూలియస్ ఫ్యూజిక్‌కు చెరబండరాజుకు నీకు
నాజీ వ్యవస్థ అయితే నేమి
క్యాన్సర్ వ్యవస్థ అయితేనేమి
క్షయగ్రస్త వ్యవస్థ అయితేనేమి
అది మరణ శాసనం రాసిన మరుక్షణం నుంచే
మీరు ఒక్క స్వప్నాన్నీ నిదుర పోనివ్వలేదు
ఒక్క క్షణాన్నీ వృథా కానివ్వలేదు
నిండు జీవితమైనా చాలని సార్ధకమైన పేరు నీది
ప్రతి విశ్వాసాన్నీ శత్రువుపై
కుంచెగా, కలంగా, లెన్స్ చూపుగా
ఎక్కుపెట్టిన గురి దానిది
(మృత్యువు దాడి చేసిన రాత్రి అక్షరాలకు జీవం పోస్తున్నాడు)

ప్రభాకర్‌ది స్పష్టమైన వర్గపోరాట దృష్టి - అది ఆయన ప్రతి కవితలో వ్యక్తమవుతుంది. పీడిత పోరాట ప్రజా పక్షపాతం వల్ల అది వైశాల్యాన్ని, నైశిత్యాన్ని పొందుతుంది. స్వయంగా తాను నిప్పుల కొలిమిలో కాలినందువల్ల దానికి వన్నెగా చెప్పుకునే కళా స్వభావం వస్తుంది. మనకింత వెలుగునిచ్చి వేడినిచ్చే సూర్యగోళం తానుగా ఎంత కాలుతూ ఉంటే అది సాధ్యమవుతుంది.

చరిత్రకు రక్తపాతమే ఉపోద్ఘాతం
చరిత్రకు చెమట బొట్టే ఆధారం
చరిత్రకు ఆకలే ప్రేరేపణ

ఈ సత్యాన్ని కవి, కళాకారుడు చెప్పక తప్పదని కర్తవ్యాన్ని గుర్తించిన వాడు ప్రభాకర్.

నిజం చెప్పటానికి తడిలేని నాలుకలు
మూసిన నోళ్ల చీకటి గుహల్లోనే పడుండి
గొంతెండి చావనీ
చేతులుండీ అటూ ఇటూ పీనుగుల్లా వేల్లాడితే
వాట్ని సొంతం నరికేయటమే ధర్మం

ఇంత ఆగ్రహాన్ని ప్రదర్శించే 'మంటల జెండాలు' ఆయన కవిత్వం.

చెరబండ రాజు లేని లోటు తీర్చాడన్నాను కదా. అప్పటి దాకా చురకత్తుల వంటి చురకలు రాసినవాడు వస్తు దృష్టితో విశాల క్యాన్వాసు ఉన్న దీర్ఘకవితలు కూడా రాసాడు. 'రక్తరేఖలు' లో డాక్యుమెంటరీ అనే సుదీర్ఘ కవిత 1985 తర్వాత దేశ చిత్రపటాన్ని మనముందు ఉంచుతుంది. 84-85 చాలా విషయాలకు విభజన రేఖ. ఒకవైపు ఇరవయ్యొకటవ దశాబ్దంలోకి తీసుకవెళ్లే హామీలు. ఆత్మగౌరవ నినాదాలు. మరొక వైపు మత విద్వేషాలతో జాతి హననాలు. కారంచేడుల కుల దురహంకార హత్యలు. 'గడ్డకట్టిన కారంచేడు నెత్తుటి మడుగులో అగ్రవర్ణాల అహంకారపు గొడ్డళ్లు మునిగి'నవైనం, (కారంచేడు, చుండూరు మారణకాండపై స్పందించిన ప్రభాకర్ కారంచేడుతోనే తెలుగు సాహిత్యంలో స్థిరపడిన దళిత శబ్దానికి బదులు హరిజనులు అనే మాట వాడటం ఆశ్చర్యం), 'కల్లోలిత ప్రాంతం గడియారంలో అనుక్షణం భీతావహంగా కదిలే 'లాఠీ' 'బాయనెట్ ముళ్లు', 'భీవాండీ ఠానేశకరాలపై మతం రోమాలు నిక్కబొడుచుకుని విషపు కత్తులైన తీరు 'రోజుల తరబడి చార్మినార్ మెడలో కర్ఫ్యూ కపాలం వేల్లాడి' కలిగించే గగ్గుర్పాటు, 'స్వర్ణ దేవాలయంలో రక్తపాతమే పరాకాష్ఠ' ఏదీ ఆయన దృష్టినించి తప్పించుకోలేదు. 'కోటానుకోట్లు వెలగ పండులా మింగి ఏసియాడ్ ఏనుగు తోక ముడుచుక వెళ్లిపోతుంది. పుట్టే ప్రతి శిశువు వీపు మీదా ఐఎంఎఫ్ ముద్ర వెయ్యమని శాసించటం జరుగుతుంది' అని 1985 నాటికి రాసిన అలిశెట్టి ప్రభాకర్ ఎంత సమకాలీన రాజకీయ నాడిని పట్టుకున్నాడో ఈ కవిత అంతా చదివి చూడాల్సిందే.

'లక్షలాది పీడితుల పిడికిళ్లే' ప్రభాకర్ అక్షరాలు. 'ఆయన గత గర్భంలోని తుపాను శిశువు'. 'కాలగమనంలోని నెత్తుటి శిశువు'. 'హరిత హరితంగా నల్లరేగడి నేలమీద సృజయించిన నాగళ్ల లిపి' 'కర్మాగారాల కొలిమిలో కణకణామండుతున్న కండరాల ఎరుపు', 'పిడికెడు మట్టిని మైదానం చేయగలిగినవాడు'. 'అనంతాకాశ క్షేత్రంలో అక్షరాన్ని సూర్యబింబంగా నిలపగలిగిన వాడు'. 'చిందించిన నెత్తుటితో చీకటి కోణాలన్నీ వెలిగించిన యోధుడు'. గుండె గుండెకీ మధ్య విప్లవ వారధుల్ని నిర్మించినవాడు'.

అలిశెట్టి ప్రభాకర్‌ది ఎంత స్పష్టమైన విప్లవ రాజకీయ దృక్పథమంటే ఆయన కవిత్వం నిండా - భూస్వామ్య పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద దళారీ వ్యతిరేకత, భూమి పుత్రులయిన రైతాంగం, కార్మికుల పట్ల మమేకత్వం - పార్లమెంటరీ రాజకీయాల పట్ల నిరసన, సాయుధ పోరాట పంథా సమర్థన - అప్పుడప్పుడే నగ్నంగా బయటపడుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పట్ల తీవ్ర వ్యతిరేకత - శక్తివంతమైన వ్యక్తీకరణల్లో పరచుకొని ఉంటాయి. మచ్చుకు - పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనబడే బూర్జువా నియంతృత్వం గురించి;

అప్రజాస్వామిక మొండానికి
బ్యాలెట్ పెట్టె తలకాయైతే
దేశమా నువ్వే
నా కృత్రిమ శ్వాస కోశమా...

1991 ఆగస్టు 15న రాసిన కవిత

ఈ దేశానికి
స్వాతంత్ర్యమొచ్చింది నైన్‌టీన్ ఫార్టీ సెవెన్
నలభై నాలుగేళ్ల ఆకలి, నిరుద్యోగం కలిసి
మనకిచ్చిందొక ఎ.కె.ఫార్టీ సెవెన్!

అమెరికా సి.ఐ.ఎ. అధినేతగా ఉన్న జార్జ్‌బుష్ ప్రపంచంలోకెల్లా ప్రత్యక్ష ప్రజాస్వామ్యంగా భావించబడే అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికై ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలను ప్రకటించినపుడు అమెరికా సామ్రాజ్యవాద ప్రపంచీకరణలోని దాష్టీకాన్ని గుర్తించినవాళ్లు చాలామంది ఉండవచ్చు. అట్లే 1956లో సోవియెట్ రష్యాలో కృశ్చేవ్ ప్రతిపాదించిన సామరస్య సిద్ధాంతాన్ని పోల్చుకున్నవాళ్లూ చాలామంది ఉండవచ్చు. కాని ఒక జార్జ్‌బుష్ ఏక ధృవ సామ్రాజ్యాధినేతగా మొనతేలడానికి గోర్బచెవ్ వంటి సోవియెట్ అధినేత ప్రతిపాదించిన గ్లాస్‌నోస్త్, పెరిస్త్రోయికాల బూటకపు ప్రజాస్వామ్యం గుట్టును కనిపెట్టగలిగిన వాళ్లు అలిశెట్టి వంటి అరుదయిన విప్లవ దృక్పథం కలవాళ్లు మాత్రమే.

పెరిస్త్రోయికా శాస్త్రజ్ఞుడు గోర్బచేవ్ సారు
గ్లాస్‌నోస్త్ దోస్తులైన జార్జిబుష్‌గారు
పెట్టుబడికి బొట్టుబెట్టి హారతివ్వలేరా?

అని ఒక చోట ఇకగోర్బ 'చెవ్ వినదంట యుద్ధాల హోరు అమెరి'కన్ను' తెరవట అణ్వస్త్రాల జోరు మూడో ప్రపంచ దేశమా ముక్కున వేలేసుకో వంటి కవితా పాదాలతో రివిజనిజం సామ్రాజ్యవాదం బొమ్మ- బొరుసులేననే గతి తర్కాన్ని కవిత్వీకరించిన ప్రతిభాశాలి ప్రభాకర్.

పీడితుల గురించి నిరంతరం తపించడమంటే దోపిడి పీడనల నాలుగవకాడిని మోస్తున్న స్త్రీ గురించిన స్పందనగానీ గీటురాయి కాజాలదు. ప్రపంచ సాహిత్యంలో నిలిచిపోయిన రచయితలందరూ స్త్రీ హృదయం కలవాళ్లే. అసలు స్త్రీ హృదయం లేకుండా ఒక మనిషి కవీ, కళాకారుడు కాజాలాడు. కవులు, కళాకారులనేకాదు బుద్ధుడు, జీసస్ క్రైస్త్, మార్క్స్ వంటి తత్త్వవేత్తలు కూడా బాధా సర్పద్రష్టలైన, భ్రష్టలైన, దగాపడిన మహిళల గురించి తపించిన వాళ్లే. అలిశెట్టి ప్రభాకర్ వేశ్యపై రాసిన కవిత అయితే ఒక శిలాక్షరంగా నిలిచిపోయింది. కనుక ప్రస్తావించనక్కర్లేదు.

'ఆమె యవ్వనం రాయని వీలునామా', ఆమె 'రాతి హృదయంలో ఇమడని అశ్రు పుష్పం'.

పెదవుల పాషాణంపై విరిసే సిఫిలిస్ పువ్వు
పత్ర హరితమే హరించిన బతుకు చెట్టు
కాలుష్యంలో అంతర్లీనమైన ప్రాణవాయువు
నెత్తుటి గాయాల సంపుటి రగిలే బాధల కుంపటి

వంటి ప్రయోగాలు ఆయన గుండెల్ని తొలిచిన బాధల ఉలి నుంచి మలచబడిన కవితా శిల్పాలు. ఇంక ఆయన సహచరి భాగ్య గురించి ఎంత జెండర్ సెన్సిటివ్‌నెస్‌తో, సెన్సిబులిటీస్‌తో రాస్తాడో చూస్తే ఆయన హృదయంలో ఆమె పట్ల ఎంతో ప్రేమ మాత్రమే కాదు, స్నేహమూ, గౌరవమూ ఉంటే తప్ప సాధ్యం కాదు.

ఇద్దరం ఉత్త పిచ్చివాళ్లం...
ఇద్దరం కలిసి ఒక కలగా
కలగాపులగంగా కలిసిపోయిన రోజుల్లో
ఇంచుమించు ఒకే కంచంలో
ఇంద్రధనుస్సుల్ని తుంచుకొని తిన్న రోజుల్లో
మా గుండెల్లో సమస్యలు మండని రోజుల్లో
సిగరెటు పీకలాంటి నన్ను
సిగలో పువ్వులా తురుముకొని
గాజు కుప్పెల్లాంటి నా కళ్లలోనే
ఆశల అగరొత్తులు వెలిగించుకుందే తప్ప...

అని ఆమె అనాయక నిసర్గ స్వభావాన్ని చిత్రించి ఈ కవితకు చిత్రంగా భాగ్యలక్ష్మి - అని పేరుపెట్టాడు. ఇది ఆమె పేరు నిజమే కాని ఆమె భాగ్యగానే అందరికీ తెలుసు తప్ప ఆ ఇంట్లో లక్ష్మి ఉన్నదెన్నడు?

ఆయన జీవిక కోసం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రోజుకో చిత్ర కవిత రాసేవాడు ఆయనదే బొమ్మ. ఆయనదే కవిత. వాటిల్లో 418 కవితలను 'సిటీలైఫ్' పేరుతో సంకలనంగా 1992లో తెచ్చాడు.

జగిత్యాలలో ప్రారంభమైన ఆయన కవితా ప్రస్థానం పద్దెనిమిదేళ్లయినా జగిత్యాలనే పలవరిస్తూ ఉన్నది.

తమ్ముడూ తమ్ముడూ
నువ్వొచ్చేటప్పుడు తప్పక
పిడికెడు
కల్లోలిత ప్రాంతాల మట్టినైనా
తీసుకరా...
పోరుదారిలో నేలకొరిగిన
ఒక అమర వీరుని జ్ఞాపకమైనా
మోసుకురా...
మళ్లీ మళ్లీ నాకు
జగిత్యాల గుర్తొస్తుంది
జైత్రయాత్ర నన్ను
కలవరపెడుతోంది...

ఆరంభంలో చెప్పినట్లు అలిశెట్టి ప్రభాకర్ పరిచయాన్ని ఆయన ద్వారా తప్ప చెప్పగల శక్తి ఏ సాహిత్య విశ్లేషణకూ సాధ్యం కాదు. 1993 జనవరిలో ఆయన అమరుడయ్యాక 44లో విరసం ప్రచురించిన 'మరణం నా చివరి చరణం కాదు' అని ఆయన రాసుకున్న స్వీయావిష్కరణ ఇది:

నిర్విరామంగా నిత్యనూతనంగా
కాలం అంచున చిగురించే నెత్తుటి ఊహను నేను.
కలల ఉపరితలమ్మీద కనబడే కాంతిపుంజం నేను
కన్నీళ్లకు కర్తవ్యాన్ని నిర్దేశించే దిక్సూచిని నేను
అగ్నిపద్యం నేను - దగ్ధగీతం నేను అక్షర క్షిపణి నేను
ఆయుధాలుగా రూపాంతరం చెందే ఆకలి నేపథ్యం నేను
అడవి నేను - కదలి నేను
ఉప్పొంగే మానవ సమూహాల సంఘర్షణ నేను
అజ్ఞాతంగా అంతర్లీనంగా
మట్టిపొరల్లోంచి పరివ్యాప్తమవుతున్న
పోరాట పరిమళం నేను

పుస్తక సమీక్ష

గాంధీ నెహ్రూల సెక్యులర్ ముసుగు తీసేసిన 'ఇండియాలో దాగిన హిందుస్థాన్'

- వి. రాజశేఖర్

దేశం, గాంధీ, నెహ్రూలపై మూఢ భక్తి పెంచుకున్న వారికీ, గాంధీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడు, నెహ్రూ దేశాన్ని గొప్పగా పాలించి, అభివృద్ధి చేశాడు అనుకునేవారికీ భ్రమలను పటాపంచలు చేసే పుస్తకమిది. ముఖ్యంగా జీతీయోద్యమంలోనూ, గాంధీ నెహ్రూ వంటి నాయకులలోనూ మత ఛాందసత్వం ఎంతగా వేళ్ళూనుకుని ఉండిందో విప్పి చెప్తుందిది. పైకి లౌకికవాదిలా కనిపించే నెహ్రూ అంతరంగం ఎన్ని సందర్భాలలో బట్టబయలయిందో కూడా ఉటంకిస్తూ మతతత్వం బిజేపి లాంటి పార్టీలకు సంబంధించిందే కాదని అది 'ఇండియా' మూలాల్లోనే ఉందని చెప్తుంది. గత 66 సంవత్సరాలుగా దేశాన్ని అభివృద్ధి చేశారనే భ్రమలో ఉన్నవారికి కనువిప్పు కలిగించే అంశాలిందులో ఉన్నాయి. స్వాతంత్ర్యానికి ముందు గాంధీ, నెహ్రూలు నాటిన విష బీజాలు ఈ రోజు మహా వృక్షాలై దేశాన్ని ఎలా పట్టి పీడిస్తున్నాయో వివరిస్తుంది.

బ్రిటిష్ వారికంటే ఘోరంగా భారతదేశాన్ని పాలించి నాశనం చేసిన నెహ్రూ కుటుంబాన్ని(కాంగ్రెస్‌ను) రచయిత ఎలాంటి మొహమాటం లేకుండా ఎండగట్టారు. కశ్మీర్ విషయంలో గానీ, ఈశాన్య రాష్ట్రాల విషయంలో గానీ ఈ రోజు వరకు దేశ పాలకులు ఎంత దుర్మార్గంగా ప్రవర్తించారో సోదాహరణంగా కళ్లకు కడతారు. అసలు దేశ విభజనకు మూలకారణాలను ఎంతో సమర్థవంతంగా వెలికి తీస్తారు.

ఇండియన్ ఐడియాలజీ పేరుతో 2012 లో పెరి ఆండర్‌సన్ రాసిన 3 వ్యాసాల పుస్తకాన్ని హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారు 'ఇండియాలో దాగిన హిందుస్థాన్' పేరుతో ప్రచురించారు. ప్రభాకర్ మందార దీన్ని ఎంతో సరళంగా తెలుగులోకి అనువదించారు.

ఈ మూడు వ్యాసాలు మూడు దశల్ని చిత్రీకరిస్తాయి. మొదట స్వాతంత్ర్యం రాక మునుపు పరిస్థితులు, అప్పటి గాంధీ, నెహ్రూ, కాంగ్రెస్ పార్టీలపై విశ్లేషణ. రెండవది దేశ విభజనకు మూలకారణాలేంటి. అందులో గాంధీ, నెహ్రూల పాత్ర ఏమిటో సమర్థవంతంగా చిత్రీకరిస్తుంది. ఇక మూడోది గణతంత్రం. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ, ఆయన వారసులు కాంగ్రెస్ పార్టీగా దేశాన్ని ఎలా భ్రష్టు పట్టించారో వివరించారు. పై విషయాలలో పెరి ఆండర్‌సన్ ఎంతో పరిశోధన చేశారనిపిస్తుంది. తాను చెప్పిన విషయాలకు మూలాలను, ఆరోపించిన వారి రచనల్లోనూ, వారి అనుయాయులు లేదా సమకాలికుల రచనల్లోనూ, పరిశోధకుల రచనల్లోనూ చూపిస్తారు.

భారతదేశం ఎప్పటినుంచో అఖండభారతంగా ఉందన్న వాదనలో ఎంత మాత్రం నిజం లేదన్న విశ్లేషణతో మొదటి వ్యాసం మొదలవుతుంది. గాంధీ స్వతంత్రోద్యమంలోకి ఎలా వచ్చారు. కాంగ్రెస్ పార్టీని ఎలా పునర్నిర్మించారో వివరిస్తారు. సమాజం పట్ల ఆయన అభిప్రాయాలను కూడా తెలియజేస్తారు. గాంధీ దృష్టిలో మతం రాజకీయాలకంటే ఉన్నతమైనది. రైతులకు అక్షరజ్ఞానం అవసరంలేదు. అది కేవలం వారిలో తమకున్న దానిపట్ల అసంతృప్తి పెంచుతుంది. బ్రహ్మచర్యం, రైల్వేలు, యంత్రాల పట్ల గాంధీ అభిప్రాయాలను ఆయన మాటల్లోనే తెలియజేస్తారు. 'మతపరంగా భారతదేశం ప్రపంచానికి మార్గదర్శి'.

గాంధీ కాంగ్రెస్ లో హిందూ మత భావాలు చొప్పించడం వల్లే ముస్లింలు పార్టీకి దూరమయ్యారని చెబుతారు. లౌకికవాదం మాటల్లోనే తప్ప చేతల్లో లేదంటారు. అహింస అంటూ గాంధీ చేసే ప్రభోధం ఆయన ఆచరణలోనే కనిపించదు. 'సామ్రాజ్యవాద నరమేధంలో పావులుగావడానికి యువత సైన్యంలో చేరాలని గాంధీ పాదయాత్ర చేశారు'. పలు సందర్భాలలో గాంధీ హింసను ఎలా సమర్థించారో ఉటంకిస్తారు. గాంధీ, తానే ఒక సందర్భంలో చెప్పిన దానికి వ్యతిరేకంగా మరో సందర్భంలో మాట్లాడడాన్ని, ప్రవర్తించడాన్ని గుర్తించారు. గాంధీ దృష్టిలో బ్రిటిష్ పాలనకంటే విప్లవమే ఎక్కువ ప్రమాదకరం.మరో మాటలో చెప్పాలంటే బ్రిటిష్ పాలన కొనసాగడమే గాంధీకి ఇష్టం. అందుకు ఆయన అనేకసార్లు సహకరించారు.

....

పరాధీనమౌతున్న స్వేదంలోంచి ఆవిర్భవించిన
మంటల జెండాల జ్వాల నేను మందు పాతరను నేను.

ఆయన మరణ వార్తని విని దండకారణ్య రచయితలు ఇలా రాసారు: 'జగిత్యాల జైత్రయాత్ర (1978) మొదలు చివరి శ్వాస వరకు ప్రభాకర్ పీడిత ప్రజల పక్షాన నిలిచాడు. ప్రజాయుద్ధ రాజకీయాలను బలపరచాడు. సీదాసాదాగా జీవించి తన కలంతో దోపిడీ సమాజంపై తిరుగుబాటు ప్రకటించి చివరి వరకు పోరాడినాడు. ఈ పోరాటంలో ఎందరినో తన విప్లవ నిబద్ధతతో ఉత్సాహపరిచాడు. జగిత్యాల - కరీంనగర్ - హైదరాబాద్ - ఇలా తన మకాం ఎక్కడికి మారినా ఉద్యమంతో సజీవ సంబంధాలు నిలుపుకున్నాడు. ఉద్యమంపై నిర్బంధం పెరిగిన ప్రతి సందర్భంలో ప్రతి మలుపులో తనపై వచ్చే నిర్బంధానికి వెరవక విప్లవ పక్షమే నిలిచి తన కలాన్ని మరింత పదునెక్కించిన సాంస్కృతిక సైనికుడాయన. అందుకే కామ్రేడ్ ప్రభాకర్ అమరుడు. ఆయన నిజాయితీకి విప్లవాభిమానులంతా జోహార్లు అర్పించాలని కోరుకుంటున్నాం.'

సహాయనిరాకరణోద్యమాన్ని అర్థాంతరంగా ఆపడం దానికో మంచి ఉదాహరణ. స్వరాజ్-బ్రిటిష్ అధికారం కింద ఒక సామంత రాజ్యంగా కొనసాగాలన్నదే గాంధీ ప్రతిపాదన.

గాంధీ దళితులకోసం ఎంతో చేశారని ఇప్పటివరకూ ఉన్న ప్రచార బండారాన్ని బయట పెట్టే వాక్యమిది. ఆయన 'అంటరాని వాళ్లకు ప్రత్యేక నియోజక వర్గాలు ఉండరాదంటూ' నిరాహారదీక్ష చేస్తానని ప్రకటించారు. గాంధీ ఎలా పెట్టుబడిదారుల తొత్తుగా వ్యవహరించారో, సుభాష్ చంద్రబోస్‌ను పార్టీని వీడేలా ఎలా కుట్ర చేశారో చదివితే తెలుస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటాలు చేసిన నాయకుల్లో అత్యధికులు అతి కొద్దికాలంలోనే తమ ప్రతిష్టను కోల్పోయారు. వారి జాబితాలోనే ఉండవలసిన గాంధీ, హత్యకు గురవడంతో మనకు జాతిపిత అయి కూర్చున్నాడు. ఆ హత్యే అతని బండారం బట్టబయలు కాకుండా కాపాడిందని చెబుతారు.

ఇక రెండో భాగంలో దేశ విభజనకు మూలకారణాలేంటో సోదాహరణంగా వివరిస్తారు. దేశ విభజన విషయంలో జనాభిప్రాయాన్ని ఎలా తప్పు దోవ పట్టించారో తెలియజేశారు. ఇందులో మరోసారి గాంధీ, నెహ్రూల వ్యక్తిత్వాలు చర్చకు వస్తాయి. ముస్లింల పట్ల బ్రిటిష్ వైఖరి ఎలా మారింది. గాంధీ, నెహ్రూల ప్రవర్తన వల్ల ముస్లింలు కాంగ్రెస్‌కు, స్వాతంత్రోద్యమానికీ ఎలా దూరమయ్యారో వివరిస్తారు. 'చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా అతి కొద్ది మంది కలిసి, అసంఖ్యాకులను, అవసరం లేకపోయినా విభజించారు' అన్న ఒక పరిశీలకుడు రాసిన విషయాన్ని మన దృష్టికి తెస్తారు. దేశ విభజన సమయంలో జరిగిన మారణకాండలో కనీసం 10 లక్షల మంది చనిపోయారంటే అది ఎంత దుర్మార్గంగా జరిగిందో ఊహించొచ్చు. ప్రపంచ చరిత్రలో ఏ మాత్రం అవసరం లేకుండా జరిగిన అతి పెద్ద మారణ హోమమిది. దేశ విభజన విషయంలో తనకొచ్చే తక్షణ లాభం గురించిన కాంగ్రెస్ ఆశే, అప్పుడు జరిగిన మారణ హోమానికి ప్రధాన కారణం. అప్పట్లో విభజన విషయంలోగానీ, కశ్మీర్ విషయంలో గానీ హేతుబద్ధంగా ఆలోచించిందీ, మాట్లాడిందీ అంబేద్కర్ ఒక్కరే. 1931 లో గాంధీ అన్న మాటలు గుర్తు చేసుకుంటే విభజనకు మూల కారణమెవరో స్పష్టమౌతుంది. 'మేం విడి పోతాం. మీరు పరిపాలించండి'. ఇది రౌండ్ టేబుల్ సమావేశంలో గాంధీ ప్రతిపాదన. ఆయన మరో సూత్రీకరణ 'మన ఈ ఆకర్షణీయమైన బానిసత్వం కంటే, హిందూ ముస్లింలు పరస్పరం కొట్టుకుని చావడాన్ని చూడటానికే నేను ఎక్కువ ఇష్ట పడతాను'.

ఇక కశ్మీర్ విషయంలో గానీ, ఈశాన్య రాష్ట్రాల విషయాలలో కూడా గాంధీ, నెహ్రూ లు ఎంతో దుర్మార్గంగా ప్రవర్తించారు. వారు చెప్పిన మాటలకు చేతలకు సంబంధమే లేదు. మధ్య ఆసియా మార్గాలను నియంత్రించగల వ్యూహాత్మక రక్షణ ప్రదేశంగా కశ్మీర్ అవసరమని కాంగ్రెస్ భావించింది. అలాగే నెహ్రూ వ్యక్తిగత ఇష్టాలు కూడా కశ్మీర్‌ను భారత్ లో బలవంతపు విలీనానికి దోహదం చేశాయి. ఇందుకు గాంధీ మద్దతు కూడా తోడయింది. అప్పుడు రగిలిన ఆ నిప్పు 40 లక్షల పైగా కశ్మీరీ ప్రజల రక్త తర్పణతో, వేల కోట్ల రూపాయల రక్షణ వ్యయంతో ఇంకా మండుతూనే ఉంది. ఇండియాతో భౌగోళికంగా ఎంత మాత్రమూ కలిసి లేని ఈశాన్య రాష్ట్రాలను-అస్సాం, త్రిపుర, మణిపూర్ మొదలైన వాటిని-కూడా బలవంతంగా మన దేశంలో కొనసాగించు కుంటున్నాం.

మూడో భాగంలో చర్చించిన విషయాలలో పలు ఆసక్తికర అంశాలున్నాయి. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీ ఉచ్ఛ స్థాయిలో ఉన్నది అనుకుంటున్న 1951-71 మధ్య కాలంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడూ దేశంలోని మెజారిటీ ఓటర్ల మద్దతును గెలుచుకోలేదు. కేవలం 45 శాతం ఓట్లతో 70 శాతం సీట్లు గెలుచుకుని పరిపాలన కొనసాగించింది. హిందూ సామాజిక వ్యవస్థ దాదాపు 5000 కులాలుగా చీలికలు, పేలికలుగా ఉండటం కాంగ్రెస్‌కు లాభిస్తోంది. అది కుల వ్యవస్థను ప్రోత్సహించకుండా ఎలా ఉంటుంది అని ప్రశ్నిస్తారు. అలాగే కేంద్రానికి గల రాష్ట్ర ప్రభుత్వాలను నియంత్రించే, రద్దు చేసే సంపూర్ణాధికారాలను ఉపయోగించి నెట్టుకొస్తోంది. 1987 నాటికే ఈ రద్దు అధికారాన్ని 75 సార్లు ఉపయోగించారంటే కేంద్రం ఎంత దుర్మార్గంగా ఉందో గమనించవచ్చు. అలాగే వలస వాదులను మించిన అనేక క్రూర చట్టాలతో కాంగ్రెస్ అధికారాన్ని నెట్టుకొస్తోంది.

ఇక కశ్మీర్ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతానని ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ నెరవేరలేదన్న విషయం గుర్తుచేస్తారు. నేటి వరకు అక్కడ ప్రజాస్వామ్యం కనుచూపు మేరలో ఎక్కడా లేదు. తుపాకుల నీడలో పరిపాలన కొనసాగుతోంది.

ఈశాన్య రాష్ట్రాలలో 1958 లో ప్రవేశ పెట్టిన సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం ఎంతో దుర్మార్గమైనది. అయిదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమికూడివుంటే వారిని అనుమానితులుగా భావించి కాల్చేసే అధికారం ఈ చట్టంతో సైనికులకు లభించింది. కాల్పులపై ఎలాంటి న్యాయ విచారణ ఉండదు. ఇలాంటి చట్టాలతో నాగాలాండ్‌లో ఢిల్లీ సాగించిన దుర్మార్గాలు కశ్మీర్ మారణకాండను మించిపోయాయి. ఈశాన్య రాష్ట్రాలలో బయటి వ్యక్తులు అడుగు పెట్టాలంటే ప్రత్యేక అనుమతి తీసుకోవాలి. అది కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితం.

ఒక రాజ్యం లేదా రాజకీయ పార్టీ మతపర మూఢ విశ్వాసాలకు, మతోన్మాదానికి లొంగిపోకుండా ఉండడమే కాకుండా, వాటిని గట్టిగా ప్రతిఘటించకపోతే అవి నిజమైన లౌకికి వాదానికి కట్టుబడి ఉండలేవు. కాంగ్రెస్ పార్టీగానీ, భారత రాజ్యంగానీ ఎప్పుడూ అలాంటి ప్రయత్నం చేయలేదు. అవి హిందూ కులతత్వ సమాజంపై ఆధారపడ్డాయి. భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కులమే నిలబెడుతోంది. ఎన్నికల్లో ఈనాడు కులం పోషిస్తున్న పాత్ర కీలకమైనది. ఎన్నికల ప్రజాస్వామ్యం, కులం పరస్పరం బలోపేతం చేసుకుంటున్నాయి. కులం, మతం ఆధారంగా నడిచే రాజకీయాలు క్రమంగా బిజెపి వంటి ఛాందసవాద పార్టీ బలపడడానికి దోహదం చేస్తాయి. ఆచరణ రీత్యా చూస్తే కాంగ్రెస్, బీజేపీల మధ్యా తేడా అతి స్వల్పమే. సెక్యులర్ ముసుగు తొడుక్కున్న కాంగ్రెస్‌కన్నా మత ఛాందస బిజేపీ స్పష్టంగా వ్యక్తమవుతుంది. ఎప్పటికైనా సమాజం పురోగమించాలంటే మతంతో ఘర్షణ పడాల్సిందే. ఇప్పుడున్న దశ ఆ ఘర్షణను అనివార్యం చేస్తుంది. ☆

పుస్తక సమీక్ష



'పల్లెను మింగిన పెట్టుబడి'పై సమీక్ష

- ఎన్. రవి

గత కొద్ది కాలంగా భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల గురించిన ఆసక్తిదాయకమైన చర్చ జరుగుతోంది. 90వ దశకం నుండి పెరిగిన ఉదారీకరణ, ప్రపంచీకరణల నేపథ్యంలో, భారత వ్యవసాయంలో పెనుమార్పులు కలిగినట్లు అనిపిస్తూ ఉండటం, అగ్రి బిజినెస్ గురించిన చర్చలు జరగటం వంటివి ఉత్పత్తి సంబంధాల గురించిన చర్చకు ఒక కారణం కాగా, వ్యవసాయక విప్లవమే ఇరుసుగా కలిగి నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం ఆంధ్రప్రదేశ్, బీహార్‌లోని మైదాన ప్రాంతాలలో సెట్‌బ్యాక్‌కు గురై విప్లవోద్యమం ప్రధానంగా అటవీ ప్రాంతానికి తాత్కాలికంగా పరిమితం కావటంతో కూడా ఈ చర్చ మళ్ళీ ఒకసారి తలెత్తటానికి అవకాశం ఇచ్చింది. మొదటిసారి ఈ ఉత్పత్తి సంబంధాల చర్చ పెద్ద ఎత్తున నక్సల్బరీ ఉద్యమం తలెత్తి సెట్‌బ్యాక్‌కు గురైన నేపథ్యంలో జరిగిందనేది యాదృచ్ఛికం కాదు. ఏదేమైనా ఇట్లాంటి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎస్. ఎ. విద్యాసాగర్ గారి పుస్తకం 'పల్లెను మింగిన పెట్టుబడి' కూడా చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పుస్తక రచన కోసం రచయిత ప్రభుత్వ గణాంకాలు, తదితర సెకండరీ వనరులపైనే కాకుండా శ్రీకాకుళం జిల్లాలోని 115 కు పైగా గ్రామాల నిర్దిష్ట, ప్రత్యక్ష పరిశీలనపై ఆధారపడ్డారు. ప్రత్యక్షంగా సర్వే చేసి ఆ వివరాలతో ఈ పుస్తకం వెలువరించినందుకు దీనికి మరింత ప్రామాణికత చేకూరింది.

ఈ పుస్తకంలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో స్థూలంగా గ్రామీణ ఆర్థిక పరిశోధన, వ్యవసాయం ఎదుర్కొంటున్న సంక్షోభం, ఉత్పత్తి సంబంధాల్లో వస్తున్న మార్పులకు సంబంధించిన పన్నెండు అధ్యాయాలుండగా రెండో భాగంలో ఆదివాసులు, దళితులు, మత్స్యకారులు, చేనేత కార్మికుల గురించిన నాలుగు అధ్యాయాలున్నాయి.

ఈ సమీక్షా వ్యాసంలో ప్రధానంగా మొదటి భాగంపైనే కేంద్రీకరించాను.

ఈ పుస్తకంలో రచయిత స్థూలంగా ప్రతిపాదించిన ముఖ్య నిర్ధారణలు చూద్దాం. అవి మూడు.

1. అర్ధ భూస్వామ్య విధానం స్థానంలో వ్యవసాయంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం వచ్చింది.

2. పెట్టుబడి వల్ల వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో పడింది.

3. భూమిని జాతీయం చేయాలనే నినాదమే ఇవ్వాలి తప్ప, కొద్దిపాటి భూమికి యజమానులుగా మార్చాలనే కార్యక్రమం ఉండరాదు.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం వచ్చేసింది అని నిర్ధారించటానికి రచయిత స్థూలంగా ఐదు అంశాలపై ఆధారపడ్డారు.

1. భూ యాజమాన్యంలో, భూ సంబంధాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు

2. భూమి సరుకుగా మారటం

3. కౌలులో వస్తున్న మార్పులు

4. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగటం

5. రైతాంగం, వ్యవసాయ కూలీలు పల్లెలను, వ్యవసాయాన్ని వదిలి పట్టణాల బాటపట్టడం

ఈ అంశాలను కొంత వివరంగా చర్చిద్దాం

1. భూ యాజమాన్యంలో, భూ సంబంధాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు :-

తీవ్రమైన భూమి విభజనతో ఏ మాత్రం లాభసాటి కాని భూ ఖండాల స్థితికి రైతాంగం చేరిందనీ, మరో వైపు ఈ స్థితి నుంచే భూమి సరుకుగా మారి భూ కేంద్రీకరణ వైపు పయనిస్తోందనీ, వ్యవసాయంలో పెట్టుబడి పెట్టగలిగిన వాళ్ళ యాజమాన్యంలోకి భూమి బదిలీ అవుతోందని రచయిత పరిశీలన.

శ్రీకాకుళం జిల్లాకు సంబంధించినంత వరకు చూస్తే - భూమి పైన యాజమాన్యం 1960 ల దాకా ప్రధానంగా, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమదొర, కొండ జమీందార్ల చేతిలో ఉండేది. క్రమంగా జమీందారీ రద్దు చట్టం, ఎస్టేట్ రద్దు చట్టం, మైనర్ ఇనాం రద్దు చట్టం వంటి చట్టాల వల్ల, న్యాయ వివాదాల పోరాటాల ద్వారా సంఖ్యాధిక్యత వల్ల 70వ దశకం తర్వాత భూమిపై యాజమాన్యం ప్రధానంగా నాలుగు వ్యవసాయ కులాలైన కాళింగ, కొప్పులవెలమ, తూర్పు కాపు, పొలనాటి వెలమకు చెందిన రైతులకు మారింది.

(రాష్ట్ర వ్యాప్తంగానూ, దేశ వ్యాప్తంగానూ స్థూలంగా చూస్తే భూ యాజమాన్యం శూద్ర వ్యవసాయ కులాల చేతిలోకి వచ్చిన దానికి అనుగుణంగానే శ్రీకాకుళంలోని పరిణామాలు కూడా ఉన్నాయి.)

శ్రీకాకుళం జిల్లాలోని భూ కమతాల యాజమాన్యంలో స్థూలంగా వచ్చిన మార్పులు చూద్దాం. ఈ మార్పులన్నీ 1985-2005 కాలానికి సంబంధించినవి. సన్నకారు భూ ఖండాలు (2.5 ఎకరాలకు తక్కువ) 70.75% నుండా 76.72 శాతానికి పెరగగా, వీరి ఆధీనంలోని భూమి 30.27% నుండి 38.16% శాతానికి పెరిగింది. ఇదే కాలంలో చిన్న తరహా (2.5 నుండి 5 ఎకరాల లోపు) భూ ఖండాలు 16. 63% నుండి 15.75 శాతానికి తగ్గగా భూమి 23.32 శాతం నుండి 28.27 శాతానికి పెరిగింది. అర్ధ మాధ్యమిక (5-10 ఎకరాలు), మాధ్యమిక (10-25 ఎకరాలు) భూ కమతాల సంఖ్య కలిపి 1985లో 12.52%, భూమి 44.86 ఉండగా, 1990-2005 గణాంకాల ప్రకారం అర్ధ మాధ్యమిక కమతాలు 7.48% నుండి 5.95 శాతానికి, భూమి 23.98 నుండి 20.78 శాతానికి తగ్గింది. అట్లాగే మాధ్యమిక భూ కమతాల సంఖ్య 3.23 నుండి 1.48 శాతానికి, భూమి 16.27 నుండి 11 శాతానికి తగ్గింది. ఇక భారీ

		సన్నకారు	చిన్నకారు	అర్ధమాధ్యమిక	మాధ్యమిక	భారీ
	భూకమతాల శాతం	70.75	16.63	7.48	3.23	0.10
1985	క్షేత్రఫలం శాతం	30.27	23.32	23.98	16.27	1.56
	భూకమతాల శాతం	76.72	15.75	5.95	1.48	0.10
2005	క్షేత్రఫల శాతం	38.16	28.27	20.78	11	1.80

కమతాలు (25 ఎకరాలు అంతకంటే ఎక్కువ) 1990 లో మాత్రం కొంత పెరిగినా మొత్తం మీద 0. 10 శాతం వద్దే ఉన్నాయి. అయితే ఈ కమతాల భూమి మాత్రం 1990లో కొంత పెరిగినా 85లో 1.56 శాతం, 2005 నాటికి 1.80 శాతం ఉంది. (ఎగువ పట్టిక చూడండి.)

భూ కమతాల సగటు వైశాల్యం చూస్తే సన్నకారు కమతం 1985 నాటికి 1.08 ఎకరాలుంటే 2005 నాటికి 0.94 ఎకరాలకు పడిపోగా చిన్న తరహా భూ ఖండం సగటు 3.54 ఎకరాల నుండి 3.40 ఎకరాలకు పడిపోయింది. అర్ధమాధ్యమిక తరహా సగటు 1990 లో 7.27 ఎకరాల నుండి 2005లో 6.62 ఎకరాలకు పడిపోగా మాధ్యమిక కమతాల సగటు అదే కాలంలో 11.44 నుండి 14 ఎకరాలకు పెరిగింది. సగటు భారీ కమతం 1985-2005 మధ్యకాలంలో 38.97 ఎకరాల నుండి 35. 88 ఎకరాలకు తగ్గింది.

ఈ మార్పులు భారతదేశమంతటా వచ్చిన మార్పుల ధోరణికి దాదాపు అనుగుణంగానే ఉన్నాయి.

1961 నుంచి 2003 మధ్య కాలంలో మొత్తంగా దేశం మీద వచ్చిన మార్పులు చూస్తే కమతాల సంఖ్య, వ్యవసాయ క్షేత్రం ఈ క్రింది విధంగా ఉన్నాయి. (దిగువ పట్టిక చూడండి)

సన్నకారు, చిన్నకారు కమతాల సంఖ్య కలిపి శ్రీకాకుళంలోనైతే 92% పైగా ఉండగా భారతదేశ మంతటా కలిపి 90% పైగా ఉన్నాయి. ఈ కమతాలలో ఉన్న భూమి 66% అయితే దేశ వ్యాప్తంగా చూస్తే ఇది 43 శాతంగా ఉంది. దేశ వ్యాప్త ధోరణి చూస్తే భూకమతాల పరిమాణంలో వచ్చిన మార్పులు భూమి కేంద్రీకరణ దిశగా వెళ్లటం లేదని అర్ధమవుతుంది. స్థూలంగా దేశ వ్యాప్తంగానూ, శ్రీకాకుళంలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ కూడా మధ్య తరగతి రైతాంగ ఆర్థిక విధానమే ప్రబలంగా ఉందని అర్ధమవుతుంది.

ఒకప్పుడు భూస్వాముల వద్ద ఉన్న భూ కేంద్రీకరణ తగ్గిందనేది ఒక వాస్తవమైతే పెట్టుబడిదారీ వ్యవస్థలోని భూ కేంద్రీకరణ మాదిరిగా గత మూడు, నాలుగు దశాబ్దాలలో కూడా జరగలేదనేది మరొక వాస్తవం. చలనపు దిశ కూడా అటువైపు లేదు.

భారతదేశంలో వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు సాపేక్షికంగా ఎక్కువగా అభివృద్ధి అయ్యాయని అందరూ అంగీకరించే పంజాబ్ విషయం చూస్తే సన్నకారు, చిన్నకారు కమతాల సంఖ్య 1970-71లో 56.54% ఉంటే 1980-81 కి 38.62% కు, 1995-96 నాటికి 35.43% కు తగ్గింది. 25 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న కమతాల సంఖ్య 1990-91 లో 6 శాతం (67,000) నుండి 95-96కు 7.32 శాతం (80,000) కు పెరిగింది. సాగుభూమి 26.71% నుండి 28.89% కి పెరిగింది. 10 ఎకరాలకు మించిన కమతాలన్నింటినీ చూస్తే 1970-71లో 23% ఉంటే 90-91 నాటికి 29.37% కి, 95-96 కు 35.32% కి పెరిగింది. ఈ కమతాల సాగుభూమి 90-91లో 66.94% నుండి 95-96 నాటికి 71.19% కి పెరిగింది.

పంజాబ్‌లో సాగుభూమిలో మూడింట రెండువంతులకు పైగా ఈ ధనిక, పెట్టుబడిదారి భూస్వాముల (25 ఎకరాలకు మించిన భూమి కలిగిన వాళ్ళు) ఆధీనంలోనే ఉంది.

శ్రీకాకుళంలో కానీ, ఆంధ్రప్రదేశ్ మొత్తంగా కానీ, దేశం మొత్తం మీద స్థూలంగా కానీ ఈ పరిస్థితి మచ్చుకైనా కనిపించటం లేదుకదా. కాబట్టి ఈ కమతాల సైజు ఆధారంగా వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం నెలకొన్నదనే నిర్ధారణకు రాలేం.

బ్రిటన్‌లో పెద్ద భూకమతాలు విఖండమవటాన్ని గురించిన మార్క్స్ కొటేషన్, 'చిన్న, సన్న తరహా భూఖండాలు వాటికవే పెట్టుబడిదారీ వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలకు నిదర్శనం' అన్న కాట్స్కీ విశ్లేషణల గురించి తరువాత చూద్దాం.

సరుకుగా భూమి:- 'భూమి ఒక మౌలిక జీవన వనరు అనే దృష్టి నుంచి దానిని ఒక సరుకుగా చూస్తున్న క్రమం విస్తారంగా ఉనికిలోకి వచ్చింది'.

'ఒక మారకపు సాధనంగా భూమి మారడమనేది పెట్టుబడిదారీ సంబంధాలను సూచిస్తుంది'.

నిజమే.

అయితే మరి భూమి సరుకుగా మారిన నూరు, నూట యాభై సంవత్సరాల తర్వాత కూడా భూమి కేంద్రీకరణ జరగక, సన్న, చిన్నకారు కమతాల్లోనే యాభై శాతం పైగా భూమి ఎందుకు ఉంది? పది ఎకరాల లోపు మధ్య తరగతి రైతాంగాన్ని కూడా కలుపుకుంటే (అధికారిక లెక్కల్లో అర్ధ మాధ్యమిక) దేశం మొత్తం మీద 96 శాతం

		సన్నకారు	చిన్నకారు	అర్ధమాధ్యమిక	మాధ్యమిక	భారీ
	భూకమతాల శాతం	66	9.16	12.86	9.07	2.87
1961	క్షేత్రఫలం శాతం	7.59	12.39	20.54	31.23	28.25
	భూకమతాల శాతం	66.64	14.70	10.78	6.45	1.42
1982	క్షేత్రఫల శాతం	12.22	16.49	23.58	29.83	18.07
	భూకమతాల శాతం	79.60	10.80	6.00	3.00	0.60
2003	క్షేత్రఫల శాతం	23.05	20.38	21.98	23.08	11.55

కమతాలు, 65 శాతం భూమి ఈ చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతాంగపు చేతుల్లోనే ఉందనేది స్పష్టం. ఇక శ్రీకాకుళం లోనైతే ఇవి కమతాలు 98 శాతం, భూమి 87 శాతం.

చిన్న, సన్నకారు రైతాంగం దేశవ్యాప్తంగా 82 శాతం ఉంటే అందులోంచి 42.4 శాతం వ్యవసాయపు బంధనాల నుంచి తెంచుకోవాలనుకుంటున్నారని, మధ్య తరహా భారీ భూఖండాల యజమానుల్లో సహితం వ్యవసాయం నుండి తప్పుకోవాలను కుంటున్న వారు 28.1% ఉన్నారనీ, ఆంధ్రప్రదేశ్‌లో నైతే సన్నకారు రైతాంగం 28.3%, చిన్నకారు రైతాంగం 19.5%, మధ్యతరహా, భారీ భూఖండాల యజమానులు 15.9% వ్యవసాయం నుంచి తప్పుకో జూస్తున్నారని రచయిత పేర్కొన్నారు.

తప్పుకోజూస్తున్నారనేది వాస్తవమే అనుకున్నా తప్పుకోలేకపోతున్నారనేది కూడా అంతకు మించిన వాస్తవం.

ఒకవైపు చిన్నతరహా వ్యవసాయం ఏ మాత్రం లాభదాయకం కాకపోయినా, మరొకవైపు ఎటువంటి సెంటిమెంట్లు లేకుండా భూమిని 'సరుకు'గా అమ్ముకునే స్వభావం పెరిగినా పెట్టుబడిదారీ భూమి కేంద్రీకరణ పెరగకపోవటం వెనుక కారణం భారతదేశంలో వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ఏ మేరకు పెరుగుతున్నా అది జరుగుతున్నది ద్రవ్య పెట్టుబడిదారీ దశలో అంటే సామ్రాజ్యవాద దశలో; దాని సంక్షోభం కారణంగా అవసరమైన స్థాయిలో – అంటే వ్యవసాయంలో నుండి తొలగేవారిని ఇముడ్చుకోగలిగే స్థాయిలో పారిశ్రామికీకరణ జరగకపోవటం, జరగలేకపోవటం. అందుకే పట్టణాలకు వలసపోయే శ్రామికులు కూడా ఏదో రకంగా తమ మడి చెక్కను తమ వద్దే ఉంచుకోవటం, వ్యవసాయపు కాలంలో నెలో, రెణ్ణెల్లో గ్రామానికి వచ్చి ఇంట్లో ఉండిపోయే ఆడవాళ్ళకో, ముసలివాళ్ళకో సాయం చేస్తూ సాగు చేసి 'మనుగడ వ్యవసాయం' (సబ్‌సిస్టెన్స్ ఫార్మింగ్) చేయటం. దీని వెనక ఉన్న కారణం ఏమిటనే విషయంపై రచయిత దృష్టి సారించలేదు.

కౌలు:- వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు నెలకొన్నాయనటానికి మరొక సూచికగా రచయిత 'కౌలు' గురించి పేర్కొన్నారు.

భూమిని కౌలుకు ఇవ్వటం గురించి రచయిత రెండు, మూడు రకాల కౌలు పద్ధతుల గురించి ప్రస్తావించారు. పట్టణాల బాట పట్టిన ఉద్యోగస్థుల వంటివారు కౌలుకు ఇవ్వటం, పేద రైతులు లేదా సన్న, చిన్నకారు రైతులు అదే శ్రేణికి చెందిన రైతాంగానికి కౌలుకుఇవ్వటం, కోస్తా జిల్లాల రైతులు వచ్చి మెట్ట ప్రాంతాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయటం. అయితే ఇంతకు మించిన వివరాలు అంటే ఎంత శాతం భూమి, ఎట్లాంటి పద్ధతుల్లో కౌలుకు ఇచ్చారు వంటి వివరాలేవీ ఇవ్వలేదు. ఇవేమీ లేకుండానే 'కౌలు వ్యవసాయం అంటేనే పెట్టుబడిదారీ వ్యవసాయం' అని కాట్జ్‌ని ఉటంకించారు.

పెట్టుబడిదారీ సంబంధాలు ప్రధానంగా నెలకొన్నప్పుడు లేదా ఆ దిశలో ప్రధానంగా కదలిక ఉన్నప్పుడు కౌలు స్వభావం ఎట్లా ఉంటుందో చూడాలంటే పంజాబ్ ఉదాహరణ చూడాలి. 25 ఎకరాలకు మించి ఉన్న రైతులు సన్న, చిన్నకారు రైతుల వద్ద భూమిని కౌలుకు తీసుకొని తమ కమతం సైజు పెంచుకుంటున్నారు. ఇట్లాంటి పెద్ద రైతుల శాతం 1981-82 లో 42.3 శాతం నుండి 91-92 వరకు 47.6 శాతానికి పెరగగా, ఇదే కాలంలో భూమిని కౌలుకు తీసుకునే సన్నకారు రైతుల శాతం 10.6 శాతం నుండి 7.3 శాతానికి తగ్గిపోయింది. కౌలులో ఈ 'వ్యతిరేక దిశలో కౌలు' (చిన్న రైతుల నుంచి పెద్దరైతులు కౌలుకు తీసుకోవటం) పెట్టుబడి సంబంధాలు పెరుగుతుండటానికి సూచిక. అంతే కానీ 'కౌలు వ్యవసాయం అంటేనే పెట్టుబడిదారీ వ్యవసాయం' స్థాపించుకు పోయినట్టు గాదు.

యాంత్రీకరణ:-

వ్యవసాయంలో పెరిగిన, పెరుగుతున్న యాంత్రీకరణను కూడా పెరుగుతున్న పెట్టుబడిదారీ సంబంధాలకు సూచికగా రచయిత పేర్కొన్నారు. దీనికి మద్దతుగా కాడి పశువుల సంఖ్య ఆంధ్రప్రదేశ్‌లో 1972లో 68 లక్షల నుండి 2007 నాటికి 48 లక్షలకు పడిపోవటాన్ని, అట్లాగే దేశంలో వ్యవసాయంలో పశువుల శక్తి వినియోగం 1971-72 లో 53 శాతం నుండి 2011-12 నాటికి 6. 37 శాతానికి మనుషుల శ్రమశక్తి వినియోగం 10-64 శాతం నుండి 5. 09 శాతానికి పడిపోవటాన్ని ఆ మేరకు యంత్రశక్తి వినియోగం పెరగటాన్ని విశదపరిచారు.

యాంత్రీకరణ పెరిగిందనేది వాస్తవమే. చిన్న, సన్నకారు రైతులు కూడా అద్దెకు యంత్రాలను వాడేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ ట్రాక్టర్లు, టిల్లర్లు చిన్న, మధ్య తరగతి రైతాంగం చేతిలో శ్రామికుల బదులుగా ఉపయోగించేందుకే పనికి వస్తున్నాయి తప్పితే, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోలా మిగులు విలువను ఉత్పత్తి చేయటానికి కాదు. అట్లాగే పంపుసెట్ల వాడకం, ఇతర యంత్ర పరికరాలు వాడకం వంటివన్నీ కూడా బహుళజాతి కంపెనీలు, దళారీ బడా పెట్టుబడిదారుల కంపెనీల బొక్కసాలు నింపడానికే పనికొస్తున్నాయి తప్పితే వ్యవసాయంలో పెట్టుబడి మదుపు పెరగటానికి కాదు.

పట్టణీకరణ? :-

శ్రామికుల కదలికలను పైపైన చూసే వారికైనా పట్టణీకరణ పెరుగుతున్నదనీ, శ్రామికుల వలసలు ప్రధానంగా పట్టణాలవైపనీ సాపేక్షికంగా పట్టణ జనాభా పెరుగుతున్నదనీ సులభంగానే కనిపిస్తుంది. కానీ రచయిత అంతటితో ఆగలేదు. రచయిత 'మానవ సంపద' అనే 5వ అధ్యాయంలో 19, 20 నం. పట్టికల్లో దేశ స్థాయిలో, శ్రీకాకుళంలో రైతులు, వ్యవసాయ కార్మికుల శాతాల్లో వచ్చిన మార్పులను ఇచ్చి, 'తాజా 2011 జనాభా గణాంకాలు గ్రామీణ ప్రాంతం నుంచి రైతాంగాన్ని ఊడ్చివేయడాన్నే తెలియజేస్తున్నాయి' అని నిర్ధారించారు.

2001లో దేశ ప్రధాన శ్రామికులలో రైతుల వాటా 54.4 శాతం ఉంటే 2011 నాటికి 26.44 శాతానికి పడిపోయిందనీ అట్లాగే శ్రీకాకుళం జిల్లాలోనైతే 2011 నాటికి 18.08 శాతానికి పడిపోయినట్టుగా చూపించారు.

ఇదే నిజమైతే యూరప్ దేశాల్లో వంద, రెండు వందల ఏళ్ళకు పైగా పట్టిన సమయం భారతదేశంలో పదేళ్ళలో జరిగిందనుకోవాలి. అంతగా విప్లవాత్మకంగా 2001-2011 దశాబ్దంలో ఏం జరిగింది.

ఆర్థిక విధానపు ఉదారీకరణ ప్రైవేటీకరణలతో అంతగా భారతదేశం మెరిసిపోయిందా?

కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ గణాంకాలు తప్పు కావటానికే ఎక్కువ అవకాశముందని అర్థమవుతుంది. 19 నం. పట్టికలో 1971 నుండి 2001 వరకు ఇచ్చిన గణాంకాలను చూస్తే 1971 లోనూ, 81, 91, 2001 లోనూ రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసి వందశాతం అవుతారు. కాని 2011 లెక్కల ప్రకారం రైతులు 26.44 శాతమైతే వ్యవసాయ కార్మికులు 23.77 శాతం. మొత్తం 50. 28%. మిగిలిన 50 శాతం ఏమైనట్టు? నికర సంఖ్యలో చూసుకుంటే కూడా 1971 నుండి 2001 వరకు రైతులు 7.2 కోట్ల నుండి 12.7 కోట్లకు పెరగగా, వ్యవసాయ కార్మికులు 4.75 కోట్ల నుండి 10.7 కోట్లకు పెరిగారు. శాతాల్లో చూసుకుంటే రైతులు 62.2 శాతం నుండి 54.4 శాతానికి తగ్గి, వ్యవసాయ కార్మికులు 37.8 శాతం నుండి 45.6 శాతానికి పెరిగారు. 2011 లో మాత్రం హఠాత్తుగా రైతుల సంఖ్య 9.58 కోట్లకు పడిపోగా, వ్యవసాయ కార్మికుల సంఖ్య 8.61 కోట్లకు పడిపోయింది. గ్రామీణ జనాభా మాత్రం 2001 లో 74 కోట్ల నుండి 2011 లో 83 కోట్లకు పెరిగింది. ఈ గారడీ ఎట్లా జరిగిపోయింది?

2011 జనాభా లెక్కల్లో లేదా వాటిని సూచీబద్ధం చేయడంలో ఏదో లోపమున్నట్టుంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో రచయిత పొరపాటు చేసి 'గ్రామీణ ప్రాంతం నుంచి రైతాంగం ఊడ్చుకు పోయింది' అని ఉత్సాహంగా నిర్ధారించారు. (స్వతంత్రంగా ఈ అంకెలను సరిచూడటానికి నా వద్ద వనరులు లేవు).

2011 జనాభా లెక్కల ప్రకారం కూడా శ్రీకాకుళం జిల్లాలో పట్టణ జనాభా 16 శాతమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చూస్తే ఇది 29.6 శాతం. దేశ వ్యాప్తంగానైతే 31.2 శాతం మాత్రమే. శ్రీకాకుళంలో 84 శాతం గ్రామీణ జనాభా అయితే వ్యవసాయ రంగంలో రచయిత చెప్పినంత తక్కువగానే ఉందా? 2001 తో పోల్చినప్పుడు రైతులు, వ్యవసాయ కూలీలు - ఉభయుల సంఖ్య 2011లో నికరంగా తగ్గినట్టు లెక్కలు చూపుతున్నాయి. 1971 నుండి 2001 వరకు ఏ జనాభా లెక్కల్లోనూ ఇట్లా లేదు. దీనికి రచయిత ఏ వివరమూ ఇవ్వలేదు.

మన దేశంలో పట్టణీకరణ 2015 నాటికి కూడా 33 శాతం ఉంటుందనీ, అప్పటికి చైనాలో 56 శాతం, బ్రెజిల్‌లో 86 శాతం, దక్షిణ ఆఫ్రికాలో 65 శాతం, ప్రపంచంలో సగటున 54 శాతం ఉంటుందని అంచనా. ప్రపంచ జనాభాను అంచనా వేసే అంతర్జాతీయ సంస్థ అంచనా ఇట్లా ఉంటే (ది హిందూ-13/7/2014) భారతదేశ పట్టణీకరణ ఎట్లా సాపేక్షికంగా తక్కువగా ఉందో చూడవచ్చు.

వ్యవసాయంలో సంక్షోభం :-

బహుళజాతి కంపెనీలు, దళారీ పెట్టుబడిదారుల కంపెనీలు వ్యవసాయానికి సప్లై చేస్తున్న యంత్ర పరికరాలు, విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వంటి ముడిసరుకుల ధరలను, పంటల ధరలను నియంత్రించడం ద్వారా, వ్యవసాయంలోని మిగులునంతా కొల్లగొట్టుక పోతున్నాయి. దీనికి తోడు వినిమయ సంస్కృతిని విచ్చలవిడిగా పెంచి పోషిస్తున్నందు వల్ల వినిమయ సరుకుల అమ్మకాల ద్వారా కూడా వ్యవసాయంలోని మిగులును కొల్లగొడుతున్నాయి. ఈ విషవలయ ప్రక్రియను రచయిత చాలా వివరంగా వర్ణించి వ్యవసాయంలో సంక్షోభానికి కారణాలను వెతకడానికి మంచి ప్రయత్నం చేసారు.

అయితే ఏ కారణాలైతే వ్యవసాయ సంక్షోభానికి కారణమవుతున్నామో సరిగ్గా అవే కారణాల వల్ల మన దేశంలో కొన్ని దశాబ్దాల క్రితం ఉన్నంత బలంగా కొన్ని భూస్వామ్య దోపిడీ పద్ధతులు కొన్ని ప్రాంతాల్లో లేకుండా పోతున్నా పెట్టుబడిదారీ విధానం మాత్రం నెలకొనడం లేదు. నెలకొనేందుకు అవకాశం కూడా లేదు. ఈ విషయాన్ని మాత్రం రచయిత గ్రహించలేదు. ఈ పుస్తకంలోని అతి పెద్ద సైద్ధాంతిక బలహీనత ఇదే.

పెట్టుబడిదారీ విధానం నెలకొన్నదని నిరూపించేందుకు మార్క్స్, కాట్స్కీ, లెనిన్‌ల సైద్ధాంతిక ప్రతిపాదనలు :-

రచయిత పెట్టుబడిదారీ విధానం నెలకొన్నదనే తన నిర్ధారణలను నిరూపించడానికి కాట్స్కీ, మార్క్స్, లెనిన్‌ల సైద్ధాంతిక ప్రతిపాదనలను విరివిగా వాడారు.

అయితే స్వేచ్ఛాయుత పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అవుతున్న సందర్భాల్లో యూరప్ దేశాల్లోని పరిణామాలను వివరించడానికి ఆ సమయంలో వాళ్ళు చేసిన సైద్ధాంతీకరణలను సామ్రాజ్యవాదం, బడా దళారీ బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారులు పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని గిడసబార్చిన, గిడసబారుస్తున్న మన దేశానికి అన్వయించ వచ్చా లేదా అనేది చూడాలి.

వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు నెలకొన్నాయని నిరూపించేందుకు ప్రయత్నించే వాళ్లంతా చేసే ప్రధాన తప్పిదమేంటంటే భూస్వామ్య వ్యవస్థకు, అర్ధ భూస్వామ్య వ్యవస్థకు తేడా చూడకపోవటం. భూస్వామ్య వ్యవస్థలోని లక్షణాలన్నీ ప్రస్ఫుటంగా కనిపించకపోతే లేదా పెట్టుబడిదారీ సంబంధాల ఛాయలు కనిపిస్తే చాలు, పెట్టుబడిదారీ వ్యవస్థ మారిపోయిందనే నిర్ధారణకు వస్తుంటారు. అర్ధ భూస్వామ్య వ్యవస్థలో పెట్టుబడిదారీ సంబంధాలు ఏ మేరకు ప్రవేశిస్తే ఆ మేరకు పెద్ద భూస్వాములు, వడ్డీవ్యాపారం, తీవ్రమైన ఆర్థికేతర దోపిడీ, సహజ ఆర్థిక వ్యవస్థ (నేచురల్ ఎకానమీ) వంటిది తగ్గిపోయి సరుకీకరణ వంటివి పెరుగుతాయి. అట్లాగే భూమి సరుకుగా మారటం, పంటను అమ్ముకోవటం, వాణిజ్య పంటలు వేయటం ఇవన్నీ వ్యవసాయంలో పెట్టుబడి ప్రవేశాన్ని నిశ్చయంగా సూచిస్తాయి. అయితే భారతదేశంలో వ్యవసాయంలో పెట్టుబడి ప్రవేశించనేలేదని ఎవ్వరైనా అంటున్నారా? అట్లాంటి అవగాహన ఎవ్వరికీ ఉండదు. భారతదేశంలో వ్యవసాయంలో భూస్వామ్య సంబంధాలు ఉన్నాయనే వాళ్ళు ఈ వ్యవస్థను అర్ధ భూస్వామ్య వ్యవస్థగా అభివర్ణిస్తున్నారు. అంటేనే పెట్టుబడి (సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడి) వ్యవసాయంలోకి ప్రవేశించినందుకే. పై లక్షణాలన్నీ ఏదో ఓ మేరకు కొంత హెచ్చు తగ్గులతో పెరుగుతాయి. అది భూస్వామ్య విధానం కాక అర్ధ భూస్వామ్య విధానమైంది.

స్వేచ్ఛాయుతంగా పెట్టుబడిదారీ విధానం పెరిగిన దేశాల్లో

ఒకసారి పై మార్పులు ప్రవేశించటం మొదలయ్యాక అవి కొంత హెచ్చుతగ్గులతో, (స్థానిక విశిష్టతలకు లోబడి) వేగంగా పెరిగి గుణాత్మకంగా సమాజం మొత్తంగా పెట్టుబడిదారీ విధానంలోకి ప్రవేశించేందుకు దారి తీసాయి. కానీ సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల భల్లూకపు పట్టులో దేశ ఆర్థిక వ్యవస్థ ఉన్నంతకాలం అవి భూస్వామ్య సంబంధాలపై నిర్ణయాత్మకమైన పోరాటం చేయక పోవటమే కాక, ఆర్థిక సంక్షోభ కారణంగా వాటి స్వీయ బలహీనత వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిని గిడసబారుస్తాయి. ఎప్పటికీ పెరగనీయవు. వ్యవసాయంలో అందుకే పెట్టుబడిదారీ సంబంధాలు గిడసబారుతూ ఒక మేరకు పెరిగినా పెట్టుబడిదారీ వ్యవస్థ నెలకొనక అర్ధభూస్వామ్య వ్యవస్థగా కొనసాగుతుంది. ఎందుకిలా జరుగుతుందో, ఇదేమీ మూసపోత నిర్ధారణ ఎట్లా కాదో చూద్దాం.

ఇందుకోసం భూ కమతాల స్థితి, భూమి సరుకుగా మారటం- వీటిని పరిశీలిద్దాం.

మన దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ శ్రీకాకుళం లో కానీ చిన్న, సన్నకారు, మధ్య తరహా కమతాల సంఖ్యే అత్యధిక మనీ, వీటి క్షేత్రఫలం కూడా చాలా అధికమనీ చూసాం. పైగా భూమి సరుకుగా మారినా సరే పెట్టుబడిదారీ విధానంలో వలె పెట్టుబడిదారీ భూ కేంద్రీకరణ పెద్ద ఎత్తున జరగటం లేదనేది కూడా చూసాం. దీనికి కారణమేమిటి?

రచయిత మాత్రం 'బూర్జువా పరిస్థితులలో పెద్ద భూ కమతాలు విఖండిత మవటం గురించి అది సహజమేనని వర్ణించిన మార్క్స్ కొటేషన్‌ను (పేజీ 69), 'చిన్న, సన్న తరహా భూఖండాలు వాటికవే పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలకు నిదర్శనం' అని కాట్స్కీ రాసిన విషయాన్ని(పేజీ 69) ఉదహరించి వ్యవసాయంలో ఉన్నది పెట్టుబడిదారీ సంబంధాలే అని చెప్పటానికి ప్రయత్నించారు. అట్లాగే భూమి సరుకుగా మారటమంటేనే పెట్టుబడిదారీ సంబంధాలు నెలకొన్నాయనడానికి నిదర్శనమని చెబుతూ అందుకు కూడా మార్క్స్‌ను సాయం తెచ్చుకున్నారు. 'కౌలు వ్యవసాయమంటేనే పెట్టుబడిదారీ వ్యవసాయపు క్లాసికల్ లక్షణమని' కాట్స్కీని కోట్ చేసారు.

భూ కేంద్రీకరణ జరగటం, మళ్ళీ కొన్ని పరిస్థితుల్లో భూవికేంద్రీకరణ జరగటం మార్క్స్‌పరిశీలించిన కాలంలో జరిగి ఉండవచ్చు కానీ పెట్టుబడిదారీ విధానం పెరిగాక ఈ రోజు పెట్టుబడిదారీ దేశాల్లో ఎక్కడైనా చిన్న కమతాలు ఉన్నాయా? ఉండటం సాధ్యమా? భూమా సరుకుగా మారినా 'మనుగడ వ్యవసాయాని'కి సిద్ధపడటం, పెద్దఎత్తున పెట్టుబడిదారీ భూకేంద్రీకరణ జరగకపోవటం వెనుక కారణమేమిటి?

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయిన దేశాల్లో అది అభివృద్ధి అవుతున్న కాలంలో కూడా తమ భూముల నుండి బేదఖలైన రైతాంగం కార్మికులుగా మారిపోయారు. కానీ మన దేశంలో ఇక్కడే సహజ పరిణామానికి అడ్డుకట్ట పడింది. ఆ అడుకట్టగా నిలబడి ఉన్నది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం. ఆ కారణంగా భారతదేశంలో పారిశ్రామికీకరణ కూడా గిడసబారిపోయి, ఉద్యోగాల్లేని ఆర్థిక పెరుగుదల (జాబ్‌లెస్ గ్రోత్) వల్ల భూమి నుండి బేదఖలైతే కనీస మనుగడకు కూడా గ్యారంటీ లేకపోవటం వల్ల ఎంత అనుత్పాదకమైన చిన్న భూకమతాలైనా రైతులు వదిలి పెట్టుకోవడానికి సిద్ధంగా లేరు. అందుకే రచయిత చెప్పినట్టు పట్టణాలకు వలసలు పెరిగినా అక్కడే స్థిరపడే ఆర్థిక పరిస్థితులు లేక గ్రామాల్లోంచి, వ్యవసాయం నుంచి పూర్తిగా తప్పుకోకుండా వ్యవసాయాన్ని జీవికకు కనీస గ్యారంటీగా అట్టిపెట్టుకోవాలని చూస్తున్నారు. ఏ ఉదారీకరణ వల్ల కానీ, ప్రపంచీకరణ వల్ల కానీ ఈ పరిస్థితుల్లో మార్పు రావటం లేదు. వచ్చే అవకాశం లేదు. కాబట్టే గత ఇరవై ఏళ్ళ కాలంలోని పరిణామాన్ని చూసినా పెద్ద ఎత్తున పెట్టుబడి తరహా భూ కేంద్రీకరణ ఏమీ జరగటం లేదనేది విశదమవుతున్నది.

'తయారీ రంగంలో, పారిశ్రామిక రంగంలో పెరుగుదలే వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానపు ఆవిర్భావానికి, పెరుగుదలకు దోహదపడే ప్రధాన శక్తి' అన్న లెనిన్ మాటలను ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

చిన్న, సన్నకారు రైతులు కూడా ఒకటి, రెండు ఎకరాల్లో వాణిజ్య పంటలు వేయటాన్ని లేదా తమ ధాన్యాన్ని అమ్మటాన్ని కూడా పెట్టుబడిదారీ విధానపు లక్షణంగా కొందరు అభివర్ణిస్తుంటారు. ఈ రచయిత కూడా ఆ తోవలోనే ఉన్నారు. అయితే అమ్మడం మనుగడ కోసమే అనేది మర్చిపోతుంటారు. మనుగడ కోసం చేసే అమ్మకాల్లోనే మిగులు విలువలో అత్యధిక భాగం దళారీ బడా పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు కోల్పోతారు. ఈ అమ్మకం సరళ ఉత్పత్తి విధానానికి మార్క్సిస్టు సూత్రమైన సరుకు-డబ్బు-సరుకు (సి-ఎం-సి) ని అనుసరిస్తుంది తప్ప పెట్టుబడిదారీ విధానంలో లాగా డబ్బు-సరుకు-డబ్బు (ఎం-సి-ఎం) ను కాదు.

పై చర్చ నేపథ్యంలో కొన్ని నిర్ధారణలు చేయవచ్చు.

వ్యవసాయంలో పెట్టుబడి ప్రవేశించిన నాటి నుంచి కూడా భూస్వామ్య సంబంధాలు ఏదో మేరకు బీటలు వారుతూ వస్తున్నాయి. ఇందులో పెట్టుబడి తో పాటు, పెట్టుబడి కంటే కూడా ప్రధాన పాత్ర వహించింది భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు. పెట్టుబడి తన పెరుగుదల మార్కెటు అవసరాల రీత్యా అవసరమైన మేరకు, భూస్వామ్య బంధనాలను మార్చే ప్రయత్నం చేస్తుంది. అట్లా చేయదనుకోవటం యాంత్రికమైన దృక్పథమే కాక వస్తుగత పరిణామ క్రమం పట్ల కళ్ళు మూసుకునే వైఖరి అవుతుంది. అయితే సమూలంగా భూస్వామ్య బంధనాలను మార్చే విప్లవాత్మక వైఖరి మాత్రం చేపట్టదు. ఇందుకు రాజకీయ కారణాలు ఉన్నాయి. అవి ప్రధానమైనవి. వాటికి తోడు ప్రస్తుత సామ్రాజ్యవాద దశలో ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. పైన వివరించిన పెట్టుబడిదారీ సంక్షోభం, ఆ సంక్షోభం కారణంగా తయారీ రంగం పెరగకపోవటం, ఉద్యోగ విహీన ఆర్థిక పెరుగుదల (జాబ్‌లెస్ గ్రోత్) ప్రధానం కావటం వంటి కారణాల వల్ల వ్యవసాయంలో యాంత్రీకరణ, భూ కేంద్రీకరణ పెట్టుబడిదారీ విధానంలో పెరిగినట్టు పెరగటానికి అవకాశం లేకుండా పోయింది. వ్యవసాయం నుండి మిగులును ద్రవ్య పెట్టుబడి వివిధ మార్గాలలో (ముడి సరుకుల అధిక ధరలు, పంటల తక్కువ విలువ, వినిమయ సరుకుల ద్వారా) మింగేసి వ్యవసాయంలో పెట్టుబడి మదుపు పై

తీవ్రమైన పరిమితులు విధించటం కూడా ఇందుకు తోడయ్యింది.

అందుకే వ్యవసాయంలో గిడసబారిన పెట్టుబడిదారీ సంబంధాలు ఒక మేరకు అభివృద్ధి అవుతున్నా, అది గుణాత్మకంగా పెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందే అవకాశం లేదు. ఇప్పటికే అలా మారిపోయిందనుకోడటం సరియైన నిర్ధారణ కాదు.

వ్యవసాయంలో నెలకొన్నది పెట్టుబడిదారీ విధానమా? లేక అర్ధభూస్వామ్య విధానమా అన్నది ఏదో అకడమిక్ చర్చ కాదు. సమాజంలో విప్లవాత్మక మార్పుకు అనుసరించవలసిన వ్యూహం దీనితో ముడిపడి ఉన్నది. అంతే కాదు విప్లవోద్యమ కాలంలోనూ, విప్లవానంతరం కూడా చేపట్టవలసిన వ్యవసాయిక కార్యక్రమం కూడా దీనిపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా మన దేశంలో విప్లవానికి అవలంబించవలసిన మార్గం గురించిన చర్చ రష్యా మార్గమా, చైనా మార్గమా అనీ, సార్వత్రిక తిరుగుబాటా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గమా అనే చర్చ కీలకంగా ఉత్పత్తి విధానంపై ఆధారపడి జరుగుతుంది కాబట్టి కూడా ఈ ప్రాధాన్యత ఎక్కువ. (ఉత్పత్తి విధానంపై మాత్రమే లేదా అత్యంత కీలకంగా ఆధారపడకుండా- మరీ ముఖ్యంగా పెట్టుబడిదారీ విధనమైతే రష్యా మార్గమని, దీర్ఘకాలిక యుద్ధ మార్గమైతే అర్ధ భూస్వామ్య సంబంధాలుండాలి అనే రీతిలో చర్చ ఉండకపోయినట్టయితే ఈ చర్చ ఒక చక్రంలో ఇరుక్కుపోయి ఉండకపోయేదనేది నా అభిప్రాయం. అయితే ఇది వేరే చర్చ).

పుస్తక రచయిత దీర్ఘకాల యుద్ధ మార్గమా, సార్వత్రిక తిరుగుబాటు మార్గమా అనే కోణంలో చర్చ చేయకుండా దున్నేవారికి భూమి నినాదం తప్పనీ, భూమి జాతీయకరణ చేయాలనీ చర్చ లేవనెత్తాడు. ఈ పద్ధతిలో లేవనెత్తినప్పటికీ దున్నేవారికి భూమి నినాదం నూతన ప్రజాస్వామిక విప్లవంలో కేంద్ర నినాదమనీ, భూమి జాతీయీకరణ సోషలిస్టు విప్లవ నినాదమనీ తెలియని విషయమేం కాదు.

రచయిత 'భూమి సమస్య పరిష్కారానికి చిత్రంగా దున్నేవానికే భూమి అనే నినాదం ముందుకొచ్చింది' అనే ఒక్క వాక్యంతో 1967 దాకా కమ్యూనిస్టు పార్టీలు, ఆ తర్వాత నక్సలైటు పార్టీల నాయకత్వంలో జరిగిన భూ పోరాటాలన్నింటినీ కొట్టేసారు. భూ పోరాటాల్లో లోపాలను చర్చించటం వేరే. ఇక్కడ రచయిత చేస్తున్నది అది కాదు. భూ పోరాటాలలోని బలహీనతలు, లోపాల కారణం చూపుతూ అసలు దున్నేవారికే భూమి నినాదమే 'చిత్రమైనదని' సూత్రీకరించారు. అంతేకాదు భూమి సమస్యకు పరిష్కారం భూమిని జాతీయం చేయటమే అని తేల్చేసారు.

భూమిని జాతీయం చేయటం గురించి మార్క్స్, అంబేద్కర్ తో సహా ఫేబియన్ సోషలిస్టులు ప్రతిపాదించిన విషయాలను ఉటంకించారు.

'భూమిని జాతీయం చేయకుండా కమ్యూనిజం సాధించటం సాధ్యం కాదని మార్క్సిస్టు సిద్ధాంతంలో బలంగా చెప్పే విషయమే. అది లక్ష్యమే. లక్ష్యం చేరుకోవటానికి మార్గమేంటి? ప్రస్తుత రాజ్యవ్యవస్థ అట్లా చేస్తుందని, చెయ్యాలని అంబేద్కర్‌కు భ్రమలు ఉండవచ్చు కానీ ప్రస్తుత రాజ్య స్వభావం గురించి స్పష్టమైన అవగాహన కలిగిన నిజమైన కమ్యూనిస్టులెవరూ కూడా అది సాధ్యమని అనుకోరు. కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రైతులు అంత సులభంగా 'తమ' భూములు జాతీయం కావటానికి అంగీకరించరనీ, అది పరిశ్రమలను జాతీయం చేయటం వంటిది కాదనీ రష్యా, చైనాలో జరిగిన ప్రయత్నాలను అధ్యయనం చేస్తే సులభంగా అర్థం అవుతుంది. వర్జిన్ సాయిల్ అప్‌టర్న్‌డ్ (తెలుగులో బీళ్ళు దున్నేరు) నవలలో ఈ సంఘర్షణ చాలా గొప్పగా చిత్రీకరించారు.

'దున్నేవారికే భూమి' నినాదం వెనక కోట్లాది రైతు కూలీలు, పేద రైతులు ఎందుకు కదిలారు అనేది రచయిత పూర్తిగా మిస్ కావటం ఈ పుస్తకంలో అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం.

'భూమిని నిలబెట్టుకోవడానికి పోరాటాలు సాగించడం లేదన్నది ఒక కఠోర సత్యం' అని కూడా రచయిత రాయడం ఆశ్చర్యం. ఏ పోరాటాలు లేకుండానే యు. పి. ఎ. ప్రభుత్వం నూట యాభై ఏళ్ళ భూ అధిగ్రహణ చట్టాన్ని మార్చాల్సి వచ్చిందా? కళింగనగర్, నందిగ్రామ్ సింగూరు, పోస్కో వ్యతిరేక పోరాటాలు, గజియాబాద్ రైతుల పోరాటాల నుండి గత రెండు దశాబ్దాల్లో సెజ్‌లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలన్నీ ఏం సూచిస్తున్నట్టు?

నష్టపరిహారం, భవిష్యత్తులో ఉద్యోగాలకు గ్యారంటీల పట్ల నలభై-యాభై ఏళ్ళ అనుభవం రైతుల కళ్ళెదురుగా ఉండటం వల్లనే 'అభివృద్ధి' బాటన పయనించకుండా వ్యవసాయానికి అంటి పెట్టుకుంటున్నారు. ఇందులో పాతకాలం లాగా భూమి పట్ల సెంటిమెంటు పని చేయకపోవచ్చు కానీ వ్యవసాయం, నష్టపరిహారం, భూములు కోల్పోయిన తర్వాత అనిశ్చితమైన జీవిక వంటి అంశాల లాభ నష్టాలు బేరీజు వేసుకున్నాకే కావచ్చు కానీ భూములను కోల్పోవటానికి సిద్ధపడటం లేదు. ఎనభయ్యవ దశకంలో దేశంలో పలు రాష్ట్రాల్లో గిట్టుబాటు ధరల పోరాటం రైతుల ప్రధాన పోరాటంగా ఉండటం ఎట్లాగైతే చూసామో అట్లాగే గత రెండు దశాబ్దాల్లో విస్థాపన సమస్య పైనే ప్రధాన ప్రజా ఆందోళనలు జరగటం దేనికి సూచిక?

రచయిత కొన్ని విషయాల్లో శ్రీకాకుళం అనుభవాలను మాత్రమే పరిశీలించి చాలా విస్తృతమైన సాధారణీకరణలు చేసారు.

ఉదాహరణకు 'గ్రామీణ శ్రామిక వర్గానికి భూమి దక్కడం కోసం చేయాల్సిన రెండవ పోరాట దశ జరగలేదు', '70 తర్వాత భూమి కోసం నినాద ప్రాయమైన కబుర్లే తప్ప సంఘటిత పోరాటాలు అనేవి దాదాపుగా లేవు. భూ పోరాటం అంటే ప్రభుత్వ బంజరు భూములు లేదా అటవీ భూముల ఆక్రమణే అనే అర్థం స్థిరపడిపోయింది.'

ఎమర్జెన్సీ తర్వాత 'జగిత్యాల జైత్రయాత్ర' గా ప్రసిద్ధమైన పోరాటాల కాలం నుండి 1990-93 కాలంలో తెలంగాణలో జరిగిన భూ ఆక్రమణ పోరాటాల్లో గ్రామీణ శ్రామిక వర్గానికి భూమి దక్కడం కోసం పోరాటాలు జరగలేదనే రచయిత భావిస్తున్నారా? ఒక్క తెలంగాణలోనే కాదు, గుంటూరులో, ప్రకాశంలో, కర్నూలు తదితర జిల్లాల్లో కూడా భూ ఆక్రమణ పోరాటాలన్నీ కౌలు రైతుల పోరాటాలనే రచయిత అనుకుంటున్నారా? వేలాది ఎకరాల్లో పాతిన ఎర్రజండాలు, కొంతకాలం పాటైనా సాగు చేసుకున్నది వ్యవసాయ కూలీలు, పేదరైతులే. ఇందులో పెద్ద ఎత్తునే (బహుశా 90-95 శాతం)

దళితులు, ఇతర 'కింది స్థాయి' కులాలకు చెందిన వారున్నారు. అయితే భూస్వాములు తమ భూములకు కనీసం ధరలు పొందడం కోసం మధ్య తరగతి రైతులకు అమ్ముకోవటం కూడా జరిగింది. నిర్బంధాన్ని ఆసరాగా తీసుకొని భుములను ఆక్రమించుకున్న వ్యవసాయ కూలీలు, పేద రైతాంగం (చాలా సహజంగానే పెద్ద సంఖ్యలో దళితులు) వద్ద నుండి ఈ భూములు మధ్య తరగతి రైతాంగం చేతిలోకో పాత భూస్వాముల స్థానంలో కొత్తగా రాజకీయ పలుకుబడి, కాంట్రాక్టుల సాయంతో నవీన భూస్వాములుగా అవతరించిన వారి చేతుల్లోకో కూడా పోయాయి. ఇక్కడే రాజ్యాధికారానికి, ఇటువంటి పోరాటాల ఫలితాలు శ్రామిక వర్గాల చేతుల్లోనే ఉండడానికి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. అది పారిశ్రామిక రంగ కార్మిక వర్గానికైనా వర్తించే సూత్రమే. ఈ వాస్తవాలను రచయిత పూర్తిగా ఏమరిచారు. అందుకే 'దున్నేవానికే భూమి నినాదం ఆచరణలో విఫలం' అని నిర్ధారణకు వచ్చారు.

వ్యవసాయ సంక్షోభం :-

ఇది వరకే రాసినట్టు వ్యవసాయ సంక్షోభం లేదా రైతు సంక్షోభం గురించి ఈ పుస్తకంలో చాలా వివరాలున్నాయి. అందుకు రచయిత అభినందనీయుడు. 'అగ్రికల్చర్' అగ్రి బిజినెస్- గా మారి/మారుతూ బహుళ జాతి సంస్థలు/బడా పెట్టుబడిదారుల సంస్థల దోపిడీకి మొత్తంగా వ్యవసాయ రంగం, ముఖ్యంగా ఆ మార్పుకు అనుగుణంగా గ్రామీణ దళారులుగా వ్యవహరించగలిగే కొందరు తప్ప మిగిలిన రైతులు ఎలా గురవుతున్నారో వివరించారు. (వాణిజ్య పంటలు, నీటి పారుదల, విత్తనాలు, ఎరువులు-పురుగుల మందులు, రుణపాశం, మార్కెట్ వంటి అధ్యాయాలన్నీ ఈ దోపిడీని వివరించడానికి ఉపయోగపడేవి. ఆ దోపిడీ వివరాలను రచయిత తన మూల నిర్ధారణకు (వ్యవసాయ పెట్టుబడిదారీ విధానం) మద్దతుగా వాడుకోవడానికి ప్రయత్నించారనే విషయం వదిలేస్తే విడి వాస్తవాలు మాత్రం స్థూలంగా సరియైనవే.

చెల్లింపుల సంక్షోభమే రైతు సంక్షోభం అన్న ఉపశీర్షికలో ముడి సరుకుల అధిక ధరల వల్ల దోపిడీనే కాక, వస్తు వ్యామోహ సంస్కృతి వ్యాపింపజేసి వ్యవసాయంలో మిగులు వ్యవసాయంలో మళ్లీ మదుపులా మారకుండా ఎం.ఎన్.సి.లు, బడా దళారీ పెట్టుబడిదారుల దోపిడీ కారణమవుతుందో వర్ణించారు.

అయితే సంక్షోభానికి సంబంధించి 'సాధారణంగా ఒక ఉత్పత్తి రంగ సంక్షోభం అనగానే దాని మౌలిక కార్యం అయిన ఉత్పత్తి తగ్గుదల, ఉత్పత్తి పెరగకపోవడం కారణాలుగా ఉండాలి'- అని చేసిన సూత్రీకరణ సరియైంది కాదు. పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభం అంటే 'అధిక ఉత్పత్తి' సంక్షోభమే.

మరికొన్ని ప్రశ్నలు:- ఎన్. పి. కె లను 4:2:1 నిష్పత్తిలో వాడాల్సి ఉండగా భారత రైతులు 6.8:2.8:1 నిష్పత్తిలో వాడటం వల్ల పంటల ఉత్పాదకత తగ్గడానికి కారణమవుతుందని అందువలన ఇలాంటి అంశాలపై రైతులను చైతన్యం చేయవలసింది పోయి సబ్సిడీలు తగ్గించకూడదని ఆందోళనలు చేయటం తప్పని రచయిత అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వం యూరియా మీద మాత్రం సబ్సిడీ కొనసాగించి భాస్వరం, పొటాష్‌ల పై సబ్సిడీలు తీసివేసింది. ఇది ఎన్. పి. కె. ల సమతుల్య వాడకాన్ని దెబ్బతీసి నేల సారాన్ని, ఉత్పాదకతను దెబ్బతీస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఎరువుల పారిశ్రామిక వేత్తలు కూడా మొత్తుకున్నా గ్యాట్ ఒప్పందం, డబ్ల్యూ. టి. ఓ, ప్రపంచబ్యాంకుల ఒత్తిడికి తల ఒగ్గి భారత ప్రభుత్వం తప్పుడు సబ్సిడీ పాలసీని రూపొందించినందువల్లే తమకు అందుబాటులో ఉన్న నత్రజని ఎరువులను మాత్రమే రైతులు ఎక్కువగా వాడారు. దానివల్ల భూసారం కూడా తగ్గిపోయి ఎరువుల వాడకానికి అనుగుణంగా పంట దిగుబడి పెరగలేదు. సబ్సిడీల కోసం ఆందోళన, ఎరువుల వాడకం పట్ల సరియైన అవగాహనకు పోటీ పెట్టడం అందుకే సరియైంది కాదు.

మరో అనుమానం:- పుస్తకం 322వ పేజీలో దేశవ్యాప్త లెక్కలను పరిశీలించినపుడు 1961లో మొత్తం వ్యవసాయ కూలీల్లో దళిత వ్యవసాయ కూలీల శాతం 34.48 కాగా 2001 కి 52.23 శాతానికి ఎగబ్రాకింది అని రాసారు. అదే పేజీలో శ్రీకాకుళం గురించి రాస్తూ 1971లో 23.63 శాతం ఉండగా 2001 నాటికి 10.02 శాతానికి తగ్గింది అని రాసారు.

ఇవి నమ్మదగిన అంకెలు, నిర్ధారణలేనా? వాస్తవమే అయితే శ్రీకాకుళంలో మాత్రం ఇంత పెనుమార్పుకు కారణమేంటి? రచయిత ఏ వివరణ ఇవ్వలేదు.

ఈ పుస్తక ప్రాధాన్యత:-

వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం నెలకొన్నదనే రచయిత నిర్ధారణతోనూ, 'దున్నేవానికి భూమి' అనే నినాదం స్థానంలో భూమి జాతీయాకరణ కార్యక్రమం తీసుకోవాలనే రచయిత అభిప్రాయంతో ఏ మాత్రం అంగీకరించలేం కానీ, వ్యవసాయ సంక్షోభానికి సంబంధించి పంటల మార్పులు, యాంత్రీకరణ, ఎరువులు, పురుగుమందులు, విత్తనాల వాడకం, వాటి వెనకాల ఉన్న కంపెనీల పాత్ర, మార్కెట్‌తో ముడిసరుకుల విషయంలో కానీ, పంటల అమ్మకాల విషయంలో కానీ, పెరిగిన సంబంధాలను, కౌలు, రుణాలు, పట్టణాలకు వలసలు, పట్టణీకరణ వంటి విషయాలన్నింటినీ సమాజంలో సమూల, విప్లవాత్మక మార్పులకు పోరాడే విప్లవ పార్టీలు తమ ఎత్తుగడలను రూపొందించు కోవడం కోసం, రైతాంగాన్నీ, వ్యవసాయ కూలీలను పోరాటాల్లో సమీకరించడానికి తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. ఆ కోణంలో గ్రామీణ ఆర్థికంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవటానికి ఈ పుస్తకం చాలా తోడ్పడుతుంది.

'గ్రామాల్లో సాంప్రదాయ భారీ భూ యజమానుల' (భూస్వాముల) సంఖ్య తగ్గిపోవడం, కంట్రాక్టు వ్యవసాయం, అనుపస్థిత భూస్వామ్యం తోటల పెంపకం, శ్రామికుల వలసలు వంటివి పెరగటం -ఇట్లాంటి పెనుమార్పుల నేపథ్యంలో రైతుల సంఘాలు, కూలీల సంఘాలు ఏ సమస్యలను చేపట్టి పోరాటాలు, ఏ రూపాల్లో చేపడుతూ నూతన ప్రజాస్వామిక విప్లవంలో అంతర్భాగం చెయ్యాలనేది విప్లవ ప్రజా సంఘాలకు ఒక సవాలు. ఆ కోణాల్లో ఆలోచించడానికి కావలసిన సామాగ్రిని ఈ పుస్తకం ఇస్తుంది.

(రచయిత : మావోయిస్టు రాజకీయ ఖైదీ)

'పాప పుణ్యాల'ను పరిహసించిన సల్తికోవ్‌శ్చెడ్రీన్

- ఎన్.వి.ఎస్. నాగభూషణ్

పాలకవర్గం ప్రజలపై అధికారాన్ని చెలాయించడానికి దోపిడీ రాజ్యయంత్రాన్ని ఉపయోగిస్తుదనేది తెలిసిందే. ఈ రాజ్యయంత్రంలో నిర్బంధ యంత్రాంగం (పోలీసులు, న్యాయస్థానం, జైళ్లు వగైరా)తో పాటు, సాంస్కృతిక యంత్రాంగం (మతం, దేవుళ్లు, పురాణాలు, పూజలు, తిరునాళ్లు వగైరా) కూడా ఉంటుంది. ఈ సాంస్కృతిక యంత్రాంగం విశిష్టత ఏమంటే, ఎలాంటి నిర్బంధం లేకుండానే, దీని సాయంతో పాలక వర్గం ప్రజలపై తమ దోపిడీ పాలన సాగించవచ్చు. అందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరిస్తారు! ఈ సాంస్కృతిక యంత్రాంగంలోని పనిముట్లే పాపపుణ్యాలనే భావాలు. కేవల భావాలుగా ఉన్న వీటిని పాత్రలు తీసుకుని, వీటి స్వరూప స్వభావాల్ని, ఇవి ఎలా మనుషుల్ని వంచించేదీ, స్వార్థపరులు వీటిని ఎలా ఉపయోగించుకునేదీ విశ్లేషిస్తూ తన అద్భుత వ్యంగ్యవైభవంతో కథగా రూపొందించి, మన మనస్సుల్ని కట్టిపడేశాడు ప్రపంచ ప్రసిద్ధ వ్యంగ్య కథకుడు సల్తికోవ్‌శ్చెడ్రీన్. రష్యన్ కథకుడూ, పత్రికా సంపాదకుడూ అయిన ఈయన తన రచనా శక్తినంతా పాఠకుల్ని కడుపుబ్బ నవ్వించడంతో పాటు, చైతన్య పరచడానికి వెచ్చించాడు. ఇందంతా విప్లవానికి పూర్వం 19వ శతాబ్ది ద్వితీయార్ధంలో ప్రజల్ని విప్లవం వైపుకి మళ్లించేందుకే. ఇప్పుడు చూడండి, పాపపుణ్యాలు అనేకథలోని ముఖ్యాంశాలు...

పాప పుణ్యాలు తగూపడి ఎప్పుడు విడపోయాయో తెలీదుగానీ, అప్పట్నుంచీ పాపాలు తెలివిగా మసలుతూ, సుఖజీవనం సాగిస్తున్నాయి. పుణ్యాలకు మాత్రం జీవనం సాగించడమే దుర్భరంగా వుంది. అయితేనేం, బాలశిక్షల్లోనూ, నాటకాల్లోనూ వాటికి మంచి కీర్తి వుంది. అయినా, 'అయ్యో, మనం కూడా పాపాల్లాగే సుఖంగా బతికేందుకు ఏదైనా చేస్తే ఎంత బాగుండును?' అని అప్పుడప్పుడూ అనుకొనేవిగానీ, ఆ పని మాత్రం చెయ్యలేకపోయేవి.

అసలు వారిలో వారికి తగూ ఎందుకొచ్చిందో, దీన్నెవరు మొదట మొదలెట్టారో చెప్పడం కష్టం. బహుశా తొలుత పేచీపెట్టింది పుణ్యాలేకావచ్చు. అయితే పాపాలకిప్పుడు మంచి పలుకుబడి వుంది. పట్టుపీతాంబరాలతో నగలతో లోకాన్ని చుట్టబెడుతుండటం చూసి, పుణ్యాలకు చాలా మనస్తాపం కలిగింది.

'ఒరే దగాకోరూ! నీపట్టు పీతాంబరాలతో ఎంత కాలం కులుకుతావులే! ఎప్పటికైనా చింకిపాతలు కట్టిన మమ్మల్నే ప్రజలు గౌరవిస్తారు' అంటూ పాపాల్ని శాపనార్థాలు పెట్టేసరికి, 'తథాస్తు అలాగే గౌరవాలు పొందండి' అన్నాయి పాపాలు.

దీంతో పుణ్యాలకు ఒళ్లుమండి, చింకిపాతల, జీబుజుట్టుతోనే వీథిలో నిలిచి, దార్లోపోయేవాళ్లతో", ఇదుగో మీరంతా బుద్ధిమంతులు, మేం చింకి పాతలతో ఉన్నప్పటికీ, మీరంతా మమ్మల్నే అభిమానిస్తున్నారు, కాదా? నిజంచెప్పండి' అంటూ ఊదరపెట్టాయి.

'మీ గొడవ ఎక్కువైందిగానీ, దారిలో అడ్డుతొలగండి' అని దారిన పోయే వాళ్లు అనేసరికి, పుణ్యాలు న్యాయస్థానాలకు విన్నపాలు పంపుకోడమేగాక, తమ రక్షకులైన పోలీసుల్ని కదిలించి, 'మీ కళ్లెక్కడున్నాయి? ప్రజల కళ్లాలు విడిచిపెట్టేస్తే ఎలా? వాళ్లు పాపకూపంలో పీకలబంటి మునిగిపోతున్నారని తెలుసా?' అని ప్రశ్నించాయి. కానీ పోలీసులు ఉలకలేదు, పలకలేదు సరికదా, పాపాల్ని చూసి శాల్యూట్ కూడా చెయ్యడం చూసి పుణ్యాలు బెదిరాయి. 'ఉండండుండండి, ఇంతకింతా అనుభవిస్తారు' అని శాపాలుపెట్టాయి. అప్పట్నుంచీ పాపాలు మరింత వీరవిహారం చెయ్యసాగాయి. ఈ విధంగా రోజురోజుకూ వైషమ్యం ముదురుతూ, ఒక్కోరోజు తన్నులాటకూ దారితీసి, పుణ్యాలను మెత్తగా తన్ని, వాటిని సంకెళ్లతో కూడా బందీ చేసేవి. కొత్త అధికారులు వచ్చేదాకా పుణ్యాలు అలాగే బందీలుగాపడి వుండాల్సి వచ్చేది. ఒకరోజు దారిన పోయే పరమానందయ్య వీటి తగాదా చూసి' ఏమిటి మీరు చేసే తెలివితక్కువ పని? మొదట మీరంతా ఒకేలా వుండే గుణాలు మాత్రమే. ఆ తర్వాత మనుషుల లోభ మోహాలవల్ల మీ మధ్యచీలిక వచ్చింది. కొన్ని గుణాల్ని అణిచి, మరికొన్నింటికి స్వేచ్ఛనిచ్చారు. దాంతో అంతా తలకిందులైంది. కనుక మీరంతా ఆదికాలం పరిశీలిస్తే, మీలో ఐక్యతనెలకొంటుంది' అని బుద్ధిచెప్పి తనదారిన తాను వెళ్లిపోయాడు.

దీంతో అవి కత్తులు వదేసి, ఆలోచనలోపడ్డాయి. 'పరమానందయ్య గుణాలు చెప్పాడు బాగానేవుంది. కానీ ఈ గుణాల సంగతి వాడికెంత తెలుసో మనకీ అంతే తెలుసు' అంది వినయం. 'పట్టుబట్టలు తొడిగి కొన్ని గుణాలు దర్జాగా తిరుగుతుంటే, మరికొన్ని గుణాలు ఆకలికి నకనకలాడాల్సి వస్తుంది. ఆ పరమానందయ్యగాడు బాగా మెక్కి బాగనే చెబుతున్నాడు' అంది మర్యాద.

'అసలు వాడి మాటలు మతిమాలినవిలా కనబడ్డం లేదూ? పాపాలు పాపాలే! వందలవేల సంవత్సరాల నుండి అవి అలాగే ఉన్నాయి. ఈ విషయాన్ని వేలాది గ్రంథాలు కూడా రాశాయి. ఆ పుస్తకాలు తీస్తే తెలుస్తుంది సంగతేమిటో!' అంది మర్యాద మళ్లీ. కొంతసేపు సిద్ధాంత చర్చల జరిపిం తర్వాత మర్యాద మాటలు అక్షరాలా నిజమని అవి నిర్ణయించాయి. ఎన్నో వందల శతాబ్దాల నుంచి పాపాలు పాపాలుగా, పుణ్యాలు పుణ్యాలుగానే ఉన్నాయి. ఈ సంగతి మహా మహులు కాగితాలు కొండలు, సిరా సముద్రాలు ఖర్చుపెట్టి, వేలాది గ్రంథాల్లో రాశారు. ఇప్పుడు హఠాత్తుగా మూర్ఖుడి మాటలునమ్మి అంతటినీ కొట్టి కేవలం గుణాల్ని మాత్రం మిగిల్చడం, మనిషి అంతరువుని, హోదాని తీసేసి, కేవలం 'మనిషి' అనడం ఎంతచెడ్డదో, అంతచెడ్డది! ఏమైనా ఈ గుణాలు గురించి ఆలోచించడం మనేసి, ఏదో రాజీకి రావడం మంచిదే. పాపాలు కూడా అప్పుడప్పుడూ చిక్కుల్లో పడుతున్నాయి కదా! మొన్ననే 'లోభం'

కన్నంలో దొంగలా దొరికిపోయేసరికి, దానిమీద కేసుపెట్టారా! ఆ రాత్రే 'వ్యభిచారా'న్ని దిగంబరంగా మేడనుంచి తోసేశారు! అలాగే 'స్వేచ్ఛాలోచన' పని మొన్నటిదాకా పచ్చగా ఉండేది. ఇప్పుడు దాన్నీ కూకటి వేళ్లతో కుళ్లగించేశారు! అందువల్ల ఏదో బేరానికి దిగడం పాపాలకు మంచిది 'కనుక ఈ విషయంలో పెద్దల సలహా ఏమిటి?' అని ప్రశ్నించాయి.

ఈ ప్రశ్నకు మునలివగ్గు 'అనుభవం' (దీంట్లో రెండు రకాలున్నాయి. ఇది పుణ్యాలకు చెందిన అనుభం) ఇలా ప్రతిపాదించింది; 'పుణ్యాలకు గౌరవ పాత్రుడు, పాపాలకు ఆమోదయోగ్యుడు అయిన ఒక రత్నాన్ని వెతికి, అతనికి నంది పతాకాన్నిచ్చి, శత్రు శిబిరానికి పంపండి!' పుణ్యాలన్నీ వెతికి మితవాదిని, చండశాసనులని పట్టుకున్నాయి. వీరు దిక్కూ దివాణంలేని అనాథలు. రేపు సారా అమ్ముతూ పాపాలతో లావాదేవీలు కలిగి ఉన్నారు. అంత అందగత్తెలూ, జారలూ కాని ఈ రెండూ పాపాల శిబిరంలోకి అడుగుపెట్టి, మెల్లగా వచ్చినపని చెప్పేసరికి, అవి వాటిమీద విరుచుకుపడి పోపొమ్మన్నాయి. అంతేగాక, తాము ఇలాంటి సంధి బేరాలకు లొంగేబాపతు కాదని చెప్పడం కోసం, ఆ రాత్రి పాపాలన్నీ కలిసి 'సమర్కండ్' హోటల్లో విందులూ, వినోదాలతో గడపడమేగాక, హోటల్నుంచి పోతూపోతూ, 'వ్రతాన్నీ', 'మానాన్నీ' పడేసిపట్టి, నానా అల్లరి చేశాయి. పాపం ఇద్దరమ్మాయిల్నీ అవి చేసిన ఆగాన్ని వర్ణించి చెప్పడం కష్టసాధ్యం. ఆఖరికి ఆ హోటల్లోని తాతార్‌ఖానులు కూడా జుగుప్సతో ముక్కుమీద వేలేసుకున్నారు. దీంతో పరిస్థితులు విషమించాయి. పుణ్యాలు గుర్తించి, వ్యవహారాన్ని తేల్చెయ్యాలనుకున్నాయి. ఇంతలో వారిలోంచి ఒక నపుంసక లింగం ఉద్భవించింది. పుట్టడంతోటే పెరిగి పెద్దదయింది. దానిపేరు 'కపటం'

దీని పుట్టుక నుంచి ప్రతిదీ రహస్యమే. ఒకప్పుడు 'నిష్ఠ' - 'కామం' చీకటి తప్పుచేసిన ఫలితమే ఈ బిడ్డ అని వృద్ధుల ఉవాచ. ఈ బిడ్డను పుణ్యాలన్నీ కలిసి సాకాయి. దీన్ని గొప్పింటి బిడ్డల కోసం శ్రీమతి 'దాంబికం' నడిపిస్తున్న పాఠశాలలో చదివించాయి. ఆ పాఠశాలలో కపటం అన్ని విద్యల్నీ కూలంకుషంగా అభ్యసించింది. తైరుకొట్టడం, చెవులు కొరకడం లాంటి శీలాల్ని అలవరచుకొంది. మిడిసిపాటు నృత్యంలో నిపుణురాలైంది. అంతేగాక, శ్రీమతి దాంబికం కపటానికి ఆ పిల్ల తల్లిదండ్రుల రహస్యాలన్నీ చెప్పేసింది. మీ అమ్మ 'కామం' విలాసాలకి పెట్టింది పేరు. కనిపించిన వారినల్లా కుట్టందే ఊరుకోదు. అయితే మీ నాన్న 'నిష్ఠ' అందగాడు కాదుగానీ, ఎవరైనా పొడిచినప్పుడు అతడు వేసేకేక మాత్రం చాలా అందంగా వుండేదని ఆ ప్రిన్సిపాల్ చెప్పింది.

ఈ విధంగా తరిఫీదు పొందిన కపటాన్ని రాయబారిగా ఎంచుకొన్నాయి. కపటం ఎవర్నీ కన్నెత్తి చూడకపోయినా, దాని కడకంటి చూపులోంచి కామం తళుకుమంటూండటం గమనించిన పుణ్యాలు, పాపాలకూ తమకూ అదే సంధి కుదర్చగలదంటూ భావించాయి.

రాయబారిని సరిగ్గా పరీక్షిస్తే తప్ప లాభం లేదనుకొన్నా 'ధైర్యం' , 'నువ్వు మా మాదిరిగా ఎలా నడుచుకొంటావు?' అని ప్రశ్నించింది. 'ఏమిటి ఈ ప్రశ్నలన్నడుగుతున్నారు? 'అని ఆశ్చర్యపడ్డ కపటం 'ఇలాగా' అంటూ బుగ్గలు ఎర్రపడగా చేతులు కట్టుకు నిలిచింది. శుద్ధ అమాయకురాలైన ముగ్ధలా కపటాన్ని చూసి, ఇంతకన్నా ఏం కావాలి అనుకున్నాయి పుణ్యాలు.

'సరే, పాపాల్లో ఎలా ప్రవర్తిస్తావు?' అనడిగింది ధైర్యం. కపటం నోటితోగాక, చేతలతో జవాబిచ్చింది. అయితే అది ఏం చేసిందో ఎవరికీ తెలీలేదు. ఒక్క'నిశితదృష్టి' మాత్రమే దాన్ని కనిపెట్టి, జుగుప్సతో కుంగిపోయింది. దీంతో పుణ్యాలన్నీ సంతృప్తిపడ్డాయి.

కపటం పాపాల నగరానికి ప్రయాణమై, 'ఈ కుళ్లు చాలా దూరం వ్యాపించిందే' అని ప్రకాశంగా అని, 'పాపాల జీవితం ఎంతహాయిగా వుంది' అని స్వగతంగా మెచ్చుకొంది. పాపాల నగరం ఎంతో అందంగా, విశాలంగా, బారులుతీరిన దీపాలు, ఉద్యానవనాలు, కూటసాక్ష్యాల వీధి, అప్రతిష్ఠ రోడ్డుతో ఎంతో ఆహ్లాదంగా వుంది. అక్కడ అబద్ధయ్య దుకాణం వుంది. అందులో అతడు అపవాదుల్ని టోకుగానూ, చిల్లరగానూ అమ్ముతుంటాడు.

కపటాన్ని చూసి, జిత్తుల్లో ఆరితేరిన పాపాలుకూడా బిత్తరపోయాయి. ముగ్ధలాగా వుందిగాని నిజంగా ముగ్ధేనా అన్న అనుమానం. అవునో కాదో ఆ దేవుడిక్కూడా తెలీదు. కల్మషంలో తనకు దీటులేదని గర్వించే అబద్ధయ్య కూడా అలా కళ్లప్పగించి, 'ఇది అసలైన విషప్పుచ్చె. నాదంతా ముక్కుసూటి వ్యవహారం. అందుకనే అప్పుడప్పుడూ నాలుగు తాపులూ, మూడు హెచ్చరికలూ తగులుతూంటాయి. కానీ కపటం తగులుకోందా, నిలువునా చీల్చినా, చీల్చిపేసినా, విడిచిపెట్టడం వుండదు' అనుకొన్నాడతడు.

కపటం గారి ఆగమనంతో ఎంతో ఉత్సాహం కలిగినప్పటికీ, సంప్రదాయానికి ఎక్కువ విలువనిచ్చే పెద్దలు 'వితండం', 'డంబం', 'అసూయ'లాంటి వారు ఆమెకు స్వాగతం చెప్పలేదు సరిగదా, 'నిజమైన పాపానికి మర్మం అవసరం లేద'ంటూ హెచ్చరికలు కూడా చేశారు.

'ఇదేదో మన మీద ధ్వజం ఎత్తి వచ్చినా దీనికి మనకన్నా ఎక్కువ విద్యలే తెలుసల్లేవుంది. పైగా ఇది మన వాదాలను మన మీదికే తిప్పే ప్రమాదం వుంది. దీనివల్ల మన అనుయాయులు, నిజంగానే పాపాలు హెచ్చు పెరిగాయని చెప్పి, మనల్ని వదిలిపెట్టి దిక్కులేని వారిగా చేసిపోవచ్చు' అని హెచ్చరించాయి. వీరిలాగానే 'దగా' , 'ద్రోహం', 'మోసం', 'కొండెం' వగైరాలు కూడా కపటానికి స్వాగతం చెప్పకపోయినా, కళ్ళు మాత్రం గీటాయి. ఇవి ఇంతకు ముందే, కపటం సహాయం తీసుకుండానే, పుణ్యాలతో లావాదేవీలు పెట్టుకొన్నాయి.

ఏమైనా కపటం రాయభారం ఫలించేట్లే వుంది. ఎందుకంటే, 'కామం', 'మోహం', 'మదం', 'మధుపానం' వగైరాలు దానికి అపూర్వరీతిలో స్వాగతం చెప్పాడు. దాంతో 'వితండం' అంతటి వాగుడు కూడా విధిలేక కట్టిపెట్టాల్సి వచ్చింది.

'ఇదుగో మునలి వెధవల్లారా! మీరు ప్రజల్ని ఊరికే పీడించడమేగాక, మమ్మల్నికూడా సుఖంగా బతకనీయడం లేదు' అంటూ యువకులు తిట్టడంతో, అంతా సంధి షరతుల్ని ఒప్పుకొన్నారు. కపటం తిరిగొచ్చి, తన రాయబార విశేషాల్ని పుణ్యాలకు తెలియబరిచింది. ఇరువురూ శత్రుకూటాలుగా చీలివుండటం పనికిరాదని ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే

అనువాద వ్యాసం

పశ్చిమ కనుమల్లోకి ఆపరేషన్ గ్రీన్‌హంట్

ప్రజలపై రాజ్యమద్దతుతో కార్పొరేట్ ప్రాయోజిత యుద్ధాన్ని అడ్డుకుందాం

- ఫోరం అగెనెస్ట్ వార్,జె.ఎన్.యు., ఢిల్లీ

తెలుగు అనువాదం: అరుణ్

మోడీ-రాజ్‌నాథ్ ద్వయం గతంలో మన్మోహన్-చిదంబరాలు అమలు చేసిన అభివృద్ధి నమూనాను కొనసాగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయం స్పష్టంగానే కన్పిస్తున్నది. అయితే ఈ ప్రభుత్వం వాళ్ల విధానాలను మరింత క్రూరంగా, ధృడచిత్తంతో, పట్టుదలతో అమలు చేస్తున్నది. (బహుళ జాతి సంస్థల, బడా పారిశ్రామిక వేత్తల ఆకాంక్షలకనుగుణంగా, 'అభివృద్ధి' మార్గానికి అడ్డంకింగా' లేక 'వ్యతిరేకంగా' ఉన్న అన్ని రకాల ఉద్యమాలను మన నూతన 'ఉక్కు మనిషి' మోడీ అణచివేయాలనే పట్టుదలతో ఉన్నాడు). ఈ పంథా తిరిగి ఏమాత్రం పునరుద్ధరించుకోడానికి అవకాశం లేని పర్యావరణ వినాశనానికి దారి తీస్తుంది. ప్రజలు నిరాశ్రయులు కావడానికి, ప్రజల మారణహోమానికి దారి తీస్తుంది. గత ప్రభుత్వ విధానాలను మరింత వేగం చేయడం ద్వారా ఈ వినాశకర విధానాలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గనుల తవ్వకానికి పరిశ్రమలకు, సెజ్‌లకు భూసేకరణ విషయంలో నేదున్న అన్ని నియమ నిబంధనలను తుంగలో తొక్కబోతున్నారు. లాభాలు, దోపిడీనే ధ్యేయమైన ఈ ప్రజావ్యతిరేక పర్యావరణ విధ్వంస 'అభివృద్ధి' నమూనాకు వ్యతిరేకంగా జరిగే ఎలాంటి ఉద్యమాన్నయినా తీవ్రంగా అణచివేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. నేడు మధ్య, తూర్పు భారతంలో కొనసాగుతున్న 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను మరింత తీవ్రం చేయడమే గాక కొత్త ప్రాంతాలకు కూడా ఈ కార్పొరేట్ల ప్రాయోజిత యుద్ధాన్ని విస్తరిస్తున్నారు.

పశ్చిమ కనుమలపై కార్పొరేట్ దేశాల, భారత ప్రభుత్వం కన్ను:

దేశంలో అత్యధిక సంఖ్యలో ప్రత్యేక ఆర్థిక మండలాలున్న (సెజ్) ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. అందులోనూ పర్యావరణపరంగా చాలా ప్రాధాన్యత ఉన్న ప్రాంతం పశ్చిమ కనుమలు. అందుకే మహారాష్ట్ర ఎన్నికల సందర్భంలో, మోడీ తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సెజ్‌లలో పన్నులకు సంబంధించిన అన్ని ఆటంకాలను తొలగిస్తానని పెట్టుబడిదారులకు హామీలు గుప్పించాడు. పై విధానాల అమలులో అడ్డువచ్చే నిబంధనలను అధ్యయనం చేయాలని తాను సంబంధిత శాఖ మంత్రిని కోరానని మహారాష్ట్రలో ఏర్పాటు చేయబోయే 'సెజ్' శంకుస్థాపన సమయంలో మోడీ సగర్వంగా చెప్పాడు. ఆ సమయంలో 'పశ్చిమ కనుమల'పై డాక్టర్ మాధవ్‌గాడ్గల్ నివేదిక విషయమేమిటని మోడీని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశ్నించాడు. దానికి సమాధానంగా 'పాత జబ్బుంది కొత్త డాక్టర్ల వైద్యం' చేస్తారన్నాడు. ఆ 'పాత రోగమేమిటో', కొత్త డాక్టర్లు ఎవరో?' డా.మాధవ్‌గాడ్గల్ నివేదిక చదువుతేనే అర్థమవుతుంది.

పశ్చిమ కనుమలు - ఎదుర్కొనే సమస్యలేమిటి?

భారతదేశ నైరుతి తీరం వెంట దాదాపు 1,600 కిమీ. ప్రాంతంలో హిమాలయ పర్వతాల కన్నా పురాతనమైన పశ్చిమ కనుమలున్నాయి. ఈ కనుమలు ప్రపంచంలో 'జీవవైవిధ్యాని'కి ప్రఖ్యాతి చెందిన 10 ప్రాంతాలలో ఒకటి. ఈ మధ్యనే యునెస్కో వాటిని 'ప్రపంచ వారసత్వ సంపద'గా గుర్తించింది. ఈ కొండలు 1,60,000 కి.మీ. ప్రాంతం వ్యాపించి ఉన్నాయి. అందుకే గాడ్గిల్ నివేదిక ఈ పర్వత శ్రేణులను 'భారత ఉపఖండపు జలశిఖరం' అని పేర్కొంది. ఈ ప్రాంతంలో 7,400 రకాల పూల మొక్కలు, 139 రకాల పాలిచ్చే జంతువులు, 500 రకాల పక్షులు, 288 రకాల మంచినీటి చేపలు ఉన్నాయి. అంతేగాక, ఇంకా గుర్తించని, వెలుగులో రాని ఎన్నో జీవరాసులూ ఉండే అవకాశముంది. ఈ ప్రాంతం

పాతపేర్లను మాత్రం రద్దుచేసుకోవడానికి ప్రయత్నించలేదు ఎవరూ. ఏమో ఏ కాలానికి ఎలా వుంటుందో! ఈ ఒప్పందం ఎంతకాలం నిలుస్తుందో!

ఇక అప్పట్నుంచీ పుణ్యపాపాలు పరస్పర ఆదరభావంతో మెలగసాగాయి. అవినీతికి నిష్టతో కాలక్షేపం చెయ్యాలని బుద్ధిపుట్టినప్పుడు, కలపటాన్ని తోడు తీసుకువెళ్లేది. వారిని దూరాన్నించి చూడగానే నిష్ఠ ఎదురేగి, 'దయచేయండి దయచేయండి, నిన్ననే మీ ప్రస్తావన వచ్చింది' అంటాడు.

లేకపోతే నిష్టకు అవినీతికి అతిథిగా వెళ్లాలనుకున్నప్పుడు, తానవెంట తీసుకవెడతాడు. అప్పుడు అవినీతి వారికి ఎదురేగి, భుజంపై చెయ్యేసి, 'దయచేయండి, దయచేయండి. నిన్ననే తమ ప్రస్తావన వచ్చింది' అంటుంది.

ఉపవాస వ్రతాలు చేసేప్పుడు వారు ఒకరికొకరు విందులు చేసుకొంటూంటారు. వ్రతాన్ని విరమించినప్పుడు నిషిద్ధాహారం తీసుకుంటారు. ఒక చేత్తో పూజలు చేస్తూ, మరోచేత్తో మహాదారుణ కృత్యాలు సాగిస్తుంటారు. ఒక కన్ను ఆముష్మికం మీద, మరోకన్ను ఐహిక భోగాల మీద. పుణ్యాలు తమ జీవితంలో మొదటిసారి విందుభోజనాలు చేస్తున్నాయి. అంత మాత్రంచేత పాపాల స్థితిఏమీ తరగలేదు. 'మన జీవితంలో ఇంత పసందైన విందులు ఎరగం' అని పుణ్యపాపాలు అనుకుంటున్నాయి.

ఇక పాపం పరమానందయ్యకి అసలు విషయం తెలీలేదు. పుణ్యాలు పాపాలు గుణాలు కదా! అలాంటప్పుడు తమ మొదటి రూపాన్ని తెలుసుకొని సఖ్యత సంపాదించడానికి బదులు, కపటం ద్వారా ఎలాస్నేహంగా ఉంటున్నాయో అని ఆయన పరమాశ్చర్యంలో తెల్లబోతూ వుంటాడు!

దేశంలో కేవలం 5%గా ఉన్నా. దేశంలో ఉన్న వృక్షాలలో 27% రకాలు ఇక్కడే ఉన్నాయి. చారిత్రకంగా, ఈ కనుమలు దట్టమైన అడవులతో బయటి ప్రాంతం వాళ్లు చొరబడే అవకాశం ఉండదు. లక్షలాది ఆదివాసులకు కోటారు, బడగాలు, కురుంబాయి, సోలిగలు, సిద్దులు, వైనాడుకు చెందిన పానీయాలు, అడియాలు, కతినాయకులు, కురుమలు, గోవాకు చెందిన గౌడ్‌లు, వెలిపురు, ధనగర్‌లు కున్బీలు, ఉత్తర పశ్చిమ కనుమల ప్రాంతాలకు చెందిన భిల్లులు, వర్లీలకు ఈ పర్వత శ్రేణులే కూడు, గూడునిస్తున్నాయి. వీరంతా ఎన్నో శతాబ్దాలుగా ఈ కనుమల్లో జీవిస్తున్నారు. అద్భుతమైన జీవ వైవిధ్యానికి నిలయమైన ఈ ప్రాంతం. ఇక్కడి ప్రజల సహకారంతో ఇప్పటికీ సజీవంగా ఉంది.

గాడ్గిల్ కమిటీ నివేదిక – నిష్పల ప్రయత్నం

పశ్చిమ కనుమల పర్యావరణానికి, అక్కడి ప్రజలకు జరుగుతున్న ప్రమాదం నేటిది కాదు. అది వలస పాలనలో బ్రిటిష్ వాళ్లు ప్లాంటేషన్, కలప కోసం అడవులను భారీగా నాశనం చేసిన కాలం నుండే పశ్చిమ కనుమలకు పెను విపత్తు ప్రారంభమయింది. ఆ క్రమం 1947 తర్వాత కూడా కొనసాగగా నేటి 'అభివృద్ధి' పాలనలో అడవుల విధ్వంసం మరింత వేగవంతమవుతున్నది. ఆ భయాందోళనల వల్లనే గత ప్రభుత్వం పశ్చిమ కనుమల ప్రాంతంలో పుట్టగొడుగుల్లా నిర్మాణమవుతున్న 'అభివృద్ధి ప్రాజెక్టుల' దుష్ప్రభావాల అధ్యయనంపై గాడ్గిల్ నేతృత్వంలో ఒక నిపుణుల కమిటీ నియమించింది. ఆ కమిటీ, వివిధ జల విద్యుత్ కేంద్రాల, గనుల అణు విద్యుత్ కేంద్రాల, గనుల మాఫియాల వల్ల కలిగే విషప్రభావంపై విస్తృత అధ్యయనం చేసింది. గోవాలో 2009లో 12.1 మిలియన్ మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం వెలికి తీయగా, 1992 నాటికి అది 41.1. మిలియన్ టన్నులకు చేరింది. గత 5 ఏళ్ళలోనే గోవాలో 20 మి మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజం తవ్వితీసారు. అందులో 10 మి. మెట్రిక్ టన్నుల వెలికితీత చట్ట వ్యతిరేకమే. అలా వెలికితీసిన ఖనిజం 100% విదేశాలకు ఎగుమతి చేయడానికేనని గమనిస్తే నేటి 'అభివృద్ధి నమూనా' బండారం బయటపడుతుంది.

నేడు 'కొనసాగుతున్న' లేదా 'ప్రతిపాదిత' గనులు, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల వలన వ్యవసాయం, పండ్ల తోటలు, చేపల పెంపకం లాంటి సాంప్రదాయ ఆర్థిక రంగాలకు, వాతావరణానికి, తాగునీటి వనరులకు, వ్యవసాయానికి, ఆదివాసీ జీవన జీవవైవిధ్యానికి ఎంత నష్టం కలుగుతుందో ఆ కమిటీ వివరంగా తెల్పింది. అంతేగాక, ఆ ప్రాజెక్టుల సాంకేతిక సాధ్యాసాధ్యాలపట్ల తన అనుమానాలను వ్యక్తీకరించింది. భూసేకరణలో ప్రజలను ఎలా మోసగించిందీ, వారిపై ఏ విధంగా బలప్రయోగం చేసిందీ ఆ కమిటీ వివరించింది. జైతాపూర్ రైతాంగం నుంచి ఎమర్జెన్సీ నిబంధనలను అమలు చేసి భూమిని సేకరించారు. రత్నగిరి జిల్లాలో పర్యావరణ కేంద్రాన్ని నెలకొల్పుతామని ప్రజల దగ్గర భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఆ భూముల్లో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నెలకొల్పడానికి టియానా సంస్థ ప్రయత్నం చేస్తున్నది. ఫినొలెక్స్ అనే మరో సంస్థ మత్స్యకారుల, చేపల వేటను అడ్డుకుంటున్నది. సింధు దుర్గ్ జిల్లాలోని తంబిళి గ్రామస్తులు తమకు తెలియకుండానే తమ భూమి రికార్డులలో 'ఇతర హక్కుల'గా మైనింగ్ హక్కు జేర్చబడిందని చెప్పారు. అనధికార, అక్రమ మైనింగ్‌ను నిరోధించని ప్రభుత్వం.. కాలుష్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న శాంతియుత ఉద్యమాలను అణచివేస్తున్నదని ఆ గ్రామస్తులు తేల్చారు.

ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ఉండాలని, ఆ ప్రాంత ప్రజల అంగీకారానికి, పాత్రకు ప్రాధాన్యమిస్తూ కాలుష్యరహిత అభివృద్ధికి దోహదం చేసే చర్యలను మాత్రమే చేపట్టాలని గాడ్గిల్ కమిటీ స్పష్టంగా పేర్కొంది. అంతేగాక, పశ్చిమ కనుమలను పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతంగా ప్రకటించాలని సిఫార్సు చేసింది. ఇది నేటికీ 'అభివృద్ధి నమూనా' సమర్థులకు మింగుడపడని మాట. పశ్చిమ కనుమలను మూడు విభాగాలుగా పర్యావరణ సున్నితమైన ప్రాంతాలుగా(జోన్లు) విభజించారు. మొదటి జోన్‌లో నూతనంగా ఎలాంటి మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి, డ్యాంలు, పరిశ్రమలు, రైలు ఇతర మార్గాలు, ఎకోటిజం ప్రాజెక్టులను చేపట్టరాదని, కొనసాగుతున్న మైనింగ్ కార్యక్రమాలను 2016 నాటికి పూర్తిగా నిలిపివేయాలని నివేదిక కోరింది. ఇక రెండవ జోన్‌లో కూడా కొత్త గనుల తవ్వకాలను, వాతావరణాన్ని కాలుషితం చేసే పరిశ్రమలకు, డ్యాంల నిర్మాణాలకు అనుమతివ్వరాదు. ఉన్నవాటిపై కఠినమైన నియంత్రణ చర్యలుండాలి. అక్కడ ఒకే రకమైన పంటలకు, ప్లాంటేషన్లకు, క్రిమి సంహారక మందుల వినియోగం లాంటి వాటికి అనుమతివ్వకూడదు. మూడవ జోన్‌లు మాత్రం పై వాటిని అనుమతిచ్చినా, వాటిపై కఠినమైన నియంత్రణ, పర్యవేక్షణ ఉండాలని గాడ్గిల్ కమిటీ సిఫార్సు చేసింది.

గాడ్గిల్ నివేదిక తిరస్కరణ – కస్తూరి రంగన్ నివేదిక ఆమోదం 'సుస్థిరత', 'పెరుగుదల', 'అభివృద్ధి'పై ఆధిపత్యం

ఈ ప్రాంతపు జీవవైవిధ్యం, ఆ ప్రాంత ప్రజల ప్రయోజనాలను గురించిన ఆందోళనలే మోడీకి పాత రోగాలుగా కన్పించాయి. కేరళ, తమిళనాడు, కర్నాటక, గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలన్నీ గాడ్గిల్ నివేదికను ముక్తకంఠంతో తిరస్కరించాయి. కేరళ అసెంబ్లీ ఏకంగా ఆ నివేదికను రద్దు చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఇక, యుపిఎ ప్రభుత్వమైతే ఆ నివేదికను ప్రజల ముందుంచడానికి తిరస్కరించింది. ఆ నివేదికను అపహాస్యం చేస్తూ, దాన్ని సమీక్షించడానికి, అంతరిక్ష శాస్త్రవేత్త కస్తూరి రంగన్ అధ్యక్షతన ఉన్నత స్థాయి వర్కింగ్ గ్రూపును నియమించింది. అందరూ అనుకున్నట్టుగానే, కస్తూరి రంగన్ గ్రూపు అభివృద్ధి కార్యక్రమంలో ప్రజల పాత్రను తిరస్కరించింది. పశ్చిమ కనుమలలో కేవలం 30% మాత్రమే వాతావరణ పరంగా సున్నితమైన ప్రాంతమని, మిగితా ప్రాంతాన్ని యథేచ్ఛగా కార్పొరేట్ దోపిడీకి వదలవచ్చని సిఫారసు చేసింది.

వాతావరణం, అడవుల మంత్రిత్వ శాఖ కస్తూరి రంగన్ సిఫారసులను ఆమోదించినందువల్ల గాడ్గిల్ నివేదికను పట్టించుకోవసరం లేదని కేంద్ర గ్రీన్ ట్రిబ్యూనల్ స్పష్టపరిచింది. నేడు మోడీ తన కొత్త వైద్యులతో, తక్కువ నిబంధనలతో, అనుమతులను వేగవంతం చేసే కార్యక్రమాన్ని 'పాత రోగాలకు' ఒక ఔషధంగా చెబుతున్నాడు.

ఆర్.ఎస్. చౌహాన్ సంస్మరణ

కార్మిక నాయకుడు ఆర్.ఎస్. చౌహాన్, టెలికాం వర్కర్స్ యూనియన్ బ్రాంచి కార్యదర్శిగా, రీజినల్ కార్యదర్శిగా, సర్కిల్ యూనియన్ సహాయ కార్యదర్శిగా, ఆలిండియా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా వివిధ హోదాలలో పనిచేస్తూ, దేశంలోని ప్రధాన నగరాలలో, రాష్ట్రంలోని పలు పట్టణాలలో పర్యటించి టెలికాం ఉద్యోగుల సమస్యల పరిష్కారాలకై అహర్నిశలు కృషి చేశారు. 2014 నవంబర్ 11న అకస్మాత్తుగా గుండె పని చేయక చనిపోయారు.

1964లో డిపార్ట్‌మెంట్‌లో చేరినప్పటి నుండి తన తోటి కార్మికుల హక్కులకై బ్యూరోక్రటిక్ ఆఫీసర్లతో పోరాడి సస్పెండ్ అయ్యారు. క్షమాపణ చెప్పడానికి నిరాకరించి, ఆలస్యమైనా సరే యూనియన్ కృషి ద్వారా తిరిగి నియమితులయ్యారు. అహర్నిశలు కార్మికుల పక్షాన నిలిచి పనిచేశారు. రాయలసీమలో పెద్ద నగరమైన కర్నూలులో పెన్షనర్స్ అసోసియేషన్ లేకపోవడం వలన తోటి మిత్రులతో చర్చించి, మొదటిసారి పెన్షనర్స్ అసోసియేషన్ స్థాపించి దానికి అధ్యక్షుడిగా ఆరోగ్యం సరిగా లేకపోయినా పని చేశారు. దోపిడి పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మూలిస్తే తప్ప నూటికి 90 శాతంగా ఉన్న ప్రజల అర్ధ బానిస విధానం పోదనే వారు. విప్లవం ద్వారానే సోషలిజం సాధ్యమనే వారు. చివరగా 2014 నవంబర్ 1న జరిగిన పెన్షనర్ సమావేశంలో తన శరీరంలో ఆఖరి రక్తంబొట్టు ఉన్నంత వరకు విప్లవానికే సహాయం చేస్తానని అన్నారు.

– సంపాదక వర్గం

పశ్చిమ కనుమల్లో గ్రీన్‌హంట్

ఈ ప్రాంతంపై కార్పొరేట్లు, భారత ప్రభుత్వం దృష్టి సారించడంతో 'అభివృద్ధి'కి అడ్డు వుంటారని ఆ ప్రాంత ఆదివాసులను ఆ ప్రాంతం నుండి తరిమివేయడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈరకమైన ప్రభుత్వ చర్యలు సహజంగానే అనివార్యంగా ప్రజల్ని తమ జీవితాల్ని, జీవనాధారాల్ని కాపాడుకొనే ఉద్యమాలకు పురికొల్పుతాయి. నిరంతరం అభివృద్ధి, బహిరంగ దోపిడీ మధ్య జరిగే చర్చకు పరిష్కారంగా (ప్రభుత్వ బల ప్రయోగం) ఉద్యమాలను మరింత తీవ్రతరం చేయక తప్పదు. గత 5 సంవత్సరాల (2009-2014) మధ్యలో కార్పొరేట్ల దోపిడీకి అడ్డం లేకుండా చూడటానికి మధ్య భారతంలో, తూర్పు ప్రాంతంలో 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' కార్యక్రమం కొనసాగుతూ వచ్చింది. కాని, నేడు అదే 'గ్రీన్‌హంట్' కార్యక్రమం, కేరళ, కర్నాటక రాష్ట్రాలకూ విస్తరించి మరింత తీవ్రం కానున్నది. ఒకవైపు గత సంవత్సర కాలంగా వైనాడ్, కన్నూర్, మలప్పురం, కాసన్‌గూడ్ జిల్లాలోని అడవుల్లో పోలీసులు 'నక్సల్ వ్యతిరేకంగా' కూంబింగ్ జరుపుతున్నారు. దీనికై 'థండర్ బోల్ట్ కేరళ' పేరుతో ఒక ప్రత్యేక కమాండ్ దళం ఏర్పాటు చేసారు. ఇది, వివిధ రాష్ట్రాలలో ఇది వరకే ఏర్పాటు చేసిన కోబ్రా, గ్రేహౌండ్ దళాలకు అదనం. అలాంటి చర్యలే కర్నాటక రాష్ట్రంలో పశ్చిమ కనుమల్లో చేపడుతున్నారు. అందులో భాగంగా 'సాల్వాజుడుం'ను గుర్తుకు తెస్తూ ఆదివాసీలకు రోజుకు 500 రూ జీతం ఇచ్చి ఇన్ఫార్మర్స్‌గా నియమించుకుంటున్నారు. 'మావోయిస్టులు ఆదివాసీలను ఉపకరణాలుగా' వినియోగించకుండా ఆపేందుకు తాము ఆదివాసులను 'అటవీ స్థాయి నిఘా కమిటీ'లో సభ్యులుగా చేర్చుకుంటున్నామని కేంద్ర గృహ శాఖామంత్రి ప్రకటించారు. సాల్వాజుడుం ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలో నిర్వహించిన పాత్రను బడా మైనింగ్ కంపెనీల సహకారంతో లక్షలాది ఆదివాసీలను నిర్వాసితుల చేసి, వారిపై దాడి చేసి, చంపడం, స్త్రీలపై అత్యాచారం చేయడం లాంటి దారుణాలకు ఇప్పుడు కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి.

చిదంబర చర్యలను వేగవంతం చేస్తూ, నేడు మోడీ కార్పొరేట్ల లాభాలకు, సేవలకై ఆత్రుత పడుతున్నాడు. దానికి 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ను విస్తరించడం, తీవ్రతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాడు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే రికార్డు నెలకొల్పుతూ 175 ప్రాజెక్టులను కేంద్ర వాతావరణ, అటవీశాఖ అనుమతులు మంజూరు చేయడంలోనే ఇదంతా కనబడుతున్నది. అంతేగాక వైల్డ్‌లైఫ్ జాతీయ బోర్డు తన అనుమతికై వేచివున్న 160 ప్రాజెక్టులలో 133 కి రెండు రోజుల్లోనే అనుమతుల మంజూరు చేయడం గమనార్హం. ఇక, తమ విధానాలు అమలుకై మోడీ ఆదివాసీ ప్రజలను క్రూరంగా అణచివేయటానికి తన హంతక ముఠాలను మరింత బలోపేతం చేస్తున్నాడు. ఉదాహరణకు కేవలం బస్తర్ జిల్లాకే అదనంగా 10 బెటాలియన్ల సిఆర్‌పిఎఫ్ జవాన్లను పంపాడు. మన దేశంలోనే అతి గొప్ప సైనిక ఆక్రమిత ప్రాంతంగా, 30,000 పారా మిలటరీ దళాలున్న ప్రాంతంగా బస్తర్ జిల్లా ఒకటే. ఈ విధంగా 'అభివృద్ధి సంబంధ తీవ్రవాదం', పశ్చిమ కనుమల్లోనూ విస్తరించేకొద్దీ, 'జల్, జంగల్, జమీన్'లకై ప్రజల పోరాటాలు మరింత బలోపేతమవుతున్నాయి. మనలోని పురోగామి ప్రజాస్వామ్య శక్తులు, కార్పొరేట్ల దోపిడీ నుండి పర్యావరణాన్ని కాపాడాలని కోరేవారు, జీవనాధారిత అభివృద్ధి, ప్రజల పాత్రను ఆకాంక్షించేవారు ఐక్యం కావాల్సిన తరుణమిది. మనమంతా ఆ ప్రజల పోరాటానికి మద్దతునివ్వాలి. అంతేగాక, 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో గత 5 సంవత్సరాలుగా కొనసాగుతున్న 'ప్రజలపై యుద్ధాన్ని' నిలపాలని డిమాండ్ చేయాలి.

'చూస్తూ ఉంటే మనం బ్రిటిష్ వాళ్ళను మించిన బ్రిటిష్ వాళ్ళలాగా ప్రవర్తిస్తున్నామనిపిస్తుంది. దేశంలోని సంపన్నులకు, అధికారం గల వాళ్లకు, ప్రపంచీకరణ చెందిన ప్రపంచానికి ఇష్టమొచ్చినట్లు చట్ట విరుద్ధంగా, ఉద్యోగరహిత పెరుగుదలను కొనసాగించేలా ఉంది. మన భూముల్ని, జల వనరుల్ని దోపిడీ చేయడాన్ని అడ్డగించడమొక్కటే ప్రజలకు మిగిలినట్లు కనిపిస్తోంది.

(కస్తూరి రంగన్‌కు మాధవ్ గాడ్గిల్ బహిరంగ లేఖ

దళితవాద కవిత్వం - మిథోపోయి

- బిరుసు సురేష్ బాబు

పాశ్చాత్య ప్రభావం వలన వచన కవిత్వం తెలుగులోకి ప్రవేశించింది. వచన కవిత్వం నేడు సామాజిక, అస్తిత్వ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళే బాధ్యత తీసుకొన్నది. ఆత్మగౌరవ నినాదంతో సరికొత్త ధిక్కార కవిత్వానికి నాంది పలికిన దళిత కవిత్వానికి కూడా వచన కవిత్వం ప్రధాన వాహికగా మారింది. 20వ శతాబ్దం పూర్వార్ధం నుండే దళిత స్పృహ ఉన్న కవిత్వం మనకు కనిపిస్తుంది. 1985 కారంచేడు మొదలు చుండూరు, పదిరి కుప్పం, వేంపెంట మొదలగుచోట్ల దళితులపై అగ్రవర్ణాలు జరిపిన మారణహోమానికి రక్తం మరిగిపోయిన దళిత యువతరం తమ ఆగ్రహానికి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొన్నారు. 'వీరు కొత్త వస్తువు, కొత్త భాష, కొత్త ప్రశ్నలతో సాహితీ ప్రపంచాన్ని నిలువునా కుదిపేశారు.' ఈ నేపథ్యంలో దళిత కవిత్వం కాస్త ఉద్యమం రూపం దాల్చి దళితవాద కవిత్వంగా రూపాంతరం చెందింది.

శిల్పం

నేటికాలంలోనే వస్తువుతోపాటు శిల్పానికి కూడ ప్రాధాన్యం ఏర్పడింది. 'టెక్నిక్' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా శిల్పం అనే పదం వాడుతున్నాం. కవి ఏ విషయాన్ని చెబుతున్నాడో అది వస్తువైతే, ఎలా చెబుతున్నాడో అది శిల్పం అవుతుంది. అభివ్యక్తీకరణ విధానమే శిల్పం. అయితే కవితా నిర్మాణంలో అనేక రకాలైన విషయాలు కవిత్వానికి బలం చేకూర్చేవిగా ఉన్నాయి. ఎత్తుగడ, భావచిత్రాలు, భావప్రకటనలు, శైలి మొదలైనవి అన్నీ కూడ వాటివాటి పరిధిలో కవిత్వానికి బలం చేకూర్చేవిగానే ఉంటున్నాయి. అభివ్యక్తిలో భాగమైన 'మిథోపోయి' అనే నిర్మాణ పద్ధతి కూడ మనకు వచన కవిత్వంలో బాగా కనిపిస్తుంది. స్త్రీ, దళిత, మైనార్టీ వాద కవులు మిథోపోయి నిర్మాణాన్ని చక్కగా వినియోగించుకున్నారు.

మిథోపోయి

పౌరాణిక నేపథ్యంలో ఆధునిక జీవితాన్ని కవిత్వంలో ఆవిష్కరించడమే మిథోపోయి. మిథోపోయి అనేది ఆంగ్లపదం. ఈ పదానికి సమానమైన తెలుగు పదాన్ని ఇంకా ఎవరూ నిర్ధారించలేదు. ఆధునిక జీవితానికి అన్వయించినపుడే అది మిథోపోయి అవుతుంది. పురాణ ప్రతీకకు, మిథోపోయికి తేడా ఉంది. పురోగతిని కలిగి ఉండడం, సమాజ అభివృద్ధిని కాంక్షించడం మిథోపోయి ప్రధాన లక్షణం. పురాణ ప్రతీకలో యథాతథ జీవితం ఉండొచ్చు లేదా తిరోగమనం ఉండవచ్చు. కాబట్టి పురాణ ప్రతీకలన్నీ మిథోపోయి అని చెప్పలేం. మిథోపోయి నిర్మాణం చేపట్టడానికి నిర్దిష్ట ప్రయోజనం ఉంది. పాఠకులకు పురాణేతిహాసాలలోని చాలా విషయాలు తెలిసి ఉంటాయి. వాటిని ఆధునిక జీవితానికి అన్వయించడం వల్ల పాఠకులకు తొందరగా చేరుతుంది. అంతేగాకుండా వచన కవిత్వ నిడివి తక్కువగా ఉంటుంది. చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెప్పాల్సి ఉంటుంది. కథ, నవలల్లో అయితే సుదీర్ఘ విషయాన్ని వివరంగా చెప్పే వెసులుబాటు ఉంటుంది. కానీ వచన కవిత్వంలో అలా ఉండదు. కాబట్టి సుదీర్ఘంగా చెప్పాల్సిన విషయాలను గతంలో జరిగిన విషయాలతోనూ, బాగా పరిచయమున్న పురాణేతిహాసాల్లోని సంఘటనలతోను అన్వయించి ఒకటి రెండు మాటలో చెప్పవచ్చు.

డా. మేడిపల్లి రవికుమార్ 'తెలుగు కవిత్వంలో మిథోపోయి' అనే సుదీర్ఘ వ్యాసం 'గమనం' సాహిత్య ప్రత్యేక సంచికలో ఏప్రిల్ 2001లో వెలువడింది. ఈ వ్యాసంలో మిథోపోయి అభివ్యక్తీకరణ పద్ధతికి సంబంధించి వ్యాసకర్త కొంత వివరణ ఇచ్చారు. టి.యస్. ఇలియట్, డబ్ల్యు.బి.ఈట్స్ మొదలగు కవులు ఆయా ప్రాంతాల మైథాలజీని ఆధారంగా చేసుకొని ఇలాంటి కవితా నిర్మాణాన్ని ఎంచుకున్నారు. ఆఫ్రికన్, లాటిన్ మొదలగు ప్రాంతాల కవిత్వం అంతటి జనాదరణ పొందడానికి ఈ మిథోపోయి కవితా నిర్మాణ పద్ధతే ప్రధాన కారణం. 'సరస్వతీ నారద విలాపం' రాసిన కందుకూరి వారే తెలుగులో మిథోపోయి కవిత్వ పద్ధతి నిర్మాణానికి ఆద్యులని మేడిపల్లి రవికుమార్ గారు అభిప్రాయపడ్డారు.

తెలుగు కవిత్వాన్ని పరిశీలిస్తే ముఖ్యంగా దళిత కవులు మిథోపోయి నిర్మాణ పద్ధతిని బాగా ఉపయోగించుకున్నారు. ఈ పద్ధతిలో నిర్మాణం చేపట్టడం అనేది కవులకు పురాణాలపై ఉండే పాండిత్యాన్ని ప్రదర్శించడమో, కీర్తించడమో ప్రధాన ఉద్దేశం కాదు. సమాజం ఎంత పురోభివృద్ధి జరుగుతున్నా, ఎంత ఆధునికీకరణ అవుతున్నప్పటికీ ఇక్కడి ప్రజలు పురాణ ఇతిహాసాలలోని పాత్రలు, సంఘటనల పట్ల ఆసక్తి, అభిరుచి కలిగి ఉంటారు. అలాంటి పురాణేతిహాస సంబంధ విషయాలను తీసుకొని దానిని ఆధునిక సమాజానికి అన్వయిస్తే పాఠకుని మనసుకు త్వరగా చేరుతుంది. ఈ ప్రయోజనాన్ని ఆశించి దళిత కవులు కూడ మిథోపోయి నిర్మాణాన్ని విరివిగా చేపట్టారు.

భారతదేశం అనేక మతాలకు పుట్టినిల్లు. మన దేశంలో పుట్టినవేగాకుండా ఇతర దేశాల నుండి వచ్చి స్థిరపడ్డ మతాలు కూడ ఇక్కడ ఉన్నాయి. ఇవి కూడ భారతీయ ప్రజలకు దగ్గరై సొంత ముద్రను వేసుకొన్నాయి. ఈ వైవిధ్యాన్ని దళిత కవిత్వంలో మిథోపోయి ద్వారా పరిశీలించవచ్చు. మనదేశానికి సంబంధించిన హిందూ పురాణేతిహాసాలను ఎంత అవగాహన చేసుకొన్నాడో బయట నుండి వచ్చిన క్రైస్తవ మైథాలజీని కూడ అంతే స్థాయిలో అవగాహన చేసుకొన్నారు దళిత కవులు. దళిత కవిత్వంలో ఈ రెండు రకాల మైథాలజీలను స్పష్టంగా గుర్తించవచ్చు.

హిందూ మిథోపోయి

భారతదేశంలో హిందువులు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడి పురాణేతిహాసాలను అనుసరించి వారి జీవనవిధానం కొనసాగుతుంది. దళిత కవిత్వంలో ఎక్కువగా హిందూ మిథోపోయి కనిపిస్తుంది. ముఖ్యంగా పురాణేతిహాసాలలో దౌర్జన్యాలకు, దాడులకు, అవమానాలకు బలైపోయిన వారిని దళితకవిత్వం కీర్తించింది. దీనికి బాధ్యులైనవారు దేవుళ్లైనాసరే వారిని ప్రతిఘటించడానికి వెనుకాడలేదు.

రామాయణంలో తపస్సు చేస్తున్న శంబూకుడ్ని తక్కువ కులంవాడని, తపస్సుచేసే అర్హత లేదనే కారణంతో తల నరికేస్తాడు రాముడు. మహాభారతంలో తక్కువ జాతివాడికి అసమాన విద్య ఉండటం చూసి ఓర్వలేక ఏకలవ్యుని బొటనవేలును అన్యాయమైన రీతిలో గురుదక్షిణ తీసుకొంటాడు ద్రోణుడు.

పై రెండు సంఘటనల ప్రతిధ్వని దళిత కవిత్వంలో చాలాసార్లు వినిపిస్తుంది. ఈ రెండు ఘటనల్లో బలయింది తక్కువజాతివారే. కాబట్టి శంబూకున్ని, ఏకలవ్యున్ని ఆదర్శంగా తీసుకొన్నారు దళిత కవులు. ఎండ్లూరి సుధాకర్ 'ఆత్మకథ' అనే కవితలో ఈ విధంగా అంటాడు.

'ఏ రోడ్డు మీదో నా చిన్నప్పటి గురువులు కనిపిస్తే
గద్దను చూసిన కోడిపిల్లలా నా బొటనవేలు గుప్పిట్లో దాక్కుంటుంది'

(ఎండ్లూరి సుధాకర్ - ఆత్మకథ - చిక్కనవుతున్నపాట. పుట.127)

ఏకలవ్యుడు గురువు ప్రతిమ చేసుకొని తన స్వతస్సిద్ధంగా విద్యను నేర్చుకొంటాడు. అయినా ద్రోణుడు స్వలాభం కోసం బొటనవేలును కోరి ఏకలవ్యుని విద్యను నిర్వీర్యం చేశాడు. ఆ ఘటనను గుర్తు చేసుకుంటున్నాడు కవి. తాను ఉన్నత స్థాయికి ఎదిగినా తన పాతజ్ఞాపకాల గుర్తులు తొలగిపోకుండా అలాగే ఉన్నట్లు భ్రమిస్తున్నాడు. అందుకే రోడ్డుమీద చిన్ననాటి గురువులు కనిపిస్తే గద్దను చూసిన కోడిపిల్లలా బొటవేలు గుప్పిట్లో దాక్కుంటుంది అంటున్నాడు. ద్రోణాచార్యులనే గద్దల్లాంటి గురువులు నేటికీ ఏదోఒక మూలన ఉండి ఏమేం అశిస్తారో, ఏమేం కోల్పోవాల్సి వస్తుందో అనే భయాన్ని ఇక్కడ వ్యక్తీకరించాడు కవి. జి.వి.రత్నాకర్ గారి 'మూడు కోతుల సాచ్చిగా...' అనే కవితలో మిథోపోయిని చక్కగా ప్రయోగించాడు.

'అపుడెపుడో గుట్టకింద
కల్లు మూసినందుకు
తల పారేసుకుంది మొండెం
గురి తప్పని మాటకి గిలగిలలాడింది
ఆ ఏలు
చాటు మాటు బాణానికి
నేల 'వాలి' నోన్ని చూసి
కన్నీరైంది అడవి'

(జి.వి.రత్నాకర్ - మూడు కోతుల సాచ్చిగా... చిత్తరువు. పుట.255)

అప్పుడెప్పుడో అంటూ త్రేతాయుగాన్ని గుర్తు చేసుకొంటున్నాడు కవి. అక్కడ కల్లు మూసినందుకు అంటే తపస్సు చేస్తున్నందుకు శంబూకుడు తల పోట్టుకున్నాడు. బాణమేకాదు. మాట కూడ గురి తప్పనిది కావడం వల్ల ఏకలవ్యుడు వేలు పోకొట్టుకున్నాడు. అంతేగాకుండా చాటూమాటున విసిరిన రాముణి బాణానికి వాలి బలయ్యాడు. ఈ విషయాలను చెప్తూ నేటికీ ఆగని దారుణ మారణ కాండలను గుర్తు చేస్తున్నాడు కవి.

ఇలాంటి దారుణాల్ని తీవ్రంగా తిప్పికొట్టే ప్రయత్నాన్ని దళిత కవిత్వం నెత్తిన వేసుకుంది. శిఖామణి 'ఇనుప పాళీలు మొలుచు కొస్తున్నాయి' అనే కవితలో ఈ ప్రతిఘటనను గుర్తించవచ్చు.

'శంబూకుని తలను నరికిన కత్తి
శతాబ్దాల నుండి
పదును తగ్గకుండా అలాగే వుంది
అయితే అది ఇప్పుడు చేతులు మారింది
ఇక ఇప్పుడు ఏ మనువు మిమ్మల్ని రక్షించలేదు'

(శిఖామణి - ఇనుప పాళీలు మొలుచుకొస్తున్నాయ్ - దళిత కవిత్వం 1 పుట. 144)

మనుధర్మాన్ని అనుసరించి తక్కువ జాతి వారు తపస్సు చేయడానికి వీల్లేదని శంబూకుని వధించారు. శంబూకిని తలను నరికిన కత్తి ఇన్నాళ్లయిన పదును తగ్గకుండా అలాగే ఉంది. అంటే ఆ గాయం ఇంకా మానలేదని కవి భావం. ఆ అన్యాయానికి ప్రతీకారం తీర్చుకొనే సమయం వచ్చింది. ఇక ఏ మనువు మిమ్మల్ని రక్షించలేదని దళిత చైతన్యాన్ని, దళితుల ప్రతిఘటన స్వరాన్ని కవి చెబుతున్నాడు. దీనికోసం చక్కని మిథోపోయిని ఎంచుకొన్నాడు.

సతీష్ చందర్ 'అరచేతి రంధ్రాలు' అనే కవితలో పంచముడిగా చిత్రించిన దళితున్ని గుర్తు చేస్తున్నాడు.

'శిరస్సు నుంచి, భుజాల నుంచి, తొడల నుంచి
పాదాల మీద పడి తన్నబడ్డ
పసుపు కుంకుమల నా తల్లి పరాభవానికి
పాండవ దైవాలు శిరస్సులు వంచినపుడు
బొట్టులేనితనం పునరుత్థానమే కాని వైధవ్యం కాదు
జారిపడ్డ కురుల్ని ముడి వేయడానికి కులపతులు
పరమత సుయోధనుల తొడలు విరువనవసరం లేదు
పాతకిగానో
పతితగానో ప్రకటించి ముక్కు చెవులూ కోసేస్తే చాలు'

(సతీష్ చందర్ - అరచేతి రంధ్రాలు - చిత్తరువు. పుట. 52,53)

మనుధర్మం సృష్టించిన నిచ్చెనమెట్ల వ్యవస్థలో దేనికీ చెందకుండా పంచముడిగా మిగిలిపోయినవాడు దళితుడు. పాండవులందరి సమక్షంలోనే అవమానానికి గురయిన ద్రౌపదిలాగా భారతదేశంలోనే పుట్టిన ఒక మనిషిని దళితుడిగా, దస్యుడిగా, అంటరానివాడిగా చేసి అవమానించడాన్ని కవి ఈ మిథోపోయిలో చెప్పాడు. అక్కడ పాండవులు ఎలా తల దించారో, ఈ దురాగతంలో కూడ పాండవ దైవాలు బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులు కూడ ఏమీ పట్టనట్లు తల దించుకున్నారు. అంతా జరిగాక భీముడు సుయోధనుని తొడలు విరుస్తాడు. అయితే ఇక్కడ ఏ పరమతాల వాళ్ళను నిందించాల్సిన పని లేదు. ఇది స్వయంకృతాపరాధమే అని దీని భావం. దళితుడిపై

నిందలు వేసి వారిని సమాజానికి దూరం చేశారు. అదే విషయాన్ని రామాయణంలో ముక్కు, చెవులు కోల్పోయిన శూర్పణఖను స్ఫురణ చేస్తూ మిథోపోయిని చక్కగా నిర్మించాడు కవి.

పైడి తెరేష్ బాబు 'ఐదోతనం' అనే కవితలో శ్రీ కృష్ణుడి లీలకు సంబంధించిన విషయాలను దళిత కోణంలో సున్నితంగా విమర్శిస్తూనే మంచి మిథోపోయిని నిర్మించాడు.

'అటు చీరల్లాగి ఇటు చీరలిచ్చే కథలు విని చదివీ
ఇటు చూడు చెవులు ఎన్ని పుళ్లయ్యాయో
గోపికలూ ఆడాళ్ళే బ్రదర్
వాళ్ళ చీరలు కాజేసి నాకు కట్టబెట్టాల్సిన పనేం లేదులే
మాయా చీరను తీసుకెళ్ళి నీ మనువు తాతకు గోచీ పెట్టు'

(పైడి తిరేష్ బాబు - ఐదోతనం - దళిత కవిత్వం - 1. పుట. 79)

స్నానం చేసే స్త్రీల చీరలు దొంగతనం చేసిన కృష్ణుడు ద్రౌపది పరాభవ సమయంలో తన మాయ ద్వార చీరల్ని అందిస్తాడు. అందుకే కవి చమత్కారంగా 'గోపికలూ ఆడాళ్ళే బ్రదర్' అలాంటి మాయా చీరలు తనకు అవసరం లేదంటుంది నేటి చెల్లి. ఆ మాయా చీరను తీసుకెళ్ళి ధర్మాధర్మాలను సృష్టించిన నీ మనువు తాతకే గోచిపెట్టు అంటూ చెప్పే నిరసన ఇందులో కనిపిస్తుంది. అన్నల్లాగే నటిస్తూ స్త్రీలను కామించే వారిని గురించి రాస్తూ దళితకోణంలో చెప్పిన కవిత ఇది.

మిథోపోయి కవితా నిర్మాణానికే ఒక వన్నె తెచ్చిన కవిత 'నడుస్తున్న చరిత్ర'. ఇందులో శివసాగర్ గత కాలంలో జరిగిన దాడులను నిరసిస్తూ వాటిని తిరగరాస్తూ ఇప్పుడు నడిచే చరిత్ర దళితులదే అని ఉద్ఘాటించాడు.

'శంబూకుడు పెదాల మీద చిరునవ్వుతో
రాముణ్ణి వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును
గొడ్డలితో నరుకుతున్నాడు
బలి తన చిరుపాదాలతో వామనుణ్ణి
పాతాళానికి తొక్కేస్తున్నాడు
....
ఇప్పుడు నడుస్తున్న చరిత్ర పరమ ఛండాల చరిత్ర'

(శివసాగర్ - నడుస్తున్న చరిత్ర - చిక్కనవుతున్న పాట. పుట. 135)

అని సాగే ఈ కవితలో దళిత ధిక్కార స్వరం కనిపిస్తుంది. పురాణాలలో తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకారాన్ని తీర్చుకునే ధోరణిలో ఈ కవిత సాగుతుంది. ఇందులో దళిత కవిత్వానికి విప్లవ స్ఫూర్తి వచ్చి చేరింది. అంతేగాకుండా విప్లవ కవిత్వం దళితులకు, దళిత వాదానికి, దళిత కవిత్వానికి వెన్నుదన్నుగా నిలిచింది. దళిత కవిత్వానికి కూడా విప్లవోద్యమం పట్ల గౌరవం ఉంది. వేల సంవత్సరాలుగా రాజ్యమేలిన చరిత్రకు శివసాగర్ ఈ ఒక్క కవితతో సమాధానం చెప్పాడు. ఇన్నాళ్ళుగా దళితుల్ని అణచి ఉంచిన చరిత్రను శివసాగర్ ఈ మిథోపోయిలో తిరిగి లిఖించాడు.

పైన తెలిపిన ఉదాహరణలే కాకుండా పురాణ ఇతిహాసాల్లో అనేక అంశాలకు సంబంధించిన పౌరాణిక నేపథ్యాన్ని దళితకవులు స్వీకరించారు. హిందూ పురాణాలకు సంబంధించినంత వరకూ ఎక్కువగా ప్రతిఘటన వైఖరి కనిపిస్తుంది. పురాణాల్లో జరిగిన దాడి ఘటనలను దళిత కవులు పదేపదే గుర్తు చేశారు. కొన్ని కవితల్లో మిథోపోయిని కొన్ని పాదాలకే పరిమితం చేసినా మొత్తంగా మిథోపోయితోనే కవిత్వాన్ని నిర్మించినవారు కూడా ఉన్నారు.

క్రైస్తవ మిథోపోయి

బ్రిటిష్‌వారి వల్ల భారతదేశంలోకి క్రైస్తవమతం ప్రవేశించింది. ఆనాడు దళితులుగా, అంటరానివారిగా వివక్షకు గురయిన చాలామంది క్రైస్తవమతం స్వీకరించారు. హిందూమతంలాగే క్రైస్తవమత మైథాలజీని, బైబిల్లోని సంఘటనలను విషయాలను మన కవులు అవగాహన చేసుకొన్నారు. ముఖ్యంగా దళిత కవులు తమ కవిత్వంలో క్రైస్తవ మిథోపోయిని ఆధునిక సమాజానికి అన్వయిస్తూ చక్కని ప్రయోగాలను చేశారు. దళిత కవిత్వంలో క్రైస్తవ మిథోపోయి చాలాచోట్ల కనిపిస్తుంది.

'నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించమన్న దేవుడే
నాకు మాల రక్షకుడై నీకు మాదిగ కరుణామయుడై
మనమధ్యో పరిశుద్ధ పర్వతశ్రేణిగా అడ్డుపడితే
అయ్యో! బెత్లెహేము పశుల పాకపై నిలిచిన నక్షత్రంలాంటి నీ ముఖంలో
దిగులు మబ్బే మేటేస్తే ఈ వెర్రి ప్రపంచం గుడ్డిదయ్యిపోదా..!
బెతెస్థ కోనేళ్ళంటి నీ కళ్ళే పొంగిపొర్లితే
ఈ వెర్రి భూగోళం స్వస్థతే లేని రోగంలో మునిగిపోదా!'

(మద్దూరి నగేష్ బాబు - మార్తా - మీరేవుట్లో. పుట.73)

దళితుల్లోనే మాలమాదిగలంటూ ఉండే అంతర్గత వైరుధ్యాలను చెప్పాడు కవి. ఇక్కడ రెండు కులాలవారు దళితులే ఇద్దరూ కొలిచేది జీససనే. అయినా కూడా ఈ రెండు వర్గాల మధ్య ప్రేమ పొసగకుండా పెద్దలు అడ్డుపడే విషయాన్ని కవి ఈ మిథోపోయి ద్వారా చెప్తున్నాడు. నిన్ను నువ్వు ఎలా ప్రేమిస్తావో నీ పొరుగువాళ్ళను కూడ అలాగే ప్రేమించమని చెప్పిన దేవుణ్ణి కూడా ప్రేమ విషయం వచ్చేసరికి రెండుగా విభజిస్తున్నారు.

బెత్లెహేము పశుల పాకలో జన్మించాడు ఏసుక్రీస్తు. ఆయన జననాన్ని తెలియజేస్తూ పశులపాకపై ఒక నక్షత్రం కాంతులీనుతూ దర్శనమిచ్చింది. ఆ నక్షత్రంలాంటి ఆమె ముఖం దిగులు అనే మబ్బు కప్పేస్తే ప్రపంచమే గుడ్డిదైపోయినట్టుగా ఉందంటున్నాడు ఆమె ప్రియుడు. బెతెస్థ కోనేళ్ళలో మునిగే రోగులకు స్వస్థత కలుగుతుంది. అయితే ఇక్కడ ఆ కోనేళ్ళలాంటి ఆయన కన్నులు పొంగిపొర్లాయి. అంటే ఆమెకు కన్నీళ్లు రావడం వల్ల ఈ ప్రపంచమే స్వస్థత లేకుండా రోగాలతోనే మునిగిపోతుంది కదా అంటూ చెప్పే వర్ణనలోనూ క్రైస్తవ మిథోపోయి చక్కగా ఒదిగిపోయింది.

'తేదీ ప్రకటితమైపోయింది
చావురేఖ ఆయువు పట్టుదాకా విస్తరిస్తోంది
ఇక వాళ్ళను చంపేస్తారు
పొంతి పిలాతులంతా చేతులు కడిగేసుకున్నారు'

(కలేకూరి ప్రసాద్ - 18 డిసెంబర్ 1996 - చిత్తరువు. పుట.225)

చలపతి, విజయవర్ధన్ అనే ఇద్దరు యువకులు ఆకలివేటలో భాగంగా అనుకోని ఒక రీతిలో ఒక బస్సును తగలబెట్టారు. చాలామంది మరణించారు. అయితే వారికి కోర్టు ఉరిశిక్షను నిరాకరించింది. చాలామంది వారికి ఉరిశిక్ష వేసేట్లు కోర్టును డిమాండు చేశారు. అంటే కోర్టును కూడా ఒప్పించారు. దళితులు కాబట్టి వారు చావు నుండి బయటపడే మార్గం లేకపోయింది. బైబిల్లో క్రీస్తును కూడ శిలువ వేయడానికి పిలాతు అనే రాజు నిరాకరించగా కొందరి మాటలకు తలొగ్గక తప్పలేదు. అలాంటి పరిస్థితి నేటికీ నెలకొని ఉండటాన్ని కవి గుర్తించాడు. అంతా అయ్యాక పొంతిపిలాతు తమ తప్పేమి లేదన్నట్టు చేతులు కడిగేసుకొంటాడు. అలాగే కోర్టు కూడ ఉరిశిక్ష విధించి చేతులు కడిగేసుకుందని చెప్పడానికి ఈ మిథోపోయిని ప్రయోగించాడు కవి.

డా. ఎమ్.ఎమ్.వినోదిని 'వొంటి నిట్టాడి గుడిశ' అనే కవితలో క్రైస్తవ మిథోపోయిని స్పష్టంగా గుర్తించవచ్చు.

'యీ కులం వో పెద్ద లూసీఫర్రై
అతడి స్పర్శలో తప్పిపోయిన నన్ను
వో కిరస్తానీ గొర్రెపిల్లని చేసి
వూరి చివర వదిలి వెళ్ళిపోయింది'

(వినోదిని - వొంటి నిట్టాడి గుడిశ - విడిఆకాశం.పుట.52)

లూసీఫర్ అనేది మొదట యెహోవా దగ్గరున్న ప్రధాన దేవదూత. గర్వంతో దేవుణ్ణి ధిక్కరించి దేవునికి విరోధిగా మారుతుంది. అప్పటినుండి దేవుడు చేసే ప్రతి పనికి అడ్డు తగులుతూ ఉంటుంది. ఈ కవితలో కులం కూడా లూసీఫర్ దూతలాగా మారింది. దళిత అమ్మాయి, బ్రాహ్మణ అబ్బాయికి మధ్య కులం అడ్డు పడింది. క్రైస్తవ మైథాలజీలోని తప్పిపోయిన గొర్రెపిల్ల సంఘటనని కవయిత్రి ఇక్కడ గుర్తు చేసింది. కిరస్తాని అంటే క్రిస్టియన్ అని అర్థం. వందగొర్రె పిల్లలను వదిలేసి తప్పిపోయిన ఒక్క గొర్రెపిల్ల కోసం వెదుకుతాడు. అలాగే బ్రాహ్మణ యువకుని స్పర్శ నుండి దళిత యువతిని దూరం చేసి ఊరి చివర వదిలిపోయింది కులం. లూసీఫర్ లాంటి కులం వారిద్దరి మధ్య పొత్తు కుదరకుండా అడ్డు తగిలింది. ఈ విషయాన్ని మిథోపోయిలో ఒదిగించారు కవయిత్రి.

'సమాధులకడ్డంగా బండరాళ్ళెందుకు?
పర్వతాల్నే పేర్చమనండి
ఉన్నట్టుండి జీసస్సులు
ఉషస్సుల్లా చివాల్న లేవకపోరు'

(సతీష్ చందర్ - శిశువు నేడు లేచెను - చిక్కనవుతున్న పాట పుట.144)

సతీష్ చందర్ శీర్షికతోనే బైబిల్ మైథాలజీని గుర్తు చేస్తున్నాడు. జీసస్‌ను అనేక రకాల చిత్రహింసలు పెట్టి శిలువ చేశారు. అతని శరీరాన్ని ఒక పెద్ద సమాధిలో ఉంచి దానికి ఒక పెద్ద బండరాయిని అడ్డుపెడతారు. అనేక అవమానాలకు దాడులకు బలైన దళితున్ని జీసస్‌తో అన్వయించాడు కవి. దళితుడు చైతన్యాన్ని పొందాడని చెప్పడానికి గుర్తుగా ఈ మిథోపోయిని చెప్పాడు. ఇన్నాళ్ళు సమాధుల మధ్య సమాధి జీవితాన్ని అనుభవించిన దళితుడు బండరాళ్ళు కాదు, పర్వతాలు అడ్డుపెట్టినా జీసస్ పునరుత్థానుడై పైకి లేచినట్లుగా దళితుడు కూడా చైతన్యంతో పైకి ఉషస్సులాగా లేవకపోరు అని కవి దళిత చైతన్యాన్ని నింపుతున్నాడు.

'ఆదియందు అక్షరముండెను అక్షరము అమ్మవద్ద వుండెను
అక్షరమే అమ్మయి ఉండెను. ఆమెన్'

(సతీష్ చందర్ - అక్షరశయ్య - దళిత కవిత్వం -1. పుట. 103)

'ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై ఉండెను.' అనేవి బైబిల్లోని యోహాను సువార్త మొదటి అధ్యాయంలోని తొలిపలుకులు. దళితకవిత్వాన్ని ఉద్దేశించి ఈ మాటల్ని యథాతథ అన్వయంతో చెప్పాడు కవి. ఆమెన్ అనేది క్రైస్తవులు ప్రార్థన ముగించాక పలికే మాట. కవి కూడా కవిత్వాన్నంతా ముగించాక ఈ మాటను పలుకుతున్నాడు. దీన్నిబట్టి దళితకవులు క్రైస్తవ మైథాలజీని ఎంతగా అవపోసనపట్టారో తెలుస్తుంది.

ఆయా మైథాలజీలకు సంబంధమున్న మిథోపోయి కవిత్వాన్ని చదివినప్పుడు ఆయా సంఘటనలపై, ఆయా పాత్రలపై ఉన్న ఆసక్తి కారణంగా పాఠకుడు కవిత్వలోతుల్లోకి వెళ్ళి అన్వయించుకుంటాడు. దళిత కవిత్వంలో మిథోపోయిని పరిశీలించినపుడు ఓవైపు ఆధునిక జీవితానికి అన్వయిస్తూనే ఒక్కోచోట మైథాలజీకి అనుకూలంగాను, ఇంకోచోట ప్రతికూలంగాను సాగిన వైఖరి కూడ కనిపిస్తుంది.

ముందు చెప్పుకొన్నట్లుగా హిందు, క్రైస్తవ అనే మైథాలజీలకు సంబంధించిన అంశాల నేపథ్యాన్ని దళితకవిత్వం పదునుగా వాడుకుంది. సతీష్ చందర్ 'అరచేతి రంధ్రాలు' , కత్తి పద్మారావు 'దళితమ్మ' మొదలగు కవితల్ని పరిశీలిస్తే ఒకే కవితలో రెండు మైథాలజీలను ప్రతిష్ఠించిన తీరు కూడా కనిపిస్తుంది.

మిథోపోయిని ఆధునిక సమాజానికి అన్వయించే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మైథాలజీ పట్ల సరైన అవగాహన లేకుండా అరకొర విషయ జ్ఞానంతో కవిత్వంలో చొప్పించాలని చూస్తే అది గందరగోళాన్ని, రసాభాసను సృష్టించే అవకాశం ఉంది. కాబట్టి మిథోపోయి నిర్మాణం చేపట్టే క్రమంలో ఆయా సంఘటనలకు సంబంధించిన విషయ పరిజ్ఞానం తప్పనిసరి. దళిత కవిత్వంలో మాత్రం ఇలాంటి పొరపాట్లేవి దొర్లకుండా దాదాపుగా మంచి మిథోపోయి నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రయత్నించారు దళితకవులు.

ఆధారగ్రంథాలు

1. గమనం (ప్రత్యేక సాహిత్య పత్రిక) - వ్యాసం (మేడిపల్లి రవికుమార్)
2. అస్తిత్వగానం - చల్లపల్లి స్వరూపరాణి
3. విడి ఆకాశం - మద్దూరి నగేష్ బాబు (సంపాదకులు)
4. చిక్కనవుతున్న పాట - జి. లక్ష్మీ నరసయ్య త్రిపురనేని శ్రీనివాస్ (సం)
5. చిత్తరువు - తాటిపర్తి బాలస్వామి జి.విజయలక్ష్మి (సం)
6. దళిత కవిత్వం-1- కె. లక్ష్మీ నారాయణ (సం)
7. మీరేవుట్లో - మద్దూరి నగేష్ బాబు
8. బైబిల్- తెలుగు అనువాదం

సీరియల్

సూర్యుడు

- కె.వి. కూర్మనాథ్



(12)

(మార్చి-మే 2014 సంచిక తరువాయి...)

రాఘవ - టీచర్

ఒక రోజు నాకు ఓ ఉత్తరం వచ్చింది సంపాదకుల ద్వారా. అది ప్రధానంగా నేను రాస్తున్న సూర్యుడి సీరియల్ గురించి. ఒకటి, రెండు ఎపిసోడ్లు రాసి సంతృప్తి చెందక, వదిలేసి ఇక మిగిలిన భాగాన్ని అర్థవంతంగా ఎలా పూర్తి చెయ్యాలా అని మధనపడుతున్న నాకు ఈ ఉత్తరం ఓ దారి చూపించింది.

ఆయన పేరు రాఘవ. టీచరుగా రిటైర్ అయ్యి పదేళ్ళవుతుందట. ఈ 'సూర్యుడు' ఫలానా ఆయనా, అని అడుగుతూ రాసారు. పాతతరం గొలుసుకట్టు అక్షరాలు ఆయన పాత జ్ఞాపకాలని సంధానం చేస్తున్నట్టు, సంబంధం తెగిపోయిన ఆలోచనల్ని కలపడానికి ప్రయత్నిస్తున్నట్టుగా ఉన్నాయి.

ఆయన పేరు కింద, ఊరిపేరు మాత్రమే రాసివున్నది. 'ఆ మాత్రం సమాచారం చాలదా,' అనుకుని బయలుదేరాను. ఓ నాలుగైదు గంటల ప్రయాణం తర్వాత ఆ ఊరు చేరుకునేసరికి మధ్యాహ్నం మూడయ్యింది. అది నిజానికి గ్రామపు ఛాయలు అస్సలే పోని ఓ చిన్న పట్టణం. అప్పటికే నేను వస్తున్నట్టు మిత్రుడికి ఫోను చేసివుండడం వల్ల బస్టాండ్ కి వచ్చాడు. నేను వచ్చిన పనిగురించి చెప్పి, ఎడ్రసు చూపించాను.

'ఓహో, రాఘవ సారా,' అన్నాడు, వెతకాల్సిన అవసరం లేదన్నట్టు. వాళ్ళింటికెళ్ళి అన్నంతిని కాసేపు మాట్లాడుకుని బయటపడ్డాం. బండి మీద బయలుదేరి ఓ అయిదు నిమిషాల్లో చేరుకున్నాం రాఘవ సారింటికి. మూడు గదుల స్లాబ్ ఇల్లు. చుట్టూ ఓ చిన్న ప్రహరీ

గోడ. లోపల అక్కడక్కడా కొన్ని పూలమొక్కలున్నాయి. ఎండిపోయిన నూతిలో పెట్టిన నీళ్ళ మోటార్ పైపు నుంచి నీళ్ళు లీకై ఇనప గేటు కిందనుంచి నీళ్ళు రోడ్డుమీదికి వస్తున్నాయి. తీసే వుండటంతో గేటు తీసుకుని వెళ్ళి తలుపు కొట్టెం.

సార్ ఇంట్లోనే ఉన్నారు. సన్నగా ఉండడంవల్ల వయసు ఓ నాలుగైదేళ్లు తక్కువగా కనిపిస్తున్నారు. చలి ముదురుతున్న రోజులు కాబట్టి స్వెట్టర్, దానిమీద షాల్ కూడా కప్పుకున్నారు. మా మిత్రుడిని గుర్తుపట్టి పలకరించారు.

నా వైపు చూసేరు, 'ఎవరా' అన్నట్టు. మా మిత్రుడు పరిచయం చేశాడు. నేనొచ్చిన పని గురించి చెప్పేడు.

సాయంత్రం అయిదవుతోంది.

* * *

షాల్ కొంచెం సద్దుకుని మాట్లాడడం మొదలు పెట్టేరు.

'నేను దాదాపు నలభై బేచీల పిల్లలకి చదువు చెప్పేను. ఏం చెప్పేనో, ఎలా చెప్పేనో నేను మీకు చెప్పను. 'What is a teacher really worth?' (ఒక టీచర్ విలువ ఏంటి?) ఎవరు చెప్పగలరు. ఎన్ని వందలమంది పిల్లలని కనిపెట్టుకుని, వాళ్ళ గురించి ఆలోచించి, వాళ్ళ లోపాలని గమనించి సరిచేసే ప్రయత్నం చేస్తారు? అందరూ అలాగే ఉంటారని కాదు కానీ, అలాటి టీచర్లు ఎంతో కొంతమంది లేకపోలేదు.

దాదాపు ప్రతీ బేచిలో ఒకరిద్దరు విద్యార్థుల్ని గుర్తుపెట్టు కుంటాం. వాళ్ళ అల్లరి వల్లనో, ఆటలవల్లనో లేకపోతే తెలివివల్లనో. కొంచెం సానపెడితే మెరుపులు కనిపించే పిల్లలు, తెలివి ఉండీ ఆకలివల్ల పనులకు పోయే పిల్లలు, గొంతెత్తి హాయిగా తత్వాలు పాడే పిల్లలు, అమితాశ్చర్యం కలిగించే ఎనర్జీ కలిగి ఉండే పిల్లలు – ఇలా ఎప్పుడో ఎక్కడో కనిపిస్తుంటారు. ఏదో సందర్భంలో గుర్తుకువచ్చి ఇప్పుడెక్కడున్నారో అని అనిపిస్తుంది. ఏటికి ఎదురీది నిలదొక్కు కున్నారో, లేకపోతే తిరుగులేని బలంతో మనుషుల్ని జీవితావరణం నుంచి విసిరివేస్తున్న శక్తుల చేతిలో నలిగిపోతున్నారో అని ఎప్పుడైనా ఇలా కూచున్నపుడు అనిపిస్తుంది.

ఇలా విద్యార్థులెంతోమంది గుర్తొస్తారు కానీ, వాళ్ళ తల్లిదండ్రులు ఎవరూ దాదాపు గుర్తురారు. ఈ ఊళ్ళో మనుషులే కానీ, వాళ్ళతో వాళ్ళ పిల్లల చదువుకి సంబంధించిన జ్ఞాపకాలు పెద్దగా ఏవీ లేవు.

సూర్యుడు తప్ప.

* * *

టీచరుగా 'తండ్రి' అంటే గుర్తొచ్చేది అబ్రహం లింకన్. మాకు టీచర్ ట్రైనింగ్ కోర్సులో చెప్పేవారు. ఆయన టీచరుకు రాసిన ఉత్తరం గురించి. తన కొడుకు మొట్టమొదటి టీచరుకు ఆయన రాసిన ఉత్తరం ప్రతి పేరెంటూ తప్పక చదవాల్సిన ఉత్తరం. టీచర్ని అభ్యర్థిస్తున్నట్టుగా, సలహా ఇస్తున్నట్టుగా రాసిన ఉత్తరం అది.

'నువ్వు చదివేవా, అది,' అని అడిగారు.

'విన్నాను'

ఎక్కడైనా కాపీ సంపాదించి చదువు.

'ప్రపంచంలో దుర్మార్గమే లేదనీ, ఎంతోకొంత మంచి కూడా ఉంటుందనీ తన కొడుక్కి చెప్పమన్నాడు. ఓడిపోవడం ఎలా ఉంటుందో, ఓ మంచి పుస్తకం మనకి ఏం నేర్పగలదో చెప్పండి. మతితప్పి ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాళ్ళు నిజమే మాట్లాడుతున్నారని అనుకోవద్దని, వాళ్లలోకి దూకేముందు సొంతంగా ఆలోచించమని చెప్పండి.

బతకడంకోసం బుర్రని అమ్ముకొమ్మని చెప్పండి కానీ హృదయాన్ని ఎవరికీ తాకట్టు పెట్టొద్దని, బాధని చూసి కన్నీళ్లు కార్చడం తప్పేమీ కాదని చెప్పండి,' అని ఆ ఉత్తరంలో రాశాడు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎంత బాధ్యతతో ఉండాలో చెప్పిన ఉత్తరం నాకు చాలా ఇష్టం. నా పిల్లల్ని పెంచడానికి కూడా అదెంతో ఉపయోగపడింది. అప్పటి దాకా అదే గొప్ప ఉత్తరం అనుకునేవాడిని. సూర్యుడి దగ్గరనుంచి ఉత్తరం వచ్చేదాకా.

అప్పటికే ఆయనపేరు ఊళ్ళో, జిల్లాలో, రాష్ట్రంలో బాగా వినిపిస్తోంది. ఏవేవో మరణాలగురించి, ఏవేవో సంఘటనల గురించి, ఆ ఘటనల వెనుక ఆయన ప్రమేయం గురించి చెప్పుకునే వారు. స్వతహాగా గాంధేయవాదిని కావడంవల్ల నాకెందుకో ఆమార్గం ఇష్టం వుండేది కాదు. మంచే చేస్తున్నారు కానీ, రక్తపాతం ఎందుకు అనుకునే వాడిని.

ఇది జరిగి దాదాపు ఇరవై ఏళ్లవుతుందేమో. స్కూల్ అయిపోయేక ఇంటికి వెళ్తున్నాను. నాకు తెలిసిన యువకుడు, 'సార్, ఎట్లున్నరు,' అన్నాడు.

'బావున్నా,' అన్నా.

అదీ, ఇదీ మాట్లాడుతూ ఇంటికి వచ్చేం. ముందు గదిలో కూచున్నాం. కాసేపు మాట్లాడి 'సార్ నే పోతున్న,' అన్నాడు, లేచి నిల్చుని.

'రా ఎప్పుడన్న,' అన్నాను.

వెళ్లిపోతూ, నా చేతిలో ఓ కవర్ పెట్టేడు.

'మీకియ్యమన్నారు,' అన్నాడు, ఎవరో ఎందుకో చెప్పకుండా.

అతను వెళ్లిపోగానే, లైట్ వేసుకుని కవర్ చింపేను. చిన్న అక్షరాలతో ఎనిమిది పేజీలుంది.

* * *

'సార్, మీ స్కూల్లో మా అబ్బాయి చదువుతున్నాడు,' అంటూ మొదలైంది ఉత్తరం.

అప్పటిదాకా ఆ విద్యార్థి తండ్రి సూర్యుడు అని తెలీదు. హింసారాధకులైన వాళ్ళు నాకు చెప్పేది ఏమై వుంటుందా అని నాకు ఆశ్చర్యం కలిగింది. అంతేకాదు, 'ప్రైమరీ క్లాసులో వున్న విద్యార్థి తండ్రి ఏం సలహాలు ఇవ్వగలడు?' అనుకున్నాను.

ఉత్తరం చదవడం మొదలుపెట్టేను.

'మీరెవరో నాకు నేరుగా పరిచయం లేకపోయినా, మీగురించి వినివున్నాను మిత్రులద్వారా. మీకీ ఉత్తరం ఎప్పటినుంచో రాద్దామనుకుంటున్నా. కానీ, పనుల వత్తిడి వల్ల వీలుకాలేదు. చదువుగురించి మీరూ, మీ యాజమాన్యం ఏమి అనుకుంటున్నారో తెలీదు. నాకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. మీతో పంచుకుందామని రాస్తున్నాను.'

* * *

'పిల్లలకు నీతీ, నిజాయితీ, నిష్కపటమూ, సరైన వ్యక్తిత్వాలను, నైతిక విలువలను బోధించని విద్య విద్యే కాదు. సాటి మనిషిపట్ల

ప్రేమ, అప్యాయతానురాగాల్నిపంచుకోవడం నేర్పాలి. విషయ పరిజ్ఞానం ఉండడటం దానికదే పెద్ద విషయం కాదు.'

'బయటి సమాజంతో సంబంధంలేని విషయాలు చెప్తున్నారు స్కూళ్ళలో. దీనివల్ల చదువు ముగించుకుని విద్యార్థులు సమాజంలోకి వచ్చినపుడు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇమడలేక. రియాలిటీకి దూరంగా పెంచితే ఫలితాలు ఆవిధంగానే ఉంటాయి. అలా కాకుండా రియాలిటీని చెప్పి దానిని ఎదుర్కొనే జ్ఞానమూ, స్థైర్యమూ కలిగిస్తే వాళ్ళు జీవితంలో నిలదొక్కుకోవడమే కాకుండా గొప్ప పనుల్ని చెయ్య గలుగుతారు.'

'ఎలా చదువుతున్నారు, ఎన్ని మార్కులు వచ్చినాయి అనే దానికంటే వాళ్ళ మానసిక పరిస్థితి ఎలా ఉంది అన్నదే ముఖ్యం. వాళ్ళలో పట్టుదల కలిగించడంలో టీచర్‌ది ప్రధాన పాత్ర వుంటుంది. పట్టుదల వచ్చిందంటే ఇక వాళ్ళనెవరూ ఆపలేరు,' అని రాశాడు.

అస్సలే స్కూలు చదువు చదవని వారు కొద్దినెలల్లోనే చదవడం, రాయడం నేర్చుకుని కవితలు, కథలూ రాసిన వాళ్ళ గురించి చెప్పేడు. ఏ స్కూలుకీ, కాలేజీకీ వెళ్లకుండానే ప్రజలతో కలిసి తిరిగి వాళ్ళతో ఉద్యమాలు చేసిన వాళ్ళు మహా మేధావులుగా, ఉపాధ్యాయులుగా ఎదిగిన వాళ్ళగురించి కూడా ప్రస్తావించాడు.

కేవలం జీతం కోసమే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నవారు, లాభాలకోసమే విద్యాసంస్థల్ని పెట్టేవాళ్లు విలువల బోధనపై శ్రద్ధ పెట్టలేరు. ఉపాధ్యాయులకి వృత్తే ప్రవృత్తి కావాలి. అప్పుడే విద్యార్థులకి, సమాజానికి న్యాయం జరుగుతుంది. ఉపాధ్యాయులకి ఈ తెలివిడి అయితే సమాజం ఇవ్వాలి, లేదా సంఘాలు కల్పించాలి.

ఉపాధ్యాయులు పిల్లల్ని అమితంగా ప్రేమించిన గిజూభాయి, మాకేరెంకో లాటి వాళ్ళని ఆదర్శంగా తీసుకోవాలి. పిల్లలు ఎలా నేర్చుకుంటారు, వాళ్ళ వైయుక్తిక తేడాలేమిటి అని తెలుసుకుని చెప్తే పిల్లలు ఎంతో సృజనాత్మకంగా తయారవుతారు.

* * *

ఏదో తన కొడుకు చదువుకోసం, బాగా చూసుకోండని రాస్తాడేమో అనుకున్నాను. ఏదో ఒకటి రెండు చోట్ల తప్ప తన కొడుకు గురించిన ప్రస్తావనే లేదు ఉత్తరంలో. మొత్తం అందరి విద్యార్థుల వికాసం కోసం రాసేడు. సజీవమైన విద్యావ్యవస్థ నిర్మాణానికి సరైన పునాది అవసరం గురించి మాట్లాడాడు. ఉత్తరం చివర్లో రాసిన విషయాలు ఇంకా నచ్చాయి నాకు. 'మీరెవరో, మీ సహ ఉపాధ్యాయులెవరో నాకు తెలీదు. నాకు మీ గురించి తెలీకుండా ఇవన్నీ నేను రాయడం సరైంది కాదు. కానీ, చర్చకి తప్పకుండా ఇది ప్రాతిపదిక అవుతుంది. మీకు దగ్గరగా ఉన్న టీచర్లతో చర్చించండి వీలైతే. మీకు ఏదైనా చెప్పాలనుకుంటే నాకు రాయండి. మీకీ ఉత్తరం ఎవరిచ్చారో వాళ్లకిస్తే సరిపోతుంది,' అని ముగించాడు.

'ఆ ఉత్తరం ఎంత నచ్చిందంటే, ఇప్పటికీ వుంది నాదగ్గర అది. సొంత కొడుక్కి రాసుకున్నా, సార్వ జనీనమైన విషయం ఉండబట్టి లింకన్ ఉత్తరం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. ఈ ఉత్తరం అంతకంటే ఎక్కువ విషయాలే చర్చించింది. ఇప్పటికైనా నలుగురికి తెలియడం మంచిది. ఈ సందర్భంగానైనా నలుగురిలోకి పోతే మంచిది,' అన్నారు రాఘవ సారు.

* * *

రచనలకు ఆహ్వానం

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తీకరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపిండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

\- సం.

'అరుణతార' సంపాదకులకు

70ల సాహిత్య విమర్శకులు ఎస్వీఎస్ రావు సృజనలో ఒక రచనలో 'ఱ' ప్రయోగిస్తూ ఒక రచన చేసారు. అది చూసి త్రిపురనేని మధుసూదనరావు సృజనలో బండి 'ర' ప్రయోగం అని ఒక ఘాటయిన వ్యంగ్య లేఖ రాసారు. 'అరుణతార' నవంబర్ సంచిక (308)లో దామరపల్లి నర్సింహారెడ్డి 'మృత్యుంజయులు' కవిత కింద సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినం సందర్భంగా అని బ్రాకెట్లలో అచ్చయిన వాక్యం చూసి నాకా లేఖ గుర్తుకొచ్చింది. అది భాషా సంబంధమైన ఛాందసాన్ని సవరించడానికయితే, ఇది రాజకీయ అవగాహనకు సంబంధించిన అంశం.

విప్లవాభిమానుల దృష్టిలో సెప్టెంబర్ 17న తెలంగాణలో జరిగింది సైనిక దురాక్రమణ. భారత ప్రభుత్వం సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో పేరుతో నాలుగు వైపుల నుంచి హైదరాబాద్ రాజ్యంపైకి సైన్యాన్ని పంపించి 17 నాటికి హైదరాబాద్ నగరంలో ప్రవేశించి ఆక్రమించుకున్నది. సెప్టెంబర్ 17న మీర్ ఉస్మానలీ ఖాన్ రేడియోలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాడు. దీనిని అధికారికంగా పోలీసు చర్యగా ప్రకటించిన భారత ప్రభుత్వం కూడ హైదరాబాద్ రాజ్యాన్ని 'అనెక్స్' చేసుకున్నట్లు (సైనిక చర్య ద్వారా) కలుపుకుంటున్నట్లు గానే ప్రకటించింది గానీ, తెలంగాణ విమోచన చెందినట్లుగా ప్రకటించలేదు. భారత ప్రభుత్వం కశ్మీర్, హైదరాబాద్లతో ప్రారంభించి గోవా (1962), సిక్కిం (1975) లదాకా ఇట్లా సైనిక చర్యల ద్వారా ఆక్రమించుకుంటూ పోయింది. ఈ మధ్యకాలంలో పొరుగు దేశమైన తూర్పు పాకిస్తాన్ను కూడ 'బంగ్లాదేశ్' పేరుతో ముక్తి ఫౌజ్ను పంపించి 1971లో 'విముక్తం' చేసింది. శ్రీలంకలో రాజీవ్ గాంధీ మొదలు సోనియా మన్మోహన్ చిదంబరం దాకా ఇండియా పీస్ కీపింగ్ ఫోర్స్ విమోచన జోక్యం గురించి ఎంత రాసినా తక్కువే.

ప్రస్తుతం తెలంగాణ విమోచన గురించే మాట్లాడుకుందాం. ఉత్పత్తి శక్తుల విముక్తి అర్థంలో తెలంగాణ విమోచన ఉద్యమాన్ని ప్రజలు ఆంధ్ర మహాసభ - సంగం - కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో పందొమ్మిది వందల ముప్పైలు, నలభైల నుంచి ఆయా స్థాయి భేదాలతో నిర్వహించారు. 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ ఇండియా నుంచి ఇంగ్లిష్ పాలకులు వెళ్లిపోయి ఢిల్లీలో నెహ్రూ పటేల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 1947 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ నాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియొద్దీన్లు సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చారు. (1946, జూలై 4న కడివెండిలో రైతు కూలీ సంఘం ఊరేగింపుపై విసునూరి దేశ్ముఖ్ రామచంద్రారెడ్డి ఏజెంట్ మిస్కిన్ కాల్పులు జరిపి ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్న దొడ్డి కొమురయ్యను బలిగొన్ననాడే ఆత్మరక్షణ కోసమైనా సరే ప్రజలు ఆయుధాలు పట్టుకోక తప్పదని కమ్యూనిస్టు పార్టీ పిలుపు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే.)

1947, నవంబర్ 29న భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యాధీశుడు మీర్ ఉస్మానలీ ఖాన్తో యథాతథ ఒడంబడిక చేసుకున్నది. అంటే 47 ఆగస్ట్ 15 నాటికి (ఆ మాటకొస్తే ఒడంబడిక పై సంతకం చేసుకున్న నాటికి) హైదరాబాద్ సంస్థానంలో ఏ విధంగా నైజాం అధికార చెల్లుబాటు అవుతున్నదో - ఇక ముందు కూడ ఆ విధంగానే చెల్లుబాటు అవుతుంది. హైదరాబాద్ సంస్థాన వ్యవహారాల్లో భారత ప్రభుత్వం జోక్యం చేసుకోదని ఆ ఒడంబడిక తాత్పర్యం. 'మా భూమి' నాటకంలో ఈ ఒడంబడిక గురించి ఎంతో ఆసక్తికరమైన ప్రస్తావన ఉంటుంది.

1948 సెప్టెంబర్ 13నాటికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజలు తెలంగాణలో మూడు వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని బీజప్రాయంగా రాజ్యాధికారాన్ని చవిచూసుకున్నారు. దానితో బెంబేలెత్తిన నెహ్రూ పటేల్ భారత ప్రభుత్వం నైజాంతో చేసుకున్న యథాతథ ఒడంబడికను తుంగలో తొక్కి సెప్టెంబర్ 13న సైనిక దాడికి పూనుకున్నది. కమ్యూనిస్టు పార్టీ, అందులో మితవాదులు వెనక్కి లాగినప్పటికీ ప్రజల అండతో పోరాటాన్ని 1951 నవంబర్ దాకా కొనసాగించింది. కనుక విద్రోహమంటూ చేస్తే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం 1951 నవంబర్ 25న చేసింది గానీ సెప్టెంబర్ 17ను విద్రోహం అనడానికి కూడ వీలు లేదు. స్టేట్ కాంగ్రెస్ అయినా, కమ్యూనిస్టేతరులు ఎవరైనా కోరుకున్నదే విలీనం. తెలంగాణ ప్రజలు, ఉత్పత్తి శక్తుల, సాధనాల విముక్తిని కోరుకున్నారు. అందుకు ప్రజలకు నాయకత్వం వహించింది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే. అటువంటి విమోచన సెప్టెంబర్ 17న జరుగలేదు గనుకనే విముక్తి పోరాటం కొనసాగించి పార్టీ నాయకత్వం 1951లో విరమించి విద్రోహం చేసింది.

1998 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వ ఉప ప్రధాని, హోం మంత్రి లాల్కృష్ణ అద్వానీ (48లో వల్లభభాయ్ పటేల్ వలెనే) నిజాం కాలేజ్ గ్రౌండ్స్లో బిజెపి నిర్వహించిన 'తెలంగాణ విమోచన స్వర్ణోత్సవాల్లో' ఈ విమోచన లేదా స్వతంత్ర దినాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రకటించాడు. భారతీయ జనతా పార్టీ ఏర్పడినప్పటి నుంచీ, ఆ మాటకొస్తే 48 సెప్టెంబర్ 17 నుంచీ ఆర్ఎస్ఎస్ వంటి సంఘపరివార్ శక్తుల డిమాండు ఇది.

1964లో కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలిపోయిన తర్వాత సిపిఐ కూడ ఈ డిమాండ్ను నెత్తికెత్తుకొని ఇప్పుడు 48 సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా నిర్వహిస్తున్నది. ఈ ఉత్సవాలకు ఎంఎల్ పార్టీలను, వాటి ప్రజా సంఘాలను కూడ ఆహ్వానిస్తున్నది. కొందరు నిర్విచక్షగా పోతున్నారు కూడ. ఇప్పుడు అధికారంలో లేదు గనుక కాంగ్రెస్ పార్టీ కూడ తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన లేదా స్వతంత్ర దినంగా నిర్వహించాలంటున్నది. తెరాస మత్రం నైజాం అనుకూలత వల్ల, హైదరాబాద్ మహానగరం ఎన్నికల్లో ముస్లిం ఓట్ల మీద దృష్టి వల్ల అటువంటి వైఖరి తీసుకోవడం లేదు. (సెప్టెంబర్ 13 - 17 మధ్య సైనిక దాడిలో, ఆ తర్వాత కూడ భారత సైన్యం హంతక అత్యాచార చర్యల్లో హైదరాబాద్ రాజ్యంలో రెండు లక్షల మంది ముస్లింలు మరణించారు. రజాకార్ల నెపంతో భారత సైన్యం ఈ దుర్మార్గాలు చేసిందని డా. జయసూర్య భారత హోం కార్యదర్శికి నివేదిక ఇచ్చాడు. పండిట్ సుందర్లాల్ కూడ కనీసం నలభై వేల మందిని ముస్లింలనైనా భారత సైన్యం చంపి ఉంటుందని నిజనిర్ధారణ ద్వారా నెహ్రూ దృష్టికి తెచ్చాడు.) అట్లని తెరాస సెప్టెంబర్ 17ను విద్రోహమనో, సైనిక దురాక్రమణ అనో అనదు. తెరాస దృష్టిలో అది స్వతంత్ర దినమే.

47 ఆగస్ట్ 15 పెద్ద స్వతంత్రం. దేశ స్వతంత్రం. 48 సెప్టెంబర్ 17 హైదరాబాద్ – ప్రత్యేకించి తెలంగాణ స్వాతంత్ర్య దినం. తెలంగాణ ఇట్లా సెప్టెంబర్ 17న వచ్చిన స్వాతంత్ర్యాన్ని 1 నవంబర్ 1956న కోల్పోయి మళ్లీ 2 జూన్, 2014న తిరిగి సాధించుకున్నది. ఇదీ తెరాస అవగాహన.

సెప్టెంబర్ 17ను విమోచన దినం అన్నపుడు కవిగా దామరపల్లి నర్సింహారెడ్డికి పైన చెప్పిన దృక్పథాల్లో విలీనం – స్వతంత్రం అనే అర్థంలో విమోచన దినం అనే అవగాహన కూడ ఉండవచ్చు. లేదా ఏకంగా ఆయన విమోచన దినంగానే భావించవచ్చు. కాని 'అరుణతార' ఈ కవిత వేసి, బ్రాకెట్లో ఆ సందర్భం రాసినపుడు – తన అవగాహన ఏమిటో చెప్పాలి కదా. అంటే విప్లవ దృక్పథమేమిటో చెప్పాలి కదా.

'మృత్యుంజయులు' పాట మొత్తం నాటి తెలంగాణ సాయుధ పోరాట వీరుల అమరత్వగానం. 'సాయుధ వీరనారి చాకలి ఐలమ్మ' గురించి రాసి 'పాలకుర్తి పౌరుషాల గడ్డ' అని వాడిన పురుషస్వామ్య ప్రయోగం తప్ప అభ్యంతరకరమైంది పెద్దగా ఏమీ లేదు. ఇంతరాసి సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినం అన్నాడు గనుక దీనిని సిపిఐ అవగాహన అనుకోవచ్చు. దామరపెల్లి నర్సింహారెడ్డికి ఆ అవగాహన ఉంటే అభ్యంతర పెట్టే హక్కు 'అరుణతార'కు లేని మాట నిజమే కాని, మీరు బ్రాకెట్లో రాసిన వాక్యం పట్ల మాకు అభ్యంతరం ఉంది అని ఆయనకు, ప్రచురించింది కాబట్టి పాఠకులు తెలియచేయాల్సిన బాధ్యత మాత్రం ఉంటుంది.

నవంబర్ సంచిక (307)లో 'ప్రభువా! అంతా నీ చిత్తమే..' (నాయకా, నీ కాళ్ల సందుల్లోంచి నడిచి పోతాం / శిశ్న సంధ్యలో శిశువులమై కేరుమంటాం), మై డియర్ హంతకుడా! (...తను వివస్త్రను చేసిన దేహం ముందే రాత్రితో రమించిన నల్లకోటు / దండెం మీద సాగిలబడి / సుఖ నిద్ర పోతుంటుంది), వంచనాపరులు (... నాకిష్టమైన సబ్బు రాస్కోని / శుభ్రంగా స్నానం చేసి / తెల్లచీర కట్టుకొని / పక్కమీద పడుకుంటే తెల్లవార్లు శుభ్రంగా వాడుకుంట / ఆ పైన కడుపు చేసి వదిలేస్త / పూలుపూసి కాయలు కాస్తే – కోసుకుంటా / మోడుబారి ఎండిపోతే కట్టెలు కొట్టి పొయ్యిలో పెడతా!...)

కవితల్లో నేను బ్రాకెట్లలో ప్రస్తావించిన చరణాలు కవులు ఉద్దేశించిన వ్యంగ్యాన్నో, ఆగ్రహాన్నో, 'మార్మిజం ద్వారా వివరించ'డాన్నో చేసాయని నాకనిపించడం లేదు. జుగుప్స మాత్రమే కలిగిస్తున్నాయి. శ్రీశ్రీ కొంపెల్లి జనార్ధనరావు కోసం రాసిన కవితలోనూ, దిగంబర కవుల చాల కవితల్లోనూ వాళ్లు వాడిన మాటలు, చరణాలు వాళ్ల ధిక్కార స్వరం నుంచి మన దృష్టినంతగా వాచ్యార్థాల వైపు మళ్లించవు. వాళ్లు ఉద్దేశించిన ఆగ్రహం, ఆవేశం, ఉత్తేజం మనకు కలుగుతాయి. ఆ ముగ్గురు కవులూ అది గమనించాలని కోరుతున్నాను.

సంపాదకవర్గానికి ఈ నా అభిప్రాయాలతో ఏమాత్రం ఏకీభావం ఉన్నా ఈ విషయాల్లో ఏమరుపాటుకు గురయిందనే చెప్పాల్సి ఉంటుంది. ఈ మాట రాస్తున్నపుడు స్వీయ విమర్శ చేసుకోవాల్సిన అవసరం కూడ ఉంది. నవంబర్ సంచిక ప్రూఫులు నా మెయిల్‌లో కూడ పెట్టారు. నేను చూడలేదు. అది నా అలసత్వమూ – లోపమే. చూసి ఉంటే 'మృత్యుంజయులు' పాట విషయంలో నా అవగాహనను సంపాదకుల దృష్టికి తెచ్చి ఉండేవాణ్ణి. ఇంత చర్చ బహుశా అవసరమై ఉండేది కాదు.

అమరురాలు గజ్జెల సరోజ నాకు అమరులు గజ్జెల గంగారామ్ సోదరిగా మొదట, నల్లా ఆదిరెడ్డి సహచరిగా తర్వాత మూడున్నర దశాబ్దాలుగా తెలుసు. మేమిద్దరం రామనగర్ కుట్రకేసులో సహముద్దాయిలం. నా అనుబంధాన్ని ఆమె అమరత్వం గురించి తెలియగానే 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో రాసాను. ఆమె ఆదిలాబాద్ జిల్లా కమిటీలో ఉన్నపుడు వాళ్ల సాహిత్యాన్ని, తన రచనలను కూడ నాకు పంపుతూ ఉండేది. అయినా విప్లవ రచయిత్రిగా ఆమె సాహిత్య కృషి గురించి 'షహీదా' ఇంత ఆత్మీయంగా రాసే వరకు అటువైపు నేనా దృష్టి పెట్టకపోవడం లోపమే. అయితే 'పోదాం కలిసి పోరాటానికి వస్తావా నువ్ నా వెంట' అనే పాట మాత్రం ఎన్‌కె రాసాడు. ఆ పాట తనకు నచ్చి సరోజ రాసుకొని ఉంటుంది. ఎల్లంకి అరుణ, సరోజ, షహీదాలకు ఆ పాట అంత ఇష్టమైంది కావడం, 'ఎంత చిన్న పదాల్లో ఎంత హాయిగా ఉందీ పాట' అనిపించడం, 'గెరిల్లాల పెళ్లి సందర్భంగా పాడడానికి రాశారేమో' అనిపించడం విడిగా రాసిన ఎన్‌కెకు, గొప్ప కాంప్లిమెంట్ అవుతుంది. ముఖ్యంగా ఆయన అనారోగ్యంతో శయ్యాగతుడై ఉన్న ఈ తరుణంలో ఇది అవసరమైన అభినందన.

- వివి

13.12.2014



చదవండి

చదివించండి

వెల : రు. 180/-

పేజీలు : 448

నక్సల్బరీ వెలుగులో...

(భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)

సమంతా బెనర్జీ

ప్రచురణ : విప్లవ రచయితల సంఘం

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.

www.virasam.in

Email : arunatara1977@gmail.com

-: స్వీకారం :-



పాదముద్రలు
కవిత్వం

శాఖమూరి రవి

ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం

వెల : రు. 25/-

పేజీలు : 54

కాలిబాట
ఉదయమిత్ర కవితలు

ప్రచురణ :
పాలమూరు
అధ్యయన వేదిక

వెల : 100/-

పేజీలు : 208

బీజభూమి
ఇతర కవితలు

వరవరరావు

ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం

వెల : రు. 100/-

పేజీలు : 160

స్పర్శ
(కవితలు)

జాలాది రత్న సుధీర్

ప్రచురణ :
జాలాది రత్న సుధీర్

వెల : రు. 60/-

పేజీలు : 68

స్ఫూర్తి
(పాటలు)

ప్రచురణ :
ప్రజా నాట్యమండలి

వెల : రు. 200/-

పేజీలు : 367



దర్పణం
కవిత

డా॥ ఎ.వి. వీరభద్రాచారి

ప్రచురణ :
విశ్వకళా పీఠం

వెల : రు. 100/-

పేజీలు : 146

డిశంబర్ 17 నుంచి 26 వరకు ఎన్.టి.ఆర్. స్టేడియం, హైదరాబాద్‌లో జరిగిన 28వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన దృశ్యాలు

KLVA101M174

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
● RNI Regn.No.21152/72 ● Published on 05/01/2015 310 - January, 2015

సాహిత్య వ్యక్తిత్వం



మరణం నా చివరి చరణం కాదు
మౌనం నా చితాభస్మం కాదు
నిర్విరామంగా నిత్య నూతనంగా
కాలం అంచున చిగురించే నెత్తుటి ఊహను నేను
కలల ఉపరితలమ్మీద కదలాడే కాంతి పుంజం నేను
కన్నీళ్లకి కర్తవ్యాన్ని నిర్దేశించే దిక్సూచిని నేను

అగ్ని పద్యం నేను - దగ్ధగీతం నేను అక్షర క్షిపణి నేను
ఆయుధాలుగా రూపాంతరం చెందే ఆకలి నేపథ్యం నేను
అడవి నేను - కడలి నేను
ఉప్పొంగే మానవ సమూహాల సంఘర్షణ నేను
అజ్ఞాతంగా అంతర్లీనంగా
మట్టి పొరల్లోంచి పరివ్యాప్తమవుతున్న పోరాట పరిమళం నేను

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 0
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M174
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Apsar
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good